www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 4-3-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 | సంచిక (Issue) : 319

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, బహుళపక్షం; తిథి: అష్టమి ఉ. 8.50 తదుపరి నవమి; నక్షత్రం: జ్యేష్ఠ సా. 4.22 తదుపరి మూల; వర్జ్యం: రా.12.15-1.49; దుర్ముహూర్తం: మ.12.51-1.38, మ.3.12-3.59; అమృతఘడియలు: ఉ.7.24-9.02; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 6.35; సూర్యాస్తమయం: 6.20

హైదరాబాద్ సిటీ *

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

తెలుగువారి ప్రభావం తగ్గుతోంది

- దేశ రాజకీయాల్లో ఇది మంచిది కాదు
- పార్ట్ టైమ్ పొలిటీషియన్ల వల్లే ఈ పరిస్థితి
- ఇది మన మనుగడకే ముప్పు
- మాజీ గవర్నర్ రామ్మోహన్‌రావు ఆత్మకథ పుస్తకావిష్కరణలో సీఎం రేవంత్ రెడ్డి
- ఉత్తరాది పెత్తనంపై పరోక్ష వ్యాఖ్యలు

హైదరాబాద్ సిటీ, మార్చి3 (ఆంధ్రజ్యోతి): జాతీయ రాజకీయాల్లో తెలుగు వారి ప్రభావం క్రమంగా తగ్గుతోందని, ఇది మంచి పరిణామం కాదని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. దేశ రాజకీయాల్లో పార్ట్‌టైమ్ పొలిటీషియన్లు ఎక్కువ ఉండటమే ఈ పరిస్థితికి ప్రధాన కారణం కావచ్చని అభిప్రాయపడ్డారు. గతంలో నీలం సంజీవరెడ్డి, పీవీ నరసింహారావు, ఎన్టీఆర్ లాంటి నేతలు జాతీయ రాజకీయాలను శాసించే స్థాయికి ఎదిగారని గుర్తుచేశారు. తర్వాత ఆ స్థాయిని నిలబెట్టేందుకు

మిగతా 2వ పేజీలో...



ఎమ్మెల్యేలపై వ్యతిరేకతతోనే

పార్టీ ఓటమి

- కేసీఆర్ గెలవాలని ప్రజలు కోరుకున్నారు
- ఓడిన ఎమ్మెల్యేలపై వ్యతిరేకత ఇంకా తగ్గలేదు
- అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను పట్టించుకోవద్దు
- లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ మధ్యే పోటీ
- ఎల్ఆర్ఎస్‌ను విమర్శించి.. ఇప్పుడు అమలు
- రాష్ట్రవ్యాప్తంగా బస్సు యాత్రలు చేపడతాం
- బీఆర్ఎస్ శ్రేణులతో మాజీ సీఎం కేసీఆర్
- 12న కరీంనగర్‌లో భారీ బహిరంగ సభ

హైదరాబాద్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): "కొద్ది రోజుల పాలనలోనే.. కాంగ్రెస్ సర్కారుపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైంది. త్వరలోనే రైతులు రోడ్డెక్కే పరిస్థితి వస్తుంది" అని బీఆర్ఎస్ చీఫ్, మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు వ్యాఖ్యానించారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్-బీజేపీ మధ్యే పోటీ ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఆదివారం ఆయన కరీంనగర్, పెద్దపల్లి లోక్‌సభ సెగ్మెంట్లకు చెందిన పార్టీ ముఖ్యులతో తెలంగాణ భవన్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా లోక్‌సభ ఎన్నికలకు అనుసరించాల్సిన వ్యూహం, అభ్యర్థుల ఎంపిక తదితర అంశాలపై సమాలోచనలు

మిగతా 10వ పేజీలో...

కరీంనగర్‌కు వినోద్, పెద్దపల్లికి కొప్పుల!

నేడు 9 లోక్‌సభ స్థానాలకు అభ్యర్థుల ప్రకటన? 10

కాళేశ్వరానికి 4 నెలలు హాలిడే?

బ్యారేజీల డిజైన్లు, నిర్మాణంపై అధ్యయనానికి కమిటీ

- మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల వైఫల్యాలకు కారణాలు, పరిష్కారాలు కనుగొనాలంటూ మార్గదర్శకాలు
- నాలుగు నెలల్లోగా నివేదిక సమర్పించాలని గడువు
- ఆ తర్వాతే మరమ్మతులు, పునరుద్ధరణకు అవకాశం
- జూన్, జూలైలో వరదలు.. మరమ్మతులకు వీల్లేని పరిస్థితి
- ఏడాది కాలం వృథా అవుతుందా? అన్న అనుమానాలు
- 6న ప్రాజెక్టును పరిశీలించనున్న నిపుణుల కమిటీ
- కమిటీకి అన్ని విధాలుగా సహకరిస్తాం: ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టుకు హాలిడే పరిస్థితులు నెలకొననున్నాయా? ఈ ఏడాది మొత్తం ప్రాజెక్టు కింద పంటల సాగుకు నీరందించలేని పరిస్థితి ఎదురుకానుందా? అంటే.. ప్రస్తుత పరిణామాలను బట్టి ఇలాంటి అభిప్రాయాలే వ్యక్తమవుతున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడం, అన్నారం బ్యారేజీకి బుంగలు పడిన నేపథ్యంలో.. ఈ రెండింటితోపాటు సుందిళ్ల బ్యారేజీ డిజైన్లు, నిర్మాణాన్ని పరీక్షించేందుకు నేషనల్ డ్యామ్‌సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) నిపుణుల కమిటీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) మాజీ చైర్మన్ జె.చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలో ఆరుగురు సభ్యులతో ఈ కమిటీని నియమించారు. మూడు బ్యారేజీల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి.. వాటికి పరిష్కారాలతోపాటు భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను సిఫారసు చేయాలని కమిటీని ఆదేశించారు. ఈ మేరకు నాలుగు నెలల్లోగా ఎన్డీఎస్ఏకు నివేదిక సమర్పించాలని గడువు విధించారు. మరోవైపు.. ఎన్డీఎస్ఏ నిపుణుల కమిటీ.. బ్యారేజీలను పరీక్షించి నివేదిక సమర్పించిన తర్వాతే వాటికి మరమ్మతులు గానీ, పునరుద్ధరణ పనులు గానీ చేపట్టేందుకు వీలుంటుందని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇప్పటికే

మిగతా 2వ పేజీలో...



మేడిగడ్డ బ్యారేజీలో భారీగా పగుళ్లు వచ్చిన పిల్లర్



నేడే మోదీ రాక

- ఆదిలాబాద్ బహిరంగ సభలో పాల్గొననున్న ప్రధాని
- రామగుండం ఎన్టీపీసీ పవర్ ప్లాంట్ ప్రారంభం
- రూ.6 వేల కోట్ల పనులకు శంకుస్థాపన, ప్రారంభాలు
- సభలో ప్రధానితో కలిసి పాల్గొననున్న సీఎం రేవంత్
- రేపు సంగారెడ్డిలో సభ.. రూ.9 వేల కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం
- 12 రాష్ట్రాల్లో 10 రోజులు మోదీ సుడిగాలి పర్యటనలు

ఆదిలాబాద్/హైదరాబాద్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల నగారా మోగనున్న వేళ ప్రధాని మోదీ తెలంగాణ పర్యటనకు వస్తున్నారు. ఇక్కడి నుంచే ఎన్నికల సమర శంఖం పూరించేందుకు సిద్ధమవుతున్నారు. సోమ, మంగళ వారాల్లో రాష్ట్రంలో పర్యటించనున్న మోదీ.. రూ.15 వేల కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. సోమవారం ఉదయం 9.20 గంటలకు ప్రధాని మహారాష్ట్రలోని నాగ్‌పూర్ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో

మిగతా 2వ పేజీలో...

వచ్చే ఐదేళ్లలో ఏం చేద్దాం?

- సర్కారు ఏర్పడగానే తొలి 100 రోజుల్లో కార్యాచరణేంటి?
- మోదీ అధ్యక్షతన కేంద్ర మంత్రి మండలి మేధోమథనం
- 'వికసిత్ భారత్-2047'పై చర్చ.. డీప్ ఫేక్‌తో జాగ్రత్త 14
- మంత్రులూ ఎన్నికల వేళ వివాదాలకు దూరంగా ఉండండి
- విజేతలై రండి, మళ్లీ కలుద్దామని మోదీ వీడ్కోలు సందేశం

బీఆర్ఎస్‌లో పోటీకి సిటింగ్‌లు

విముఖం?



- చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, మానుకోట ఎంపీ కవిత వెనుకంజ!
- ఇప్పటికే బీజేపీలో చేరిన కొందరు.. నేడోరేపో మరో ముగ్గురు..

హైదరాబాద్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల ముంగిట భారతీయ రాష్ట్ర సమితి(బీఆర్ఎస్) వింత సమస్యను ఎదుర్కొంటోంది..! అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత ఆ పార్టీలో సమీకరణాలు వేగంగా మారిపోతున్నాయి. పలువురు సిటింగ్ ఎంపీలు ఆ పార్టీ తరఫున పోటీకి వెనుకంజ వేస్తున్నట్లు తెలుస్తోంది. సిటింగ్ ఎంపీలను బుజ్జగిస్తున్నా.. కొందరు ససేమిరా అంటున్నట్లు తెలిసింది. దీంతో.. ఆయా స్థానాల్లో ఎవరిని బరిలోకి దింపాలనే అంశంపై బీఆర్ఎస్ అధిష్ఠానం మల్లగుల్లాలు పడుతోంది. ముఖ్యంగా చేవెళ్ల సిటింగ్ ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి పోటీకి నో అంటున్నట్లు సమాచారం. దాంతో ఆ స్థానం నుంచి కాసాని వీరేశం.. లేదా సబితారెడ్డి తనయుడు పటోళ్ల కార్తీక్ రెడ్డి పేర్లను కేసీఆర్ పరిశీలిస్తున్నట్లు

మిగతా 10వ పేజీలో...

బీఆర్ఎస్‌కు మరో షాక్!

- కమలం గూటికి అరూరి రమేశ్!
- నేడో, రేపో చేరేందుకు మాజీ ఎమ్మెల్యే ఏర్పాట్లు
- వరంగల్ ఎంపీ సీటుపై బీజేపీ నుంచి అరూరికి హామీ?

10

సీఎంతో వరంగల్ మేయర్ భేటీ

- గుండు సుధారాణి హస్తం గూటికి వెళ్తారని ప్రచారం
- కాంగ్రెస్‌లోకి 15 మంది బీఆర్ఎస్ కార్పొరేటర్లు!
- సీఎం రేవంత్ రెడ్డితో బీఆర్ఎస్ ఎమ్మెల్యే వెంకట్రావు భేటీ
- కాంగ్రెస్‌లోకి వర్ధన్నపేట మునిసిపల్ చైర్‌పర్సన్



కదిలిన యంత్రాంగం

జిల్లా కలెక్టర్ ఆదేశాలతో వట్టినాగులపల్లి భూముల సర్వే

- అధికారులతో కలిసి వివరాలు సేకరించిన తహసీల్దార్.. ఉన్నతాధికారులకు సమగ్ర నివేదిక ఇస్తామని వెల్లడి
- తాను కొన్నది భూదాన్ భూమి కాదన్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి వివరణకు, రికార్డులకు కుదరని పొంతన
- 2014లో భూమి రిజిస్ట్రేషన్.. 2021లో రికార్డుల్లో నమోదు



భూదాన్ భూముల్ని పరిశీలిస్తున్న గండిపేట తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి/నార్సింగి)

రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం వట్టినాగులపల్లిలోని భూదాన్ బోర్డు భూములను బడా బాబులు కాజేసిన వ్యవహారంపై అధికార యంత్రాంగం స్పందించింది. దాదాపు రూ.2 వేల కోట్ల విలువైన భూములను నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్ చేయించుకోవడంపై విచారణ మొదలుపెట్టింది. వట్టినాగులపల్లిలోని 29.27 ఎకరాల భూదాన్ భూములను పెద్దలు చెరబట్టిన వ్యవహారంపై 'ఆంధ్రజ్యోతి' రెండు రోజులుగా వరుస కథనాలు ప్రచురించిన నేపథ్యంలో.. దీనిపై జిల్లా కలెక్టర్ శశాంక విచారణకు ఆదేశించారు. వట్టినాగులపల్లిలోని మొత్తం భూదాన్ భూములపై విచారణ జరిపి, సమగ్ర నివేదిక ఇవ్వాలని నిర్దేశించారు. దీంతో రెవెన్యూ యంత్రాంగం కదిలింది. ఆదివారం గండిపేట

మిగతా 8వ పేజీలో...



జగన్‌కు భారీ ఓటమే!

- ఆంధ్రలో టీడీపీ గెలుపు ఖాయం
- ప్రజలు అభివృద్ధి కోరతారు..
- యువత ఉద్యోగాలడుగుతారు
- భవంతిలో కూర్చుని బటన్ నొక్కితే ఓట్లు రాలవు 8
- జగన్‌కూ కేసీఆర్ గతే: పీకే

పట్టణ ప్రాంత తలసరి ఖర్చులో దక్షిణాదిన

తెలంగాణే టాప్

- ఆ జాబితాలో జాతీయస్థాయిలో 5వ స్థానం.. జాతీయ సగటు కన్నా మనదే ఎక్కువ
- ఉత్తరాదిన పలు పెద్ద రాష్ట్రాలతో పోలిస్తే దక్షిణాది రాష్ట్రాలే ఈ విషయంలో మెరుగు
- సిగరెట్లు, మద్యం, అద్దె, వైద్యం, రవాణా తదితర ఆహారేతర వ్యయాల పెరుగుదల
- 11 ఏళ్లలో ఆహారంపై తగ్గిన ఖర్చు.. 2022-23 గృహ వినియోగ వ్యయ సర్వేలో వెల్లడి



హైదరాబాద్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): నెలవారీ తలసరి వినియోగ వ్యయం (ఎంపీసీఈ) విషయంలో.. గ్రామీణ, పట్టణ ప్రాంతాలు రెండింటిలోనూ తెలంగాణ సగటు జాతీయ సగటు కన్నా మెరుగ్గా ఉంది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో మన రాష్ట్రంలో ఈ వ్యయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.4,802గా.. పట్టణ ప్రాంతాల్లో రూ.8,158గా ఉన్నట్టు జాతీయ గణాంక సర్వే కార్యాలయం నిర్వహించిన 'గృహ వినియోగ వ్యయ సర్వే (హెచ్‌సీఈఎస్): 2022-23'లో వెల్లడైంది. జాతీయస్థాయిలో ఈ సగటు.. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వరుసగా రూ.3,773, రూ.6,459గా ఉండడం గమనార్హం. దేశవ్యాప్తంగా పట్టణ ప్రాంతాల్లో ఎంపీసీఈ అధికంగా ఉన్న రాష్ట్రాల జాబితాలో వరుసగా సిక్కిం (రూ.12,105), గోవా (రూ.8,734), అరుణాచల్ ప్రదేశ్ (రూ.8,636),

మిగతా 10వ పేజీలో...



పట్నా సభలో లాలూతో మాట్లాడుతున్న రాహుల్, ఖర్గే

'ఇండియా' ఎన్నికల భేరి! 14

- పట్నాలో భారీ స్థాయిలో 'జనవిశ్వాస్ మహా ర్యాలీ'
- రాహుల్, ఖర్గే, అఖిలేశ్, తేజస్వి, లాలూ హాజరు
- వామపక్షాల నేతలూ.. నితీశ్‌పై నేతల విసుర్లు
- ఆయన్ను మళ్లీ కూటమిలోకి తీసుకోవద్దు: ఖర్గే
- ఈసారి వస్తే బయటకు నెట్టేస్తా: లాలూ
- లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్, బిహార్‌లో ఓడిస్తే బీజేపీ అధికారంలోకి రాదు: అఖిలేశ్‌యాదవ్

టీచర్ పోస్టులకు దరఖాస్తులు

నేటి నుంచే

- అభ్యర్థులకు ఏప్రిల్ 2 వరకు అవకాశం
- రోస్టర్.. సబ్జెక్టుల వారీ పోస్టుల ప్రకటన

హైదరాబాద్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో భాగంగా సోమవారం నుంచి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కానుంది. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న సుమారు 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ఫిబ్రవరి 29న సీఎం రేవంత్ స్వయంగా మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేసిన సంగతి తెలిసిందే. కాగా, గతంలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మళ్లీ ఇప్పుడు దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదు. కొత్త అభ్యర్థులు మాత్రం సోమవారం నుంచి ఏప్రిల్ 2 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను చేసుకోవాల్సి ఉంటుంది. అభ్యర్థులు ఒక్కో

మిగతా 2వ పేజీలో...

నేడు మరో 5,278 మందికి ఉద్యోగ

నియామక పత్రాలు

ఎల్బీ స్టేడియంలో సీఎం చేతులమీదుగా 2

11న సీఎం భద్రాచలం పర్యటన

ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలుకు శ్రీకారం



బైక్‌పై వెళ్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

20 ఏళ్లు కాంగ్రెస్‌దే అధికారం

- కాంగ్రెస్ గృహజ్యోతి ఫేమస్.. కేసీఆర్ 24గంటల కరెంట్ బోగస్
- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి
- బైక్‌పై పర్యటించి కేడర్‌లో జోష్ నింపిన మంత్రి

హైదరాబాద్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): "కాంగ్రెస్ గృహజ్యోతి ఫేమస్.. కేసీఆర్ 24 గంటల కరెంట్ బోగస్. రాబోయే 20 ఏళ్లు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటుంది" అని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. గత పదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వలేదని, రేషన్ కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డులు కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. ఆదివారం నల్లగొండ జిల్లాలోని కనగల్, తిప్పర్తి మండలాల్లో గృహజ్యోతి పథకాన్ని ప్రారంభించిన ఆయన.. పలువురు లబ్ధిదారులకు జీరో కరెంటు బిల్లులను అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తాము అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే 4 గ్యారెంటీలను అమలు చేస్తున్నామని, మరో వారంలో ఐదో గ్యారెంటీ అయిన 'ఇందిరమ్మ ఇల్లు' పథకాన్ని అమలుచేయబోతున్నామని చెప్పారు. ఇప్పటికే 25వేల ఉద్యోగాలను భర్తీ చేశామని, గ్రూప్-1 నోటిఫికేషన్, మెగా డీఎస్సీ ప్రకటించామని తెలిపారు. కాంగ్రెస్ అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉంటుందని, రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ 90 రోజుల్లోనే అమలు చేస్తోందన్నారు. వేల కోట్ల రూపాయల బకాయిలు ఉన్నప్పటికీ ఉద్యోగులకు ప్రతినెలా ఒకటో తేదీన జీతాలు ఇస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం ఘనంగా పథకాలను అమలు చేస్తుండటంతో ప్రతిపక్షాలు జీర్ణించుకోలేకపోతున్నాయని, అందుకే లేనిపోని ఆరోపణలు చేస్తూ కాలం వెళ్లదీస్తున్నారని మండిపడ్డారు. కాగా నల్లగొండ పట్టణంలోని పలు కార్యక్రమాలకు కోమటిరెడ్డి బైక్‌పై వెళ్లి హాజరయ్యారు. టూ వీలర్‌పై పర్యటిస్తూ.. పార్టీ కేడర్‌లో జోష్ నింపారు.

లోకం తీరు



విదేశాల నుంచి ప్రెసిడెంట్లు వచ్చినప్పుడు రంగు బొమ్మలతో గోడలు కడుతారు. అది చూసి నివేదిక ఇచ్చారేమో!



'గవర్నర్‌పేట టు గవర్నర్స్ హౌజ్' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్

తెలుగువారి ప్రభావం తగ్గుతోంది

(మొదటిపేజీ తరువాయి)

జైపాల్‌రెడ్డి, వెంకయ్య నాయుడు కొంతవరకు ప్రయత్నించారన్నారు. ఇప్పుడు జాతీయ రాజకీయాల్లో అలాంటి నేతలు కనిపించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది మన మనుగడకే మంచిది కాదన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో ఉన్న ఎంసీహెచ్‌ఆర్డీలో ఉమ్మడి ఏపీ మాజీ డీజీపీ, తమిళనాడు మాజీ గవర్నర్ పీఎస్ రామ్మోహన్‌రావు రాసిన తన ఆత్మకథ 'గవర్నర్‌పేట టు గవర్నర్స్ హౌజ్' పుస్తకాన్ని సీఎం రేవంత్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ పుస్తకం పొలిటికల్ సస్పెన్స్ థ్రిల్లర్ అవుతుందన్నారు. కాంగ్రెస్ రాజకీయాల మీద రచయిత వెల్లడించిన కొన్ని విషయాలు, విశ్లేషణలతో తాను ఏకీభవించకపోవచ్చంటూ చమత్కరించారు. భాష, భావం అనేవి ఉంటాయని నేటి రాజకీయాల్లో చర్చించుకొనే పరిస్థితి రావడం బాధాకరమని రేవంత్ అన్నారు. 'దేశంలో హిందీ తర్వాత ఎక్కువగా మాట్లాడే భాష తెలుగు. మరి ఆ స్థాయిలోనే తెలుగు వారు జాతీయ రాజకీయాల్లో ప్రభావం చూపాలి. నిర్ణయాధికారంలో భాగస్వామ్యం కావాలి. ఎప్పుడైనా ఢిల్లీకి వెళ్తే ఎవరిని కలవాలో.. మనవారు ఎవరున్నారో వెతుక్కోవాల్సిన పరిస్థితి. గతంలో ప్రధాని పదవిలో ఉత్తర భారతీయుడుంటే, రాష్ట్రపతి పదవిలో దక్షిణాది వ్యక్తి ఉండేవారు. కేంద్ర క్యాబినెట్‌లోనూ కీలక ఐదు శాఖల్లో మూడింటిని దక్షిణాది నేతలకు కేటాయించేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. దీనికి కారణాలు, పరిష్కార మార్గాలపై అనుభవజ్ఞులు ఆలోచించాలి' అని దక్షిణాదిపై ఉత్తరాది నేతల పెత్తనం గురించి రేవంత్ పరోక్ష వ్యాఖ్యలు చేశారు. తెలుగు రాష్ట్రాల్లోని ప్రస్తుత పరిణామాలు గమనిస్తుంటే, ఇది మన మనుగడకు మంచిది కాదనిపిస్తోందంటూ పరోక్షంగా ఏపీ, తెలంగాణ పట్ల కేంద్రం వ్యవహరిస్తున్న తీరును ఉద్దేశిస్తూ సీఎం మాట్లాడారు.

రాష్ట్రాలుగా విడిపోయినా కలిసి నడుద్దాం..

భౌగోళికంగా రెండు రాష్ట్రాలుగా విడిపోయినా, జాతీయ రాజకీయాల్లో ప్రాభవాన్ని నిలబెట్టడం కోసం తెలుగువారిగా కలిసి ప్రయాణం మొదలుపెట్టాల్సిన అవసరం ఉందని నొక్కిచెప్పారు. కేంద్రం చెబుతోన్న 5 ట్రిలియన్ ఎకానమీలో తెలుగు వారి పాత్ర ఎలా ఉండాలి, దేశ రాజకీయాల్లో మన పాత్ర ఎలా ఉండాలి లాంటి విషయాల మీద మేధావులు ఆలోచించాలన్నారు. 'రాష్ట్రాలుగా విడిపోయినా, మనుషులుగా కలిసుందాం. తెలంగాణను అభివృద్ధి పథం వైపు నడిపించి, ఆ ఫలాలను ప్రజలకు అందించాల్సిన బాధ్యత మాపై ఉంది. ఆ దిశగా పరిపాలన సాగించేందుకు అనుభవజ్ఞులు, అధికారుల నుంచి మా ప్రభుత్వం సలహాలు, సూచనలు తీసుకుంటుంది. రాజకీయాల్లో మంచి సంప్రదాయాలు పాటించేందుకు మా ప్రభుత్వం సిద్ధంగా ఉంది' అని చెప్పారు. గతంలో పీవీకి ప్రధానిగా అవకాశం వచ్చిన సందర్భంలో నంద్యాలలో ఎన్టీఆర్ తమ పార్టీ అభ్యర్థిని పోటీకి పెట్టకుండా ఏకగ్రీవం చేసే ప్రయత్నం చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో మాజీ ఐపీఎస్, కేంద్ర మాజీ మంత్రి పీవీ రంగయ్య నాయుడు, డీజీపీ రవి గుప్తా తదితరులు మాట్లాడారు. పుస్తక రచయిత రామ్మోహన్‌రావుతో తమకున్న అనుబంధాన్ని ప్రస్తావించారు. ఐపీఎస్ అధికారిగా, తమిళనాడు గవర్నర్‌గా తన అనుభవాలను, ఆనాటి రాజకీయ పరిస్థితులను ఈ పుస్తకంలో వెల్లడించినట్లు రామ్మోహన్ రావు వివరించారు.

కాళేశ్వరానికి 4 నెలలు హాలిడే?

(మొదటిపేజీ తరువాయి)



పలుమార్లు ప్రకటించారు. అంటే.. కమిటీ సిఫారసులకు అనుగుణంగా జూలై తొలివారం తర్వాతే పునరుద్ధరణ పనులు చేపట్టే అవకాశం ఉంది. దీంతో రానున్న నాలుగు నెలలపాటు కాళేశ్వరం ప్రాజెక్టుకు హాలిడే ప్రకటించినట్లేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కానీ, మేడిగడ్డ బ్యారేజీకి జూన్, జూలై మాసాల్లోనే వరద ప్రారంభమవుతుంది. ఆలోగా నిపుణుల కమిటీ నివేదిక వచ్చినా.. వెంటనే మరమ్మతు పనులు చేయడానికి కూడా అవకాశం ఉండదని, వరదలు తగ్గాకే సాధ్యమవుతుందని అంచనా వేస్తున్నారు. అయితే వరదలు తగ్గడానికి డిసెంబరు, జనవరి వరకు ఆగాల్సి ఉంటుంది. దీంతో ఏడాది కాలం వృధా కానుందా? అన్న సందేహాలు నెలకొన్నాయి. ఒకవేళ.. నిపుణుల కమిటీ ప్రాజెక్టును సందర్శించాక వెంటనే తీసుకోవాల్సిన కొన్ని తాత్కాలిక చర్యల్ని సూచిస్తూ మధ్యంతర నివేదికను ఇస్తే మాత్రం.. అందుకనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశం ఉంటుంది. నిపుణుల కమిటీ తన పనిని వెంటనే మొదలు పెట్టనుంది. ఈ నెల 6న ప్రాజెక్టును పరిశీలించనుంది.

గతంలోనూ నిపుణుల కమిటీ నివేదిక..

గతేడాది అక్టోబరు 21న మేడిగడ్డ బ్యారేజీలోని ఏడో బ్లాక్ కుంగిపోగా, ఆ తర్వాత వరుసగా రెండు పర్యాయాలు అన్నారం బ్యారేజీకి బుంగలు ఏర్పడి భారీగా నీళ్లు లీక్ అయిన విషయం తెలిసిందే. ప్లానింగ్, డిజైన్లు, నిర్మాణం, నాణ్యత, పర్యవేక్షణ, నిర్వహణ లోపాలతోనే మేడిగడ్డ బ్యారేజీ కుంగిందని గతంలో ఎన్డీఎస్‌ఏ ఏర్పాటు చేసిన మరో నిపుణుల కమిటీ తేల్చింది. అన్నారం బ్యారేజీ పునాదుల దిగువన పాతిన సెకెంట్ పైల్స్‌కి పగుళ్లు రావడంతోనే బ్యారేజీలో పదే పదే బుంగలు ఏర్పడుతున్నాయని మరో నివేదికలో పేర్కొంది. మూడు బ్యారేజీలను ఒకే తరహా డిజైన్లు, సాంకేతికతతో నిర్మించినందున మూడింటిలోనూ లోపాలుంటాయని, అన్నింటికీ జియోఫిజికల్, జియోలాజికల్ పరీక్షలు నిర్వహించాలని అప్పట్లో సూచించింది. ఈ నేపథ్యంలో మూడు బ్యారేజీల డిజైన్లు, నిర్మాణ లోపాలపై సమగ్ర అధ్యయనం జరిపి తీసుకోవాల్సిన చర్యలను సిఫారసు చేయడానికి నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం ఫిబ్రవరి 13న ఎన్డీఎస్‌ఏకు లేఖ రాసింది. ఈ మేరకు డ్యామ్ సేఫ్టీ చట్టం 2021లోని 2వ షెడ్యూల్‌లోని 8వ క్లాజు కింద కమిటీని ఏర్పాటు చేస్తూ ఎన్డీఎస్‌ఏ నిర్ణయం తీసుకుంది.

బ్యారేజీల అధ్యయనానికి విధి విధానాలివే..

- మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల తనిఖీలు నిర్వహించాలి. మూడు బ్యారేజీలను నిర్మించిన స్థలం(సైట్)తో పాటు హైడ్రాలిక్, స్ట్రక్చరల్, జియోటెక్నికల్ వంటి అంశాలకు సంబంధించిన సమస్యలను నిర్ధారించడానికి అధికారులు, కాంట్రాక్టర్లు, ఇతర భాగస్వామ్య వర్గాలతో చర్చలు జరపాలి.
- ప్రాజెక్టు డేటా, డ్రాయింగ్స్, డిజైన్ల నివేదికలు, టెస్ట్‌లు, సైట్ ఇన్వెస్టిగేషన్ రిపోర్ట్స్, బ్యారేజీల తనిఖీ నివేదికలు, మూడు బ్యారేజీల డిజైన్, నిర్మాణం, నాణ్యత పర్యవేక్షణ, నాణ్యత హామీల నివేదికలు/మెటీరియల్‌ను పరిశీలించాలి.
- బ్యారేజీ నిర్మాణంలో భాగంగా చేపట్టిన ఇన్వెస్టిగేషన్లు, డిజైన్లు, నిర్మాణం, నాణ్యత పర్యవేక్షణ, ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్, ఇతర వ్యవహారాల్లో పాలుపంచుకున్న భాగస్వామ్య వర్గాల (ప్రభుత్వ, ప్రభుత్వ రంగ, ప్రైవేటు)తో సంప్రదింపులు జరపాలి.
- ప్రభుత్వ అధికారులతోపాటు సంబంధిత ఏజెన్సీలతో మాట్లాడి బ్యారేజీలకు సంబంధించిన అన్ని అంశాలను చర్చించాలి.
- మూడు బ్యారేజీ డిజైన్ల రూపకల్పనకు దోహద పడిన ఫిజికల్, మ్యాథమేటికల్ మోడల్ స్టడీస్‌ను పరిశీలించాలి. (బ్యారేజీల డిజైన్ల రూపకల్పనకు ముందు ప్రయోగాత్మకంగా ల్యాబ్‌లలో నమూనా బ్యారేజీలను రూపొందించి వరదలను తట్టుకోవడంలో వాటి పనితీరును పరీక్షించి చూస్తారు)
- మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడంతోపాటు ఇతర లోపాలకు కారణాలను కమిటీ పరీక్షించి నిర్ధారించాలి. మేడిగడ్డకు ఎగువన ఉన్న అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లోని అపాయకర పరిస్థితులను పరీక్షించి కారణాలను నిర్ధారించాలి.
- మూడు బ్యారేజీల్లోని సమస్యలను గుర్తించి.. నష్ట నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, పరిష్కారాలు, చేపట్టాల్సిన తదుపరి అధ్యయనాలు, పరిశోధనల్ని కమిటీ సిఫారసు చేయాలి. భవిష్యత్తులో మళ్లీ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలనూ సూచించాలి.
- అవసరమైతే ఎన్డీఎస్‌ఏ ఛైర్మన్ అనుమతితో ఈ కమిటీలో ఎవరైనా ఇతర సభ్యుడిని నియమించుకోవచ్చు.
- నాలుగు నెలల్లోగా ఎన్డీఎస్‌ఏకు కమిటీ నివేదిక సమర్పించాలి.

6న రానున్న నిపుణుల కమిటీ : ఉత్తమ్



కాళేశ్వరం ప్రాజెక్టు పరిశీలనకు నిపుణుల కమిటీ ఈ నెల 6న రానుందని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆ కమిటీ రాకను స్వాగతిస్తున్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిపుణుల కమిటీకి రాష్ట్ర ప్రభుత్వం అన్నివిధాలా సహకరిస్తుందని, నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచనలకు ప్రాధాన్యం ఇస్తుందని అన్నారు. కుంగిపోయిన మేడిగడ్డ బ్యారేజీని గతంలోనే ఎన్‌డీఎస్‌ఏ పరిశీలించి నీటిని ఖాళీ చేయాలని సూచించిందని తెలిపారు. అనంతరం సుందిళ్ల, అన్నారం బ్యారేజీలను కూడా పరిశీలించి వాటిలోనూ నీటిని ఖాళీ చేయాలని సూచించిందని వెల్లడించారు. వారి సూచన మేరకే నీటిని ఖాళీ చేస్తున్నామని అన్నారు. ఈ విషయంలో బీఆర్ఎస్ రాజకీయాలు చేస్తూ నీటిని నింపాలని డిమాండ్ చేయడం బాధ్యతారాహిత్యమన్నారు. నిపుణుల కమిటీ నివేదిక ఇవ్వడానికి నాలుగు నెలల సమయమున్నప్పటికీ, సాధ్యమైనంత త్వరగా ఇవ్వాల్సిందిగా కోరుతున్నామని మంత్రి తెలిపారు. బీఆర్ఎస్ నేతలకు ఎలాంటి సాంకేతిక అవగాహన లేకున్నా మాట్లాడడం దురదృష్టకరమన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో గత ప్రభుత్వం చాలా నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, నాణ్యత, నిర్వహణ, నిర్మాణం, డిజైన్లు, అన్ని విషయాల్లోనూ నిబంధనలను తుంగలో తొక్కిందని ఆరోపించారు. ప్రాజెక్టుకు గుండెకాయ లాంటి మేడిగడ్డ కుంగిపోతే ఆవేదన వ్యక్తం చేయాల్సింది పోయి.. ఒక్క పిల్లర్ మాత్రమే కుంగిపోయిందనడమేంటని మండిపడ్డారు. బీఆర్ఎస్ నాయకులు రాజకీయ ప్రయోజనాల కోసం రాష్ట్ర రైతాంగ ప్రయోజనాలను పణంగా పెట్టారని ఉత్తమ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

నేడు మరో 5,278 మందికి
ఉద్యోగ నియామక పత్రాలు

హైదరాబాద్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియ కొనసాగుతోంది. ప్రభుత్వ విభాగాల్లోని వివిధ ఉద్యోగాల భర్తీలు కోర్టుకు వెళ్లగా.. వాటిని పరిష్కరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఆయా పోస్టులను భర్తీ చేస్తోంది. ఇందులో భాగంగా సోమవారం మరో 5,278 మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేయనుంది. వీరిలో సంక్షేమ గురుకులాల్లో ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్స్ (టీజీటీ), డిగ్రీ, జూనియర్ లెక్చరర్ ఉద్యోగానికి ఎంపికైన వారు 4,638మంది, పోలీసు శాఖలోని వివిధ విభాగాల్లో 565, వైద్య శాఖలోని వివిధ విభాగాల్లో 75పోస్టులకు ఎంపికైన వారు ఉన్నారు. హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో సోమవారం జరిగే కార్యక్రమంలో సీఎం రేవంత్ చేతులమీదుగా వీరంతా నియామక పత్రాలు అందుకోనున్నారు.

11న సీఎం భద్రాచలం పర్యటన!

హైదరాబాద్, మార్చి 3(ఆంధ్రజ్యోతి) : సీఎం రేవంత్‌రెడ్డి 11న భద్రాచలంలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రారంభించనున్నారు. తొలుత భద్రాద్రి రామయ్యను సీఎం దర్శించుకుంటారు. అనంతరం బూర్గంపాడులో నిర్వహించే సభలో ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రారంభిస్తారని సమాచారం. కాగా, ఈ నెల 7న సిరిసిల్ల, వేములవాడలో పలు అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేయనున్నారు.

టీచర్ పోస్టులకు దరఖాస్తులు నేటి నుంచే

(మొదటిపేజీ తరువాయి)

దరఖాస్తుకు రూ.1000 ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. అభ్యర్థి వయసు 1.7.2023 నాటికి 18 నుంచి 46 ఏళ్ల మధ్య ఉండాలి. ఎక్స్ సర్వీస్‌మెన్‌కు 3 ఏళ్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్, ప్రభుత్వ ఉద్యోగులకు 5 ఏళ్లు, దివ్యాంగులకు 10 ఏళ్ల వెసులుబాటు ఉంది. ఇక పోస్టుల వారీగా రోస్టర్ పాయింట్లను కూడా సోమవారం వెల్లడించనున్నారు. జిల్లాల వారీగా ఆయా సబ్జెక్టుల పోస్టులపైనా స్పష్టత ఇవ్వనున్నారు. ఖాళీ పోస్టుల్లో స్కూల్ అసిస్టెంట్లు 2,629, బాషా పండితులు 727, ఫిజికల్ ఎడ్యుకేషన్ 182, ఎస్జీటీలు 6,508, ఎస్ఏ (స్పెషల్ ఎడ్యుకేషన్) 220, ఎస్జీటీ (స్పెషల్ ఎడ్యుకేషన్) 796 పోస్టులు ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఒకే యూనిట్‌గా సీబీఆర్ పద్ధతిలో పరీక్ష నిర్వహిస్తారు. అభ్యర్థులు దరఖాస్తు చేసుకునేటప్పుడే పరీక్ష కేంద్రాన్ని ఎంచుకోవాల్సి ఉంటుంది. పరీక్షల తేదీలను త్వరలో ప్రకటించనున్నారు.

నేడు ప్రధాని మోదీ రాక

(మొదటిపేజీ తరువాయి)

బయలుదేరి 10.20కి ఆదిలాబాద్ చేరుకుంటారు. అక్కడ మోదీకి.. సీఎం రేవంత్‌రెడ్డి, గవర్నర్ తమిళిసై స్వాగతం పలకనున్నారు. స్థానిక ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో నిర్వహించే బహిరంగ సభలో ప్రధానితో పాటు సీఎం రేవంత్ పాల్గొంటారు. ఈ సందర్భంగా రూ6,697 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ప్రధాని శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. జైనథ్ మండలం బోరజ్ నుంచి బేల మండలం మహారాష్ట్ర సరిహద్దు వరకు రూ.491కోట్లతో చేపట్టనున్న (32.9కి.మీ) జాతీయ రహదారి 353(బి)విస్తరణ పనులు, రూ.136కోట్లతో చేపట్టే హైదరాబాద్-భూపాల పట్నం 163 జాతీయ రహదారి అభివృద్ధికి పనులకు శంకుస్థాపన చేస్తారు. అలాగే రూ.6వేల కోట్లతో చేపట్టిన రామగుండం ఎన్టీపీసీలోని 800 మెగావాట్ల థర్మల్ పవర్ యూనిట్, సుమారు రూ.70కోట్లతో చేపట్టిన అంబారి-ఆదిలాబాద్-పింపాలకుట్టి రైల్వేలైన్ విద్యుదీకరణ పనులను జాతికి అంకితం చేయనున్నారు. ఆదిలాబాద్ జిల్లా ప్రజల చిరకాల వాంఛ అయిన సిమెంటు ఫ్యాక్టరీ పునరుద్ధరణపై ప్రధాని ప్రకటన చేసే అవకాశం ఉందని బీజేపీ ముఖ్య నేత ఒకరు వెల్లడించారు. ఈ కర్మాగారం పునరుద్ధరణతో 5 వేల మందికి ఉపాధి కలుగుతుందని చెప్పారు. ఆదిలాబాద్‌లో విమానాశ్రయం ఏర్పాటుపైనా ప్రధాని ప్రకటన చేయవచ్చని ఆ నేత తెలిపారు. సభ అనంతరం మోదీ తమిళనాడు పర్యటనకు వెళతారు. అక్కడి కార్యక్రమాల్లో పాల్గొన్న తర్వాత సాయంత్రం 6.45 గంటలకు బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. రాత్రి రాజ్‌భవన్‌లో బసచేస్తారు. మంగళవారం ఉదయం బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నిర్మించిన పౌర విమానయాన పరిశోధన సంస్థ(కారో)ను ప్రారంభిస్తారు. అనంతరం హెలికాప్టర్‌లో సంగారెడ్డి పర్యటనకు వెళతారు. అక్కడ సభలో పాల్గొంటారు. రూ.9,021 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారు. రూ.1,298కోట్ల అంచనాతో ప్రతిపాదించిన పుణే-హైదరాబాద్ రహదారిలో సంగారెడ్డి ఎక్స్‌రోడ్ నుంచి మదీనగూడ వరకు 6లేన్ల హైవే విస్తరణ, మెదక్-ఎల్లారెడ్డి మధ్య విస్తరణ(రూ.399కోట్లు) పనులకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం, పారాదీప్-హైదరాబాద్ గ్యాస్ పైప్‌లైన్(రూ.3,338కోట్లు), మిర్యాలగూడ-కోదాడ జాతీయ రహదారి విస్తరణ (రూ.323కోట్లు) పనులను జాతికి అంకితం చేస్తారు. రూ.1,165కోట్లతో చేపట్టిన హైదరాబాద్-సికింద్రాబాద్ ఎంఎంటీఎస్ ఫేజ్ -2 ప్రాజెక్టును, ఘట్‌కేసర్-లింగంపల్లి కొత్త ఎంఎంటీఎస్‌ను ప్రధాని ప్రారంభిస్తారు.

ఎన్నికలకు శంఖారావం..

న్యూఢిల్లీ: లోక్ సభ ఎన్నికల శంఖారావం పూరించేందుకు బీజేపీ సన్నద్ధమైంది. ఇందులో భాగంగా ఎన్నికల షెడ్యూల్ రావడానికి ముందే 12 రాష్ట్రాల్లో ప్రధాని మోదీ సుడిగాలి పర్యటనకు షెడ్యూల్ ఖరారైంది. పది రోజుల్లోనే మోదీ తొలి పర్యటన పూర్తిచేసేలా ప్రణాళిక సిద్ధమైంది. ఈసారి దేశవ్యాప్తంగా 370కి పైగా పార్లమెంట్ స్థానాలను కైవసం చేసుకోవాలని చూస్తున్న మోదీ.. షెడ్యూల్ వచ్చేలోపే పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలపై దృష్టిసారించారు. తెలంగాణతో ప్రారంభం కానున్న మోదీ సుడిగాలి పర్యటన తమిళనాడు, ఒడిశా, పశ్చిమ బెంగాల్, బిహార్, జమ్మూ కశ్మీర్, అసోం, అరుణాచల్ ప్రదేశ్, ఉత్తర్ ప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్ మీదుగా సాగుతూ.. చివరికి ఢిల్లీతో ముగియనుందని అధికార వర్గాలు తెలిపాయి. సోమవారం ఆదిలాబాద్ పర్యటనకు వస్తున్న మోదీ.. పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తారు. ఆ తర్వాత తమిళనాడులోని కల్పకమ్‌లో భారతీయ నభికియా విద్యుత్ నిగమ్ లిమిటెడ్‌ను సందర్శిస్తారు. తర్వాత ఒడిశాలోని చండీఖోలేలో బహిరంగ సభలో పాల్గొంటారు. 6న కోల్‌కతా వెళ్లి అక్కడ జరిగే సభలో అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిస్తారు. అక్కడి నుంచి బిహార్ వెళ్లి బెట్టియాలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. 7న జమ్మూకశ్మీర్ లో పర్యటించి సాయంత్రం ఢిల్లీలో మీడియా కార్యక్రమంలో పాల్గొంటారు. 8న ఢిల్లీలో నేషనల్ క్రియేటర్స్ అవార్డుల కార్యక్రమంలో పాల్గొంటారు. అదేరోజు అసోంలోని జోర్హాట్‌లో అసోం ఆర్మీ కమాండర్ లచిత్ బోర్ఫుకాన్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. తర్వాత అరుణాచల్ ప్రదేశ్‌లోని పశ్చిమ కమెంగ్‌లో సెలా టన్నెల్‌ను ప్రారంభిస్తారు. మార్చి 10న ఉత్తరప్రదేశ్‌లోని అజంగఢ్‌లో పలు ప్రాజెక్టులను జాతికి అంకితం ఇస్తారు. 11న ఢిల్లీలో డీఆర్డీవో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొంటారు. 12న గుజరాత్‌లోని సబర్మతిలో పలు కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. మార్చి 13న ఢిల్లీకి చేరుకుని.. గుజరాత్, అసోంలోని సెమీ కండక్టర్ల ప్రాజెక్టులను వర్చువల్‌గా ప్రారంభిస్తారు.

బీజేపీ పోరాడకపోతే హిందువులు రోడ్లపై తిరగలేరు

- బొట్టు పెట్టుకునేవారు కూడా కాదు
- షరతుల పేరుతో గ్యారెంటీలకు కోత
- కాంగ్రెస్ హామీలు అమలు కావాలంటే.. రూ.5 లక్షల కోట్లు కావాలి: సంజయ్



హుజూరాబాద్/వీణవంక, మార్చి 3: బీజేపీ హిందువుల గురించి పోరాడకపోతే, హిందూ ధర్మం గురించి ఆలోచించకపోతే తెలంగాణలో ఏ హిందువు కూడా రోడ్లపై తిరిగే పరిస్థితి ఉండదని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ అన్నారు. బీజేపీ హిందువుల కోసం కొట్లాడకుంటే తెలంగాణలో వారు బొట్టు పెట్టుకొని తిరిగే పరిస్థితి ఉండేది కాదని తెలిపారు. రాముడు అంటేనే కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు వణుకు పుడుతోందన్నారు. ప్రజాహిత యాత్రలో భాగంగా కరీంనగర్ జిల్లాలోని పలు గ్రామాల్లో సంజయ్ పర్యటించారు. కాంగ్రెస్ ధోకేబాజీ (మోసపూరిత) పార్టీ అని విమర్శించారు. తెలంగాణ అప్పుల్లో ఉందని, ఉద్యోగులకు జీతాలే ఇవ్వలేని పరిస్థితి ఉందన్నారు. ఆరు గ్యారెంటీలను అమలు చేయాలంటే రూ.5లక్షల కోట్లు అవసమరని, ఆ నిధులు ఎక్కడి నుంచి తెస్తారో ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. ఇప్పటికీ రాష్ట్రంలో 10 లక్షల కుటుంబాలకు రేషన్ కార్డులే ఇవ్వలేదన్నారు. రాష్ట్రంలో 90లక్షల రేషన్ కార్డులు ఉంటే అందులో 40 లక్షల మందికి మాత్రమే రూ.500కే గ్యాస్ సిలిండర్, ఉచిత విద్యుత్ అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. మాజీ సీఎం కేసీఆర్ మీద కేసులు పెట్టకుండా కాంగ్రెస్ డ్రామాలు ఆడుతోందని సంజయ్ విమర్శించారు.

15 నాటికి రైతు భరోసా అమలు

- కల్లు దుకాణాలను బార్లుగా ఆధునీకరిస్తాం: మంత్రి పొన్నం



హైదరాబాద్, మహబూబ్‌నగర్, షాద్‌నగర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కల్లు అంటే నామోషీ అన్న భావనను తొలగించి, గీత వృత్తికి గౌరవం పెంచేలా చేస్తామని బీసీ సంక్షేమం, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కల్లు దుకాణాలను రానున్న రోజుల్లో కల్లుబార్లుగా ఆధునికీకరించి, గీత వృత్తిని గౌరవ ప్రదంగా చేసుకునేలా చేస్తామని అన్నారు. కులవృత్తులన్నీ ఆధునీకరణను సంతరించుకుంటున్నాయని, ఆ దిశగా కల్లుగీత వృత్తికి కూడా గౌరవం తీసుకువస్తామని చెప్పారు. ఎక్కడ, ఏ దావత్ జరిగినా అందులో కల్లు ఉండేలా చేస్తామన్నారు. ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డికి మద్దతుగా ఆదివారం మహబూబ్‌నగర్‌లో గౌడసంఘం ఆత్మీయ సమ్మేళనంలోనూ, మీడియాతోనూ ఆయన మాట్లాడారు. మార్చి 15 కల్లా రైతు భరోసా అమలు చేస్తామని సీఎం హామీ ఇచ్చినందున ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. అసెంబ్లీలో తీర్మానం చేసి కులగణన సర్వే చేస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి త్వరలో ట్యాంక్‌బండ్‌పై సర్దార్ సర్వాయ్ పాపన్న విగ్రహానికి శంకుస్థాపన చేయబోతున్నారని వెల్లడించారు. మేడిగడ్డ ప్రాజెక్టును బొందలగడ్డ అని వ్యాఖ్యానించిన కేసీఆర్.. మరి బీఆర్ఎస్ నాయకులు బొందలగడ్డ నిర్మాణాన్ని పరిశీలించి ఏం పీకారో చెప్పాలని అన్నారు. బొందలగడ్డ నిర్మాణానికి ఎందుకు లక్షల కోట్లు ఖర్చు చేశారో చెప్పాలన్నారు. అలాగే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి ఏం చేసిందో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సమాధానం చెప్పాలని మంత్రి పొన్నం డిమాండ్ చేశారు. దేశంలో కేంద్ర ప్రభుత్వాన్ని వ్యతిరేకించే 95 శాతం మంది రాజకీయ నాయకులపై ఈడీ, ఎన్ఫోర్స్‌మెంట్, విజిలెన్స్ దాడులు చేయించి ఒక్క కేసీఆర్ కుటుంబాన్నే ఎందుకు వదిలారో చెప్పాలన్నారు. కాగా, మంత్రి పొన్నం హైదరాబాద్ నుంచి షాద్‌నగర్ వరకు ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. ఈ సందర్భంగా బస్సులో ఉచిత ప్రయాణం ఎలా ఉందని మహిళలను అడిగి తెలుసుకున్నారు. త్వరలో మరో 3 వేల కొత్త బస్సులను కొనుగోలు చేసి నడపనున్నట్లు మంత్రి తెలిపారు.

బీఆర్ఎస్ విమర్శలు విడ్డూరం: భట్టి

మధిర, మార్చి 3: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పదేళ్లు అధికారంలో ఉండి కూడా అమలు చేయని బీఆర్ఎస్ నాయకులు ఇంకా మూడు నెలలు కూడా పూర్తి చేసుకోని కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని డిప్యూటీ భట్టి విక్రమార్క అన్నారు. కాంగ్రెస్ పార్టీ చేయగలిగిన వాటికే హామీ ఇస్తుందని, ఇచ్చిన హామీలను కచ్చితంగా అమలుచేసి తీరుతుందని అన్నారు. అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే 25వేల ఉద్యోగాలు భర్తీ చేశామని తెలిపారు. ఖమ్మం జిల్లాలోని ఎర్రుపాలెం, మధిర మండలాల్లో ఆదివారం భట్టి విక్రమార్క పర్యటించారు. ఈ సందర్భంగా ఎర్రుపాలెంలో రూ.38కోట్లతో బీటీ రోడ్లు, మధిరలో రూ.3.30కోట్లతో బీటీ రోడ్లు, ఇతర అభివృద్ధి పనులకు భట్టి శంకుస్థాపనలు చేశారు. తామిచ్చిన ఆరు గ్యారెంటీల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, ఆరోగ్య శ్రీ పరిమితి రూ.10లక్షలకు పెంపు ఇప్పటికే అమలవుతుండగా.. రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ గ్యారంటీల అమలును తాజాగా ప్రారంభించామని తెలిపారు.

వెంకటనారాయణకు పొత్తూరి స్మారక పురస్కారం

- ఈ నెల 5న సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రదానం



హైదరాబాద్ సిటీ, మార్చి3 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పాత్రికేయుడు ఎస్ వెంకటనారాయణ.. పొత్తూరి వెంకటేశ్వరరావు స్మారక ఉత్తమ పాత్రికేయ పురస్కారానికి ఎంపికయ్యారు. తెలుగు పాత్రికేయ రంగంలో తనదైన ముద్ర వేసిన పొత్తూరి నాలుగో వర్ధంతి సందర్భంగా ఈ నెల 5న, మంగళవారం సాయంత్రం రవీంద్రభారతీలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో వెంకటనారాయణకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పురస్కారాన్ని అందజేస్తారని పొత్తూరి వెంకటేశ్వరరావు కుమారుడు ప్రేమ్‌గోపాల్ తెలిపారు. అవార్డు గ్రహీతకు రూ.లక్ష నగదు పురస్కారాన్ని అందజేస్తామన్నారు. హన్మకొండలోని కమలాపూర్‌కు చెందిన ఎస్ వెంకటనారాయణ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జర్నలిజంలో పోస్టు గ్రాడ్యుయేషన్ చేశారు. 1968 నుంచి పలు జాతీయ, అంతర్జాతీయ మీడియా సంస్థల్లో విశిష్ట సేవలందిస్తున్నారు. 'ఇండియా టుడే' మ్యాగజైన్‌కు ఎగ్జిక్యూటివ్ ఎడిటర్‌గా పనిచేశారు.

దివ్యాంగురాలికి పెన్షన్ మంజూరు

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందించిన సర్కారు

హైదరాబాద్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు అందని ఆసరా పేరిట 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై ప్రభుత్వం స్పందించింది. బుద్ధిమాంద్యం బాధితురాలికి పెన్షన్ మంజూరు చేస్తూ ప్రొసీడింగ్ ఉత్తర్వులు జారీ చేసింది. రెవిన్యూ సిబ్బంది చేత రూ. 4016ను బాధితురాలికి అందజేసింది. బోరబండకు చెందిన మదియ బుద్ధిమాంద్యంతో ఏడేళ్లుగా బాధపడుతోంది. పెన్షన్ కోసం మీసేవ కేంద్రంలో గతంలో ఆ పాప తల్లిదండ్రులు దరఖాస్తు చేశారు. సదరం సర్టిఫికేట్ కోసం ఎర్రగడ్డలోని మానసిక ఆస్పత్రికి రాశారు. అక్కడ 12 ఏళ్లలోపువారికే చూస్తారు. దాంతో మరో ఆస్పత్రికి వెళ్లాలన్నా ఇంకో ఆరు నెలలు ఆగాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరోవైపు ఔషధాల కోసం నెలకు మూడు వేల రూపాయలను ఖర్చు చేస్తున్నారు. కనీసం పెన్షన్ వస్తే కొంతభారం తగ్గుతుందని మదియ తండ్రి మహ్మద్ యాసిన్ 'ఆంధ్రజ్యోతి'తో చెప్పారు.

ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య

మొగుళ్లపల్లి, మార్చి 3: అప్పులు తెచ్చి సాగు చేసిన పంటలు దిగుబడి రాక జీవితంపై విరక్తితో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలంలో జరిగింది. పర్లపల్లికి చెందిన మేడిపల్లి రాజలింగు (53) ఎకరం భూమిలో వరి పంట వేశాడు. పంట సరిగా పండక అప్పులు పెరిగిపోయాయి. దీంతో జీవితంపై విరక్తి చెందిన రాజలింగు ఫిబ్రవరి 28న పురుగుల మందు తాగాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు.

తల్లిదండ్రులు, టీచర్లలోనే లోపం

పిల్లల్లో డ్రగ్స్ సంస్కృతికి అదే కారణం.. ప్రతీ బడిలో డ్రగ్స్ అవేర్‌నెస్ కమిటీలు తప్పనిసరి

- గుడ్ టచ్- బ్యాడ్ టచ్‌పైనా అవగాహన కల్పించాలి
- త్వరలో సర్క్యులర్.. ప్రొటోకాల్ పాటించాల్సిందే
- నార్కోటిక్స్ డీ-సెన్సిటైజేషన్‌లో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం
- వారి సినిమాలను బ్యాన్ చేయాలి: శాండిల్య



డ్రగ్స వినియోగం దుష్ప్రభావాల కు సంబంధించిన బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న బుర్రా వెంకటేశం, ట్రై కమిషనరేట్ సీపీలు

హైదరాబాద్ సిటీ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో డ్రగ్ సంస్కృతికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యాల్లో లోపమే కారణమని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం స్పష్టం చేశారు. "ఒకప్పుడు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చెప్పినట్లు పిల్లలు వినేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. పిల్లలు చెప్పినట్లే తల్లిదండ్రులు వింటున్నారు. పిల్లలపై పర్యవేక్షణ లేకపోవడంతో.. వారు పెడదోవ పడుతున్నారు" అని ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్ నగర పోలీసు విభాగం, హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్(హెచ్‌సీఎస్‌సీ) ఆధ్వర్యంలో ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్(ఐసీసీసీ)లో 'నార్కోటిక్స్ అండ్ అదర్ అడిక్షన్స్ డీ-సెన్సిటైజేషన్ అండ్ రీప్రాసెసింగ్ ప్రివెన్షన్'పై ఆదివారం జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని సుమారు వెయ్యి పాఠశాలల నిర్వాహకులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బుర్రా వెంకటేశం మాట్లాడుతూ.. విద్యార్థులు యుక్తవయసులో దుర్వ్యసనాల బారిన పడడానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పర్యవేక్షణ లోపమే కారణమని విమర్శించారు. "డ్రగ్స్ గంజాయి స్కూలు స్థాయికి చేరడం ఆందోళనకరం. దేశంలోనే అత్యంత యువశక్తి కలిగిన రాష్ట్రం తెలంగాణ. యువశక్తిని పెడదోవ పట్టకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, టీచర్లు, ఉపాధ్యాయులు, పోలీసులు, ఇతర అన్ని శాఖలపై ఉంది. అంతా కలిసి సంయుక్తంగా పనిచేయాలి. డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టాలి" అని ఆయన పిలుపునిచ్చారు. ఇకపై ప్రతీ స్కూల్‌లో డ్రగ్స్ అవేర్‌నెస్ కమిటీలను ఏర్పాటు చేయాలని, మాదక ద్రవ్యాల వల్ల దుష్ప్రభావాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. గుడ్ టచ్-బ్యాడ్ టచ్ గురించి చిన్నారులకు తెలియజేయాలని చెప్పారు. ఈ మేరకు త్వరలో సర్క్యులర్ జారీ చేస్తామని, ఆ ప్రొటోకాల్స్‌ను పాటించని పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తెలంగాణ నార్కోటిక్స్ బ్యూరో(టీ-న్యాబ్) డైరెక్టర్ సందీప్ శాండిల్య మాట్లాడుతూ.. డ్రగ్స్ సేవించే నటులు, దర్శకుల సినిమాలను బ్యాన్ చేయాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రులు పిల్లల కోసం సమయాన్ని కేటాయించాలని, వారికి డబ్బులిచ్చినంత మాత్రాన బాధ్యత తీరిపోదని సూచించారు. హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ పట్టణ, గ్రామీణ ప్రాంతాలు అనే తేడా లేకుండా ఇప్పుడు డ్రగ్స్ మహమ్మారి అన్ని ప్రాంతాలకు విస్తరించిందని ఆవేదన వ్యక్తం చేశారు. కిరాణా దుకాణాలు, పాన్ డబ్బాలు, టిఫిన్ సెంటర్లలోనూ డ్రగ్స్ లభించడం ఆందోళనకరమన్నారు. సైబరాబాద్ సీపీ అవినాశ్ మొహంతి మాట్లాడుతూ డ్రగ్స్ ఆఫర్ చేసే స్నేహితులపై ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలని విద్యార్థులకు సూచించారు. రాచకొండ సీపీ తరుణ్ జోషి మాట్లాడుతూ డ్రగ్స్ సేవించే పిల్లల నడవడికలో మార్పులను గమనించే అవకాశం తల్లిదండ్రు లు, టీచర్లకే ఉంటుందని, తొలి నాళ్లలోనే ఆ మార్పు ను గుర్తించి, చర్యలు తీసుకుంటే.. వారిని వ్యసనాలకు దూరం చేయొచ్చన్నారు. కార్యక్రమంలో పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ దేవసేన, హెచ్‌సీఎస్‌సీ సలహాదారు భరణి అరోల్ పాల్గొన్నారు. అంతకు ముందు డ్రగ్స్ వల్ల దుష్ప్రభావాలకు సంబంధించిన బుక్‌లెట్‌ను అతిథులు విడుదల చేశారు.

విద్యార్థుల్లో దురలవాట్లను గుర్తించే యాప్

- అభివృద్ధి చేసిన హైదరాబాద్ స్టార్టప్

హైదరాబాద్ సిటీ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, యువకుల్లో దురవాట్లను గుర్తించేలా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) సాయంతో ప్రయత్నాలు చేస్తున్న హైదరాబాద్ పోలీసులు.. నగరానికి చెందిన స్టార్టప్ కంపెనీ ఫోర్టిస్ గ్రూప్ రూపొందించిన 'యునైటెడ్ వీ కేర్' యాప్‌ను ప్రచారానికి ఎంపిక చేశారు. ఆదివారం హైదరాబాద్ పోలీసు కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమర్జింగ్ టెక్నాలజీస్ ఓఎస్‌డీ రమాదేవి వివరాలను వెల్లడించారు. డ్రగ్స్, ఇతర దురవాట్లను విద్యార్థుల్లో ముందుగానే గుర్తిస్తే.. నివారణ సాధ్యమని ఆమె చెప్పారు. ఈ క్రమంలో కృత్రిమ మేధ(ఏఐ), డీప్‌టెక్, బ్లాక్‌చెయిన్ టెక్నాలజీలను ఉపయోగించుకుని దురవాట్లను ముందుగానే గుర్తించే 10 యాప్స్‌ను పరిశీలించామన్నారు. పోలీసులు, విద్యాశాఖ, మానసిక నిపుణులు, వైద్యులు విశ్లేషించిన తర్వాత.. వాటిల్లో 'యునైటెడ్ వీ కేర్' యాప్‌ను ఎంపిక చేసినట్లు తెలిపారు. "ఈ యాప్ ద్వారా 13 నుంచి 19 ఏళ్ల వయసు వారిలో దురవాట్లను సులభంగా గుర్తించవచ్చు. మూడు దశల్లో విశ్లేషణ ఉంటుంది. తొలి దశలో ఏఐ బాట్ 13 ప్రశ్నలను సంధిస్తుంది. రెండు, మూడు దశల్లో ఉన్న ప్రశ్నలను మానసిక నిపుణులు, వైద్యులు పర్యవేక్షిస్తారు. ఈ మూడు దశలు పూర్తయిన తర్వాత.. విద్యార్థి దురవాట్ల బారిన పడ్డాడా? లేదా? అనే అంశంపై సమగ్ర నివేదిక వస్తుంది. ఒకవేళ విద్యార్థి దురవాట్ల బారిన పడి ఉంటే.. అది ఏ దశలో ఉందనేదాన్ని కూడా విశ్లేషిస్తుంది" అని ఆమె వివరించారు.



జేఎన్‌జే సొసైటీ కొత్త డైరెక్టర్లు అశోక్ రెడ్డి, పీవీ రమణారావు, ఆర్. రవికాంత్ రెడ్డి, బొమ్మగాని కిరణ్‌కుమార్, వంశీ శ్రీనివాస్

జేఎన్‌జే సొసైటీకి ఐదుగురు డైరెక్టర్ల ఎన్నిక

హైదరాబాద్, పంజాగుట్ట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ (జేఎన్‌జేమ్యాక్స్)కి ఐదుగురు కొత్త డైరెక్టర్లు ఎన్నికయ్యారు. ఆదివారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో హోరాహోరీగా ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో పీవీ రమణారావు (528 ఓట్లు), ఎన్. వంశీ శ్రీనివాస్ (430), ఆర్. రవికాంత్ రెడ్డి (428), బొమ్మగాని కిరణ్‌కుమార్ (401), కె.అశోక్‌రెడ్డి (392)లు మెజారిటీ ఓట్లతో డైరెక్టర్లుగా ఎన్నికయ్యారు. సొసైటీలో ఐదుగురు డైరెక్టర్ల పోస్టులకు 13 మంది పోటీ చేశారు. 981 మంది సభ్యులకు గాను 856 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో 842 ఓట్లు లెక్కించగా 14 ఓట్లు చెల్లక పోవడం గమనార్హం. ఆఫీస్ బేరర్స్‌ను ఈ నెల 4న ఎన్నుకోనున్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్.. జవాను మృతి

- పోలీసుల కాల్పుల్లో ఓ మావోయిస్టు హతం
- బీజాపూర్ జిల్లాలో ఆరుగురి అరెస్టు



జవాను రమేశ్(ఫైల్)

దుమ్ముగూడెం/చర్ల, మార్చి 3: ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్ జిల్లాలో ఆదివారం పోలీసులు, మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఒక మావోయిస్టు హతమయ్యాడు. మావోయిస్టుల కాల్పుల్లో బస్తర్ ఫైటర్స్‌కు చెందిన పోలీస్ జవాన్ రమేశ్ మృతి చెందారు. కాంకేర్ జిల్లా చోటేబేఠియా పోలీస్‌స్టేషన్ పరిధిలోని హిందూర్ అటవీప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారనే సమాచారంతో పోలీసు బలగాలు కూంబింగ్ ప్రారంభించాయి. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య కొన్ని గంటల పాటు ఎదురుకాల్పులు జరిగాయి. ఇదిలా ఉండగా, బీజాపూర్ జిల్లాలో ఐదుగురు మావోయిస్టు పార్టీ సభ్యులతో పాటు మరో మహిళా మావోయిస్టును అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బీఈఈ లైఫ్ మిషన్‌కు హైదరాబాద్ ఉత్తమ నగరం!

- ఇందుకు అన్ని రాష్ట్రాల ఎస్డీఏలు చొరవ చూపాలి: అభయ్ భాక్రే

హైదరాబాద్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ హితమైన జీవనశైలిని అనుసరించేలా ప్రజలను ప్రోత్సహించటమే లక్ష్యంగా ప్రధాని మోదీ ప్రారంభించిన 'బీఈఈ లైఫ్'ను (బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్) సమర్థవంతంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని బీఈఈ సంస్థ డైరెక్టర్ జనరల్ అభయ్ భాక్రే తెలిపారు. ఆదివారం బీఈఈ 22వ ఆవిర్భావ వేడుకలు ఢిల్లీలో జరిగాయి. ఈ సందర్భంగా అతిథులు లైఫ్‌మిషన్ పోస్టర్లను విడుదలచేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ జనరల్ అభయ్ భాక్రే మాట్లాడుతూ... బీఈఈ లైఫ్ మిషన్ అమలుకు హైదరాబాద్ ఉత్తమ కాస్మోపాలిటన్ నగరమని, తెలంగాణతో సహా అన్ని రాష్ట్రాల ప్రభుత్వరంగసంస్థలు(ఎస్డీఏ) క్రియాశీలకంగా వ్యవహరించాలన్నారు. విద్యుత్‌ను ఆదాచేయటం ద్వారా ఏటా రూ. 1,94,320 కోట్లు పొదుపు చేశామన్నారు. దక్షిణాదిలో బెంగళూరు, చెన్నై, వైజాగ్, తిరువనంతపురం లాంటి పెద్ద నగరాల్లోనూ బీఈఈ లైఫ్ మిషన్‌ను దశలవారీగా అమలు చేయనున్నట్లు ప్రకటించారు. తెలంగాణలో.. జీహెచ్‌ఎంసీ లాంటి సంస్థలతో కలిసి ముందుకు సాగుతామని అభయ్ భాక్రే తెలిపారు. బీఈఈ మూడు విభిన్న దశల్లో పనిచేస్తుందని దక్షిణాది రాష్ట్రాల మీడియా సలహాదారు చంద్రశేఖరరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో టీఎస్ రెడ్కో ఎండీ జానయ్య, నీతి ఆయోగ్ సలహాదారు సుదేందు జ్యోతి సిన్హా, బీఈఈ డిప్యూటీ డీజీ అశోక్ కుమార్, బీఈఈ కార్యదర్శి మిలింద్ దేవరా, డైరెక్టర్లు అభిషేక్, సమీర్‌లు పాల్గొన్నారు.

'స్వచ్ఛ భారత్'లో 'చెత్త' మనుషులు



ఇంకా ఏప్రిల్ నెల ఎండలే
గాలీ లేదు గాలికి దారీ లేదు
నిద్రలేని రాత్రి నిద్రరాని రాత్రి నిరంతర మెలకువ
కరోనా కాలంలో ఖాళీ చేసిన ఇల్లట
ఇంట్లో అంతా ముక్క వాసన ముక్కుకు పట్టింది
ఇపుడెక్కడి నుంచీ పీల్చనక్కర్లేదు
నువు దానితో సహజీవనం చేయాల్సిందే
బయటి నుంచి చుట్టూ మురుగు వాసన
ధ్యానంతా ప్లాస్టిక్ చక్రాల చెత్తబండీ చప్పుడు మీద
అలికిడి అయితే లేచి కిచెన్ కిటికీ నుంచి చూస్తాను
ఆజానుబాహువైన కొడుకు ఆత్మీయమైన తల్లి
అతను ఒక డాంట్లోంచి తోడి తడి పొడి వేరు చేస్తూ
వేరే డాంట్లో వేస్తూ ఉంటాడు
చేతులకు తొడుగులూ ఉన్నట్లు లేవు
అతడు ఎంతమంది సఫాయీ కర్మచారీల వ్యక్తరూపమో
మహానగర దివారాత్రుల కార్యకలాపాల విసర్జన వేకువవేళ
లిఫ్ట్‌లో చక్రాల డబ్బాతో వాళ్లు వస్తున్న శబ్దం
కోసం వేచి ఉన్నపుడు అనుకుంటాను
అపార్ట్‌మెంట్స్ సిసి కెమెరాల్లో తప్ప
ఈ 'చెత్త మనుషులు' స్వచ్ఛ భారత్ ప్రచార
వీడియోల్లో మీడియాలో
ఎప్పుడయినా ఎక్కడయినా కనిపిస్తారా అని
'మన్ కీ బాత్'లో వినిపిస్తారా అని.

2
మే నెలా సగం గడిచిపోయింది
బిఎంఎంసి డ్యూటీలు మార్చినట్లున్నది
ఇపుడు మధ్యాహ్నాలు వస్తున్నారు 'చెత్త' మనుషులు
పని పెరిగిందో బతుకు తెరువు కరువయిందో
బడికి సెలవులో కాని ఇపుడు
అటు కిచెన్ కిటికీ నుంచి ఆ తల్లీ ఆ కొడుకే
తడి పొడి వేరు చేయడం తల్లి వంతు
ఇటు ముగ్గురు పసిపిల్లలు కూడా వస్తున్నారు
మా అపార్ట్‌మెంటుకు దొర్లిస్తున్న చక్రాల బండి వెనుక
దూరం నుంచి
ఆ చేతులూ లేత రూపాలూ కనిపించవు
తలుపు తీస్తే
చిరునవ్వు వెలిగించిన మట్టి ప్రమిదల్లా
ఆ పిల్లల కేరింతల మాటల్లో
'ఖానే కే టైమ్ పే ఆతే క్యా, కచ్రేవాలే'
అని విసుక్కుంటున్నాడు ఎదురింటాయన.

('అకవితా వస్తువు' మర్లిన్ మన్రో మీదనో, 'చిరునవ్వు భాష' స్మితా పాటిల్ మీదనో రాసి ఉండవచ్చు గాని, 'చెత్త' మనుషుల మీద రాసినా అచ్చెయ్య వచ్చునా అని ఇన్నాళ్లూ బయట పెట్టలేదు. 2024 హైదరాబాదు బుక్‌ఫెయిర్‌లో 19 ఫిబ్రవరి రాత్రి గార్బేజ్ కలెక్టర్ జయను ఆన్‌లైన్‌లో విన్నాక ఈ ఉపరితల సఫాయీ కర్మచారీలకు మించిన కవితా వస్తువులెవరుంటారు అనిపించింది. లక్షలాది జయల కోసం.)

వరవర రావు

ముంబై, 2023 వేసవి

(బిఎంఎంసి - బృహన్ ముంబాయి మునిసిపల్ కార్పొరేషన్)

నవలను విజ్ఞాన సర్వస్వంలా తీర్చిదిద్దిన నేర్పరి

నగర జీవన చిత్రణ, గ్రామీణ జీవన చిత్రణ విరుద్ధమైనవని, వాటిని ప్రతిపాదించేవారు వేరువేరుగా ఉంటారని సామాన్యంగా భావిస్తారు. కాని ఈ రెండిటిలోను నేర్పును ప్రదర్శించగలిగిన విశిష్ట రచయితలు అరుదు. అలాంటి అరుదైన రచయితల్లో నవీన్ ముఖ్యులు.

మన అలంకార శాస్త్ర చరిత్ర సుదీర్ఘమైనది. నాట్యశాస్త్రంతో మొదలై జగన్నాథ పండితరాయల రసగంగాధరం వరకు విస్తరించుకొని ఉన్న శాస్త్రాలన్నీ కావ్య నిర్వచనాలకు, నాటక కళకు పరిమితమై ఉన్నాయి. ప్రతిభ, వ్యుత్పత్తి, అభ్యాసం లాంటి వాటిని, నవరసాలను కావ్యాలకు, నాటకాలకు అన్వయింపజేసి ఎంతోమంది ఆలంకారికులు చర్చలు చేశారు. ధ్వని ప్రస్థానం లాంటివి కావ్య నాటకాలకు మాత్రమే అన్వయిస్తాయనిపిస్తాయి. కథన కళకంటూ విశిష్ట లక్షణాలను ప్రతిపాదించిన ఆలంకారికులెవ్వరూ లేరు. కథా నిర్మాణ శిల్పం గురించి తెలుగులో కొన్ని రచనలు వచ్చాయి కాని వాటివల్ల పూర్తిగా కథన కళ స్వరూపం అవగతం కాదు. దీన్ని తెలుసుకోవాలంటే చలం, కొడవటిగంటి, గోపీచంద్, మధురాంతకం, రావిశాస్త్రి, అంపశయ్య నవీన్ లాంటి రచయితల్ని చదివి అర్థం చేసుకోవలసిందే.

నవీన్ కథాకథన సామర్థ్యానికి 'అంపశయ్య', 'కాలరేఖలు' రెండు కొండగుర్తులు. ఒకటి నగర జీవనానికి దర్పణమయితే మరొకటి జీవన వైవిధ్యంలోని లోతుల్ని దర్శించే విజ్ఞాన సర్వస్వం. ఈ రెండిటి మధ్య వచ్చిన అనేక కథా సంకలనాలు మానవ స్వభావ చిత్రణలో ఎన్ని పోకడలను ప్రదర్శించవచ్చో నిరూపిస్తూ అంపశయ్య నవీన్ కథను ఎన్ని మలుపులు తిప్పగలడో తెలుపుతున్నాయి.



నవీన్ కథాకథన సామర్థ్యానికి 'అంపశయ్య', 'కాలరేఖలు' రెండు కొండగుర్తులు. ఒకటి నగర జీవనానికి దర్పణమయితే మరొకటి జీవన వైవిధ్యంలోని లోతుల్ని దర్శించే విజ్ఞాన సర్వస్వం.

'అంపశయ్య' నవల తెలుగు సాహిత్యంలో ఒక ప్రయోగమయితే 'కాలరేఖలు' నవల సాఫల్యం. చైతన్యస్రవంతిని సమర్థవంతంగా కథనంలో ప్రవేశపెట్టిన రచయితలు తెలుగులోనూ ఉన్నారు. బుచ్చిబాబు, గోపీచంద్, రాచకొండ విశ్వనాథశాస్త్రి లాంటి రచయితలు చైతన్య స్రవంతి మర్మాలు తెలిసినవారు. నవీన్ అసలది చైతన్యస్రవంతి అనో లేక మరో శాస్త్రీయ పంథాకు చెందినదనే భావన కలగనీకుండా అత్యంత సహజంగా కథలో ప్రవేశపెట్టారు.

'అంపశయ్య' నవలలో విద్యార్థి దశలో రవి ప్రధాన కేంద్రమయితే అతని చుట్టూ ఉన్న స్నేహితులు విభిన్న మనస్తత్వాలకు ప్రతినిధులుగా కనిపిస్తారు. సామాజిక వైరుధ్యాలు, ఆలోచనల వైవిధ్యాలు, వ్యక్తుల మధ్య అంతరాలు, ఆకర్షణలు, వైఫల్యాలు, అన్ని రకాల సంఘర్షణలు అక్షర రూపం దాల్చాయి. ఇది ఇలాగే ముగిసి ఉంటే ఇదొక అసమర్థుని జీవయాత్రగానో, విఫల మనోరథుని అంతిమయాత్ర గానో ముగిసిపోయి ఉండేది. కాని నవీన్ తన పాత్రను ఒక ఆశావాదిగా, ఆశయాల సాధకుడిగా నిలబెట్టడం మెచ్చుకోదగ్గ విషయం.

కథలో సంఘటనలనే ప్రధానంగా తీసుకున్నప్పటికీ ఆ సంఘటనలకు కారణమైన వ్యక్తులను సమర్థవంతంగా చిత్రించడంలో రచయిత నైపుణ్యం ఇమిడి ఉంటుంది. ఈ పాత్రలు కేవలం సంఘటనలలో ఒక పాత్ర వహించడానికే ఉంటే అది నైపుణ్యం అనిపించుకోదు. ఏ పాత్ర అయినా ఒక సామాజిక సత్యానికి, అంతరంగ మథనానికి, మానవ భావజాలానికి ప్రతినిధిగా నిలిస్తే రచయిత కథన సామర్థ్యానికి ప్రతీకగా నిలుస్తాడు. ఇలా ప్రాతినిధ్యాన్ని కల్పించడం అంపశయ్యలో కనిపిస్తుంది. మానవ స్వభావానికి పాత్రల ద్వారా ప్రాతినిధ్యం కల్పించడంలో తాను దిట్టనని నిరూపించుకున్నారు నవీన్.

చైతన్యస్రవంతి అంటే అంతరంగాన్ని ఆవిష్కరించడం. ఏ క్షణానికాక్షణం మెదడులో పుట్టే ఆలోచనల్ని జీవితానికి అన్వయించి విశ్లేషించి చూడగలిగితే రచయితకు సార్థక్యం లభిస్తుంది. ఇది సంక్లిష్టతకు పరమావధిగా మారి అధోజ్ఞాపికల వరకు వెళ్లిందంటే అది సహృదయ స్పందనకు దూరమవుతుంది. మానసిక సంఘర్షణల సంక్లిష్టతను సరళంగా చిత్రించడం అంత సులభమేమీ కాదు. విద్యార్థి జీవితంలో కనిపించే విభిన్న కోణాలను అత్యంత సహజంగా పాఠకుని ముందుంచారు రచయిత. నాగరిక జీవితంలోని వైరుధ్యాల్ని, గ్రామీణ జీవితంలోని అమాయకత్వాన్ని అనుసంధానం చేయగల్గిన విశిష్ట ప్రయోగం 'అంపశయ్య'. గ్రామీణ వాతావరణం నుంచి నగర జీవనంలో ప్రవేశించిన యువకుల మానసిక సంఘర్షణను నిరూపించడానికి 'అంపశయ్య' కంటే అర్థగాంభీర్యం కల పేరు మరొకటి లేదు.

వ్యక్తుల సంఘర్షణల సమాహారంగా 'అంపశయ్య' నవల వెలువడితే సమాజం లోతుల్లోకి తొంగిచూడాల్సినంత విస్తృత పరిధిలో 'కాలరేఖలు' నవల వెలువడింది. 1944 నుంచి 1956 వరకు - అంటే, పదకొండో ఆంధ్ర మహాసభ నుండి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రావతరణ వరకు పన్నెండేళ్ళ కాలాన్ని ఈ నవలలో చిత్రించారు. దీని కాలావధి పన్నెండేళ్ళే కావచ్చు కాని అది విఙగిల్చిన కాలరేఖలు మాత్రం అనంతమైనవి. లేకుంటే ఆరువందల పుటల బృహదాకార గ్రంథం వెలువడేది కాదు. తెలంగాణ ప్రపంచ చరిత్ర పుటలకు అందించిన చారిత్రక పోరాటం ఈ కాలావధిలోనే జరిగింది. ఈ పోరాటం స్వరూపాన్ని, దాని ద్వారా జరిగిన జీవన పరిణామాన్ని ఈ నవలలో చిత్రించారు నవీన్.

కాలరేఖలు నవల అయినా నాటకీయతను సంతరించుకొని ఒక దృశ్యకావ్యంలా కనిపిస్తుంది. ఇలాంటి నవల రాయాలంటే కేవలం కల్పన సరిపోదు. వాస్తవాంశాలను, సామాజిక సంఘటనలను, వాటి ప్రాముఖ్యాన్ని గుర్తించి వాడుకోవలసి వస్తుంది. నవల ఎత్తుగడలోనే కథాస్వరూపాన్ని సూచించారు నవీన్. "తన మొట్టమొదటి జ్ఞాపకం.... పన్నెండేళ్ల క్రితం తన ఊర్లో జరిగిన ఒక మహాసభ" అని ప్రారంభించి అప్పటి నాయకులను పరిచయం చెయ్యడం ద్వారా ఈ నవల నేపథ్యాన్ని, ఈ కథలోని సామాజిక పరిస్థితుల్ని సూచించారు. కథ సాగేకొద్దీ సంఘటనలు ముడులు విప్పుకుంటూ పోతాయి. ఒక్కొక్క పాత్ర పరిచయమవుతూ ఉంటే కథాబలం పెరుగుతూ ఉంటుంది. రచయిత సమాజంలో ఆచారాలను, సంప్రదాయాలను, వ్యక్తుల భావవ్యక్తీకరణను ఎంత సూక్ష్మంగా గమనించి కథలో వాడుకున్నారో చూస్తే అబ్బురపడతాం. పండుగలు, పబ్బాలు, పెళ్ళిళ్ళ ముచ్చట్లు, బాల్య వివాహాలు, పాఠశాలలో చదువుల తీరు - ఒక్కటేమిటి పల్లెటూరి సమాజంలో విషయాలన్నీ విపులంగా నవల ప్రారంభంలోనే చోటు చేసుకున్నాయి.

నవల సాగేకొద్దీ పాత్రల క్రమ పరిణామాన్ని రచయిత చిత్రించిన తీరు కూడా రచనలోని పనితనానికి తార్కాణంగా ఉంది. వీరయ్య, సత్యం మాటల్లో వైరుధ్యాన్ని చూపడం ద్వారా సమాజంలో వర్గ సంఘర్షణను, పోరాటం ఆవశ్యకతను సూచించారు రచయిత. సత్యం మాటల్లో ఇది స్పష్టమయింది: "ఆంధ్ర మహాసభ చాలా చేస్తది. సమాజంలో ఉన్నోళ్ళకు లేనోళ్ళకు మధ్య వున్న తేడాను పోగొడ్తది. ఈ దొరల పెత్తనాన్ని, భూస్వాముల పెత్తనాన్ని, వెట్టిచాకిరిని రద్దుజేస్తది. కులమత భేదాల్ని లేకుంటజేస్తది. అందరూ సమానంగుండే సమాజాన్ని స్థాపిస్తది". సత్యం చిన్నాయనంటే రాజుకు గౌరవం. అతనికి సత్యం మాటల్లో నిజం కనిపించింది. తను పెద్దయ్యాక సత్యం చిన్నాయన లాగే బాగా చదువుకొని అనేక విషయాలు తెలుసుకోవాలని రాజు అనుకోవడంలో రాజులో వ్యక్తిత్వ వికాసాన్ని రచయిత సూచించారు.

కథ ముందుకు సాగేకొద్దీ రాజులో పరిణామాన్ని, అతనిలో రేకెత్తే ఆలోచనల్ని, కులరహిత సమాజం కోసం అతను చేసే ప్రయత్నాల్ని అత్యంత సహజంగా చిత్రించారు రచయిత.

సత్యాన్ని "రావి నారాయణరెడ్డి గొప్పోడా? గాంధీ మహాత్ముడు గొప్పోడా?" అని రాజు అడగడంలో అమాయకత్వంతో బాటు విషయాలు తెలుసుకోవాలన్న కుతూహలం కనిపిస్తుంది. గాంధీ మహాత్ముడు బ్రిటిషోళ్ళను వెళ్ళగొట్టేందుకు పోరాటం జేస్తుంటే రావి నారాయణరెడ్డేమో నైజాం రాజును వెళ్ళగొట్టేందుకు, దొరోల్లను గద్దె దించేటందుకు పోరాటం చేస్తున్నడనే విషయాన్ని సత్యం తెలుపుతాడు. వాళ్ళ వాళ్ళ స్థాయిలో న్యాయం కోసం పోరాటం జరపాలనే విషయం ఇందులో స్పష్టమయింది.


తెలంగాణా పోరాటాన్ని సృజనాత్మక రచన ద్వారా ఎలా పరిచయం చెయ్యాలో తెలుసుకోవాలంటే కాలరేఖలు చదివి తీరాలి. రజాకార్లు ఊరిమీదికొస్తే వాళ్ళనెలా ఎదుర్కోవాలో చర్చలు జరుగుతాయి. వడిసెలను తయారు చేసుకోవడం, వడిసెలలో ఉపయోగించే రాళ్లను తయారు చేసుకోవడం, గుదపల్ని, గొడ్డళ్ళని, బరిసెల్ని, రోకళ్ళని, కారపు పొడుల్ని సిద్ధంగా ఉంచుకోవడం చదువరుల మనసుల్లో కుతూహలాన్ని రేపడంతో బాటు అప్పటి సామాజిక పరిస్థితుల్ని కళ్ళకు కట్టినట్లు చూపిస్తాయి.

భారతదేశానికంతా స్వాతంత్ర్యం వస్తే హైదరాబాద్ పరిస్థితి మాత్రం భిన్నంగా ఉంది. రజాకార్లు గ్రామాల మీద పడి ప్రజల్ని చంపేస్తుంటే నిజాం, లియాకత్ అలీ నిమ్మకు నీరెత్తినట్టు ఉండిపోయారు. ఈ రాజకీయాల మధ్యలో గ్రామదేవతలు, పండుగలు, పూనకాలు, ఊరేగింపులు... ఒకటేమిటి ఈ నవలలో లేని విషయమంటూ లేదనిపిస్తుంది. ఇదొక విజ్ఞాన సర్వస్వం. రచయిత చుట్టుపక్కల సమాజాన్ని, అందులో మనుషుల్ని, మానవ సంబంధాల్ని శక్తివంతంగా నిరూపించారు. ముఖ్యంగా భవిష్యత్తుపై ఆయనకున్న ఆశ, అభ్యుదయాకాంక్ష స్పష్టంగా కనిపిస్తాయి. నవల ముగింపు దీన్నే సూచిస్తుంది. స్కూలు బిల్డింగ్ గోడలు పైకి లేస్తుంటే చూచిన రాజు అది నవభారత నిర్మాణ ప్రతీక అనుకుంటాడు. ఈ దేశంలో తరతరాలుగా పేరుకుపోయిన అవిద్య, అజ్ఞానం, మూఢనమ్మకాలు పటాపంచలైపోతాయనుకుంటాడు. దేశమంతా విజ్ఞానజ్యోతులు వెల్లివిరుస్తాయని ఆశిస్తాడు. ఇలాంటి సదాశయం రచయితది.

ఒక విధంగా ఈ నవల మిథ్యా సాహిత్యపు విలువలపైన తిరుగుబాటులా కనిపిస్తుంది. సైద్ధాంతిక చర్చల ద్వారా సమాజాన్ని విశ్లేషించకుండా పాత్రల ద్వారా, సంఘటనల ద్వారా వాస్తవాలను ప్రతిబింబింపజేయడం ఈ నవలలో విశేషం. ఒక రచనను విజ్ఞాన సర్వస్వంలాగా తీర్చిదిద్దడంలో ప్రాచీన కవులలో పాల్కురికి సోమనాథుడితో పోల్చదగినవాడు నవీన్ అని చెప్తే అతిశయోక్తి కాదు.

ఆర్వీయస్ సుందరం

రంధి సోమరాజు రసస్పృష్టి 'పొద్దు'



తెలుగు జాతీయ సాహిత్యం జానపద సాహిత్యం. ఇందులో మన భాషామూలాలు, పల్లెపట్టుల ప్రాకృతిక జీవన వైవిధ్యాలూ అనేకానేక పరిణామాంశాలూ ప్రతిఫలిస్తూంటాయి. జానపద వాఙ్మయంలో ఎన్నో శాఖోపశాఖలు. ఆ గేయ సాహిత్యంలో రచనా కర్తృత్వాలు అనామకంగానే ఉంటాయి. కవిత్వ పరిమళాలను చిందిస్తూంటాయి.

జానపద ప్రభావ స్ఫూర్తితో వచ్చిన నండూరి సుబ్బారావు ఎంకి పాటలు చెళ్ళపిళ్ళ వంటి మహనీయులచే సైతం, వారి కోణాల కారణాల వల్ల, తక్కువ చేయబడినా రస భావ కవిత్వ సృజనాత్మకు శిఖరాయమాన ఉదాహరణమై కవితా విజయ పతాకను ఎగురవేసింది. కొనకళ్ళ ప్రభృతులు ఈ విధమైన పాటలు రాశారు. ఆ వెనుక కాలంలో గురజాడ ప్రభావంతో గరిమెళ్ళ బసవరాజు, కవికొండల ప్రజల భాషలో సారళ్య స్థితిలో తమ ప్రత్యేకతలతో పాటలూ అవీ రాసి రసజ్ఞ రంజకులైనారు. అయితే జానపద సాహిత్యంలో తూర్పు యాస బాసలో వచన కవితల్లో ఋతువర్ణనలు రసవత్కవిత్వపు గీటురాయికి తగ్గట్లు రాసిన గొప్ప కవి రంధి సోమరాజు. ఈ వర్తమాన తరం కవులు ఆయనని పట్టించుకుని స్ఫూర్తి పొందవలసిన అవసరం ఉంది. ఇలా చెప్పడానికి కారణం ఆయన 'పొద్దు' కావ్యం. అది ఋతు వర్ణన రత్నాకరం. కమ్మని తూర్పు యాస బాసలోని మెత్తందనాన్ని గుత్తకు తీసుకున్న కావ్యం. కొత్తచూపు, కొత్త ఒరవడి పొదిగించుకున్న కవితాకాల ముద్రలవి.

కొన్ని ప్రయోగాలు కొందరివి అద్భుత పాండిత్య స్ఫోరకాలుగా వచ్చి చరిత్రలో పేర్కొనబడతాయి. ప్రజా రసజ్ఞులను చేరకపోవచ్చు. ఉదాహరణకు శతాధిక గ్రంథకర్త శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి రాసిన 'శుద్ధాంధ్ర నిరోష్ఠ్య నిరూష్మ నిర్వచనైకాదశాక్షరీ శాకుంతలం' వంటివి. కొందరి ప్రయోగాలు రసబంధితాలైన కవిత్వ సంబంధితాలు కావడం వల్ల రసజ్ఞ పఠనీయ యోగ్య ప్రయోజనకర ప్రయోగాలవుతాయి. అటువంటి ప్రయోగం రంధివారి 'పొద్దు'. అయిదు దశాబ్దాల క్రితం 1972లో జానపద ప్రభావ సాహిత్యాకాశంలో అది ఒక కొత్త పొద్దు పొడుపైంది. కవితా రాగ రంజితమైంది. 'పొద్దు'లో వానాకాలం, శీతకట్టు, ఏసంగి పొద్దులు అనేవి మూడు విభాగాలు.

తక్కిన కవుల వలే వారు రాసే పద్ధతుల్లో వచన కవిత్వం రాసే రంధి సోమరాజుకు ఎంత సాధన చేస్తే ఈ తూర్పు యాస బాసలో పట్టువచ్చిందీ, జానపదులే వ్రాసినట్లుందీ అని వేత్తలు ఆశ్చర్యపోయారు. ఆయన చూపూ, భావుకత, నిర్మాణ ధురీణత్వం వల్ల ఆయన ఇతర రచనలకు భిన్నంగా విలక్షణంగా ఉండి పొద్దు శాశ్వతంగా చదువుకొని భావించుకోదగ్గ కావ్యమయింది. వాల్మీకి, కాళిదాసు వంటి మహాకవుల కాలం నుండి శ్రీకృష్ణ దేవరాయల వంటి కవుల కాలం నుండి వెనుక, ముందు కవులు ఋతు వర్ణనలు మనోహర మనోజ్ఞంగా చేశారు, విశ్వనాథాదులూ చేశారు, రాశారు. అయితే జానపద యాస బాసలో చేసిన ఘనత రంధివారిదే.

వానా కాలంలో- "జలజల సినుకులడ్తావుంటే/ సమర్తాడిన గుంటలు/ సెమ్మసెక్కలాడ్తున్నట్టుంటాది/... వానలకి కొత్త తలుపు సెక్క లెదిగి/ సచ్చినోడి పల్లనా బిగుసుకుపోతే/ తెల్లారగట్ట తలుపుల్లో కుత్తీ పట్టిపట్టి/ భడాలున అయ్యి వూడొత్తే/ కొత్త మొగుడూ పెల్లాలు/ వోరు మీద వోరు పడిపోయి/ వొకటే సిగ్గులు/ ఆ సెనంలో ఆల్ని సూసినోల్ల/ కల్లల్లో లచ్చ ఎలుగులు" అంటారు. ఇందులో కైత వెలుగులున్నాయి.

"డబ్బుండాల గాని/ కోడిమాంసం గారెలు/ తింటావుంటే/ వానా కాలం/ సొరగమెహె!" - వానలకి ఇంట్లో వుండే కొందరి భావన. "వానకి మట్టీ యిసకా కొట్టుకపోయి/ కంకర్రోడ్డునిండా లెగిసిన రాలు/ దొంగరాలుగాయి కౌన్సిలేర్ల/ రంపంపల్లనా వుంటాయి." సామాజికాంశాల్ని కవిత్వీకరించడంలో సోమరాజు దిట్ట.

వ్యంగ్య మర్యాద తెలిసిన ఆయన, "గోదారి పూటుగా వొత్తే/ సూడ్డానికొచ్చే పట్టుసీర్ల రాణీలు/ బిడ్జీ కాడ ఈదుల్లోని నీలు సూసి/ సీర్ల కన్నా వొల్లే సిగ్గు లేన్దని/ గుడ్డలెత్తుకొని నడుత్తారు" అంటారు.

"వానలో ఎలిగే బల్బులు/ సిన్ని సేమంతి పూరేకు మొనల్లాటి/ సిరుసెమటతో మెరుత్తూ/ నల్లని కిరనాల వాన కురిపిత్తయ్/ సిన్ని బుడ్డి సూరి దేవుళ్ళనాగ" అని సౌందర్య వర్ణన చేస్తారు.

"జెర్రి పాకినట్టు ఆకాశం మీద సూడు/ ఎలా పాకుద్దో మెరుపు" అంటూ కవిత్వంలో పోలిక మెరుపు చూపిస్తారు.

"ఎన్ని సీతాపల్లు తిన్నా/ అదేటో/ ఆ ఇట్టానికిట్టమే గాని మరో అడ్డుండదు/ పానకంలో పుడక నాగ/ పిక్కలొక్కటే అడ్డు/ ఆటిని తిని తిని/ ఇన్ని నీలు తాగితే సాలు/ వొంటికేటీసెయ్యదు" అంటూ సీతాఫలవంత కవిత పలుకుతారు.

"ఏలెట్టి/ ఆకాశం కంటిలో పొడిత్తే/ కారే నీలలా/ వొకటే వాన", "సెట్లు కూలిపోయి/ పచ్చులు రాలిపోయి/ యీదుల్నిండ/ ఆకులు సెల్లాసెదురై వుంటే/ యిళ్ళన్నీ మొగుడుసచ్చినట్టు/ తెల్ల మబ్బు ముసుగుల్లో బెంగనావున్నాయ్/ తెల్లారేతలికి" అంటే భావుకతలో ఎంతటి లోతు!



జానపద సాహిత్యంలో తూర్పు యాస బాసలో వచన కవితల్లో ఋతువర్ణనలు రసవత్కవిత్వపు గీటురాయికి తగ్గట్లు రాసిన గొప్ప కవి రంధి సోమరాజు. ఈ వర్తమాన తరం కవులు ఆయనని పట్టించుకుని స్ఫూర్తి పొందవలసిన అవసరం ఉంది. ఇలా చెప్పడానికి కారణం ఆయన 'పొద్దు' కావ్యం. అది ఋతు వర్ణన రత్నాకరం. కమ్మని తూర్పు యాస బాసలోని మెత్తందనాన్ని గుత్తకు తీసుకున్న కావ్యం. కొత్తచూపు, కొత్త ఒరవడి పొదిగించుకున్న కవితాకాల ముద్రలవి.

"పట్టణాల్లోని బజారుల్లో/ మద్దుల నెత్తి మీద గొడుగులు/ ఎగుడు దిగుడు తార్రోడ్రునా వుంటాయి/ మేడ మీదున్న కుర్రోలు/ దాని మీద వో సిన్ని కారు/ తోలాలనుకుంటారు. నల్లటి గొడుగుపై భాగాలు తారు రోడ్డులా కనబడింది కవి దృష్టికి. అందరూ వచన కవిత అని వ్యవహరించే ప్రక్రియను సోమరాజు మాత్రం నవ కవిత అనే వ్యవహరిస్తారు. పొద్దు కవితల్ని 'నవ కవిత' అనే ముఖచిత్రంపై ప్రకటించారు.

ఇంక 'శీతకట్టు' విభాగంలో-

"పొద్దుటేల ఎండ మా సైతుగా వుంటాది/ బెమపడ్డ ఆడదాని ముందే/ కూసుండిపోయినట్టు/ య్యెండలో సతికిల పడాలనిపిత్తాది" అంటూ పోలికల డోలికల్లో ఊపుతారు. "అమ్మ కోసి పెట్టిన జున్ను ముక్క/ సలికి గడ్డ కట్టిన/ సెందురుడ్నా వుంది," అంటారు. "సన్నీలలో ఏలెడ్తే/ అయ్యి జివ్వున కర్సేసినాయి/ కొత్తగా పల్లొచ్చిన సిట్టి పాపాయినా"లో ఉపమానం బావుంది. "తెల్లారగట్ట/ గోదాట్లో/ అరటి దొప్పల్లో ఆడోళ్ళొదిలిన దివ్వెలు/ సుక్కలికి తల్లిసుక్కలెట్టిన బువ్వలోరే" అనడం మనోజ్ఞంగా ఉంటుంది. "ఎప్పుడూ నేదు గొల్లమ్మ/ సిక్కని పాలోసింది/ రేత్రి ఎన్నెల్ని కాని పిండుకుందేమో"... ఇలా ఎన్నెన్నో మరెన్నో!

'ఏసంగి పొద్దులు' విభాగంలో నిత్య జీవిత కార్యకలాపాల్లో వేసవి తాపాలు ఎలా ఉంటాయో బొమ్మకట్టి మరీ చూపారు. పిల్లలు ఈ కాలంలో, "తిండి తిన్రు/ వో నీలు తాగేత్తారు/ కూజా నీలంటే/ మాసెడ్డ మోజు/... కుర్రనాగమ్మల వొల్లు/ నూకల కూడు నా పేలిపోద్ది/ మంచిగందంసెక్క/ అరగదీసి పామితే/ తల్లి సుట్టూ గంధం బొమ్మల్లా గెంతులేత్తారు". గంధం బొమ్మలై గెంతులేయడం- చిత్ర దృశ్యమే!

"నల్లని నీడల్లో/ కొమ్మరాకులు సాటెట్టి/ దాసిన టెంకాయలు/ సెక్కు కోసి తాగితే పేనాలు లేసొత్తాయి/ నోట్లో ఏసుగుంటే సాలు/ మీగడ్లాటి నేత కొబ్బరి/ అమ్మ మనసునా కరుగుద్ది"- కైత ముగింపు వాక్యంలో బిగింపులో ఎంత ఆర్ద్రత! "సెక్కేసి వుప్పు నీలతో కడిగేసి/ అనాసకాయ ముక్కలు కోసుకోని/ పంచదారలో ఏసి నాలిక మీదెడితే... వాః/ ఎల్లవే ఏసంగీ/ మా దగ్గర కాదు నీ ఏసాలు/ అనాలనిపిత్తాది" అనడంలో బతుకు తీపి అనుభూతి చెందవలసిందే.

పల్లెటూళ్ళల్లో కొన్ని పట్టణాలలో సామాన్య జనుల సంపన్నుల ఉష్ణ జీవనాల దార్శనికత 'కవిత్వ రంధి'కి ఎంతో! అందుచేతనే- "వట్టేళ్ళ తడకలు కట్టుకోని/ నీలు జల్లించుకుంటూ బలిసినోలు/ పంకాలేసుకోని/ మద్దేనపేల/ సైతుగా కునుకుతారిల్లల్లో/ డబ్బున్నోలకి కాలం బలాదూరెహె" అంటారు.

రంధివారి రచనా నైపుణ్యానికి, ప్రాకృతిక సౌందర్య దర్శన దృష్టికి, భావుక శక్తికి తార్కాణంగా ఏసంగి పొద్దుల్లోని ఈ కైతని భావించాలి: "పిటపిటలాడే సాకలి సిన్నది/ వొయ్యారం వొల్లైంది/ రేవు కాడ రైకిసిరేసి/ వున్న వోయిల సీరిప్పకుండ/ నీలల్లో మునిగి/ మునేల మీద గట్టెక్కితే/ ఓరి నాయనో ఎయ్యి కల్లు సాలవే/ పొరలు పొరలుగా/ తడి వొదుగుల్ల సీర నలుగుళ్ళు/ సెర్మాన్ని సుట్టేసుకుని/ బిగువుల్ని సూపితే/ సిగ్గేసి సిన్నది సిన్న నవ్వు నవ్వితే/ ఛస్... ఆ నవ్వునా ఎలగనేకపోనానని/ సురీడు సిగ్గుతో సత్తాడంతే," అన్నారు.

ఇటువంటి స్వచ్ఛ జానపద మార్గ వచన కవితల్ని కూర్చుకుంది కనకే 'పొద్దు'ను, 'పొద్దు' కవినీ కవిత్వ రంగంలో హేమాహేమీలు నిండా ఇష్టంతో మెచ్చులు కురిపించారు. ఆచార్య సి. నారాయణరెడ్డి "సోమరాజు సేతిలో యేం మయిమ వుందోగాని అందరికీ విరుకున్నదే మా ముద్దుగ జెప్పుతడు. ఒకసారి యెన్నపూస తీర్గ యిడదీసి సూపుతడు. ఇంకోసారి యెండి కొండంత యెదిగి అందకుండ పోతడు" అన్నారు. సంజీవదేవ్ "సోమరాజు చూసే చూపు వేరు; రాసే రూపు వేరు" అంటారు. దాశరథి "మన ఊళ్ళలో మాట్లాడుకునే భాషకు కావ్యతను కల్పించి ఒప్పించడం మెప్పించడం సోమరాజుకే చెల్లింది. ఆచ్ఛాదనలేని అపురూప సౌందర్యం 'పొద్దు'లో ప్రతి పంక్తిలోను నాకు కన్పించింది. ఈయన కవితా సౌందర్యాన్ని చూడడానికి వేయి కళ్ళు చాలవు" అన్నారు. మల్లంపల్లి శరభయ్య "ఇది జానపదుల ఋతుసంహారం! కాదు - కాదు - ఈ జాతి జీవనంలో ఇది కొంగ్రొత్త పొద్దు! పూర్వ ఋతు వర్ణనలు చదివి, యిది చదివితే - ఉద్యాన లతల అందం అడవితీగల అందం ముందు బలాదూరు అన్న కాళిదాసు గుర్తుకు రాక మానదు" అనడంలో ఎంతో విశేషముంది.

రంధి సోమరాజు ఈ ఒక్కరచనతోనే పొద్దు పుచ్చలేదు. దశాధిక గ్రంథాలు రాశారు. విరగిన కల్చర్, సిన్నమ్మ వచ్చింది, బుల్లి బుల్లి స్కెత్రాలు, రసోరా, రోజీ, ఎదగండి, బూర్జువా పెళ్ళికూతురు, దినమొల సోగ్గత్తె వంటి కవిత్వ గ్రంథాలు రాసి ప్రసిద్ధి పొందారు. ఆదర్శాలు అవరోధాలు, సౌందర్యం - సౌశీల్యం, దుఃఖితులు వంటి నవలలు రాసిన నవలా రచయిత. ఉన్నతాశయాలు, దేవుడైన మానవుడు, నేనేమి చేశాను, ఈ మనిషి ఈ లోకం, సోమరాజు కథలు- రాసిన కథా రచయిత. రతనాల తండ్రి అనే నాటికను రాశారు. సోమరాజు 1927 మార్చి 1వ తేదీన రాజమహేంద్రవరంలో జన్మించారు. 2006 సంవత్సరం జనవరి 25వ తేదీన విశాఖపట్నంలో 79వ ఏట కీర్తిశేషులయ్యారు. ఆధునిక, అభ్యుదయ, విప్లవ భావాల సమాహారం ఆయన రచనలు. జానపదపు తూర్పు యాస బాసలో పొద్దును ప్రయోజనకర కావ్యంగా ప్రయోగాత్మక కావ్యంగా ఋతు వర్ణనల గ్రంథంగా కవిత్వ రసజ్ఞులకు ప్రదానం చేసిన అవిస్మరణీయుడు ఆయన.

సన్నిధానం నరసింహశర్మ

92920 55531

ప్రాచీన కావ్యాలు, లక్షణ గ్రంథాలపై సమాలోచన

తెలంగాణ విశ్వవిద్యాలయం తెలుగు అధ్యయన శాఖ - ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం నెల్లూరు, భారతీయ భాషా సంస్థ మైసూరు సంయుక్త ఆధ్వర్యంలో 'తెలుగు ప్రాచీన శాస్త్ర కావ్యాలు, లక్షణ గ్రంథాలు - సమాలోచన' అంశంపై మార్చి 5, 6 తేదీల్లో నిజామాబాద్ డిచ్‌పల్లిలోని తెలంగాణ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్మెంట్ కళాశాల సెమినార్ హాల్లో జాతీయ సదస్సు జరుగుతుంది. ఈ సదస్సుకు ముఖ్య అతిథి బుర్రా వెంకటేశం, విశిష్ట అతిథులుగా ఎం. యాదగిరి, శైలేంద్ర మోహన్. సభలో కసిరెడ్డి వెంకట రెడ్డి, మాడభూషి సంపత్ కుమార్, సి. ఆరతి, పి. కనకయ్య తదితరులు పాల్గొంటున్నారు.

సిహెచ్ లక్ష్మణ చక్రవర్తి

ఫీచర సునీతా రావు పురస్కారాలు

ఫీచర సునీతారావు పురస్కారాలు 2023 సంవత్సరానికి గజ్జల రామకృష్ణ 'దీపముండగానే' కవిత్వ సంపుటికి; చింతకింది శ్రీనివాస్ 'ఉడుకు బెల్లం' కథా సంపుటికి; లక్ష్మణ చక్రవర్తి 'షడ్చక్రం', ఆడెపు లక్ష్మీపతి 'దిక్ చక్రం' విమర్శ పుస్తకాలకు లభించాయి. విజేతకు రూ.15000 నగదు జ్ఞాపికతో సత్కారం ఉంటుంది. విమర్శలో మాత్రం ఇద్దరు వ్యక్తులు సమానమైన మార్కులు సాధించి ఉమ్మడి విజేతలుగా ఎంపికయ్యారు. త్వరలో పురస్కార ప్రదానం జరుగుతుంది.


పి విజయేందర్ రావు

వచన కవితల పోటీ ఫలితాలు

కవిసంధ్య - భట్టిప్రోలు దుర్గాలక్ష్మీప్రసన్న స్మారక వచన కవితల పోటీలో రూ.3వేల ప్రథమ బహుమతికి 'ఖండిత శిరస్సుల ప్రశ్న' (బి. కళాగోపాల్), రూ.2వేల ద్వితీయ బహుమతికి 'యుద్ధలిపి' (ఆవాల శారద), రూ.1వెయ్యి తృతీయ బహుమతికి 'ఒంటరిరేవు' (చొక్కర తాతారావు) ఎంపికయ్యారు. ఒక్కొక్కటి రూ.500 కన్సొలేషన్ బహుమతులకు దేశరాజు, కుందుర్తి కవిత, రాజేశ్వరరావు లేదాళ్ల, లోగిశ లక్ష్మీనాయుడు, కె. దాసుబాబు, దాసరి మోహన్, నేలపూరి రత్నాజీ, పొత్తూరి సీతారామరాజుల కవితలు ఎంపికయ్యాయి. సాధారణ ప్రచురణకు బి.వి. శివప్రసాద్, చిక్కొంద్ర రవి, బి. నాగరాజు, ఎ. శ్రీనివాసరావు, రమాదేవి కులకర్ణి, మల్లిపూడి రవిచంద్ర, కవిరాజుల కవితలు ఎంపికయ్యాయి. మార్చి 24 సా.5 గం.లకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో బహుమతి ప్రదానం ఉంటుంది.

దాట్ల దేవదానం రాజు

సముద్ర పక్షి



1.
రోజు రెండుగా చీలుతున్నపుడు
ఇల్లు గుర్తొచ్చి
గుండె పట్టనంత దిగులు
లోలోపలొక సుడిగుండపు రొద
రోజూ ఉండేదే

నన్ను నేను మడత పెట్టుకుని
కప్బోర్డ్‌లో సర్దుకునే లోపు
కేబిన్ రూం నుండి కబురు
జీవితాన్ని ఎక్కడిదక్కడ
వదిలేసి వెళ్ళిపోతాను

2.
దేశం కాని దేశంలో దిగుతున్నపుడు
చంటిదో చంటోడో గుర్తొచ్చి
మోయలేనంత రెప్పల బరువు

కాళ్ళకు సరిపడా నేల కోసం
వెదుకులాటలో
దేశాలు చాలా చిన్నవి
ఆకలీ అవసరాల ముందు
ప్రపంచపటం ఏ ఫోర్ సైజు కాగితం

బతుకును గాడిలోపెట్టే రెంచీ ఒకటి పట్టుకుని
ఖండాలమీద సముద్రపక్షిలా ఎగురుతుంటాను
రెక్కల్ని ఆరబెట్టుకోవడానికి
ఒక్క చెట్టూ కనబడదు

3.
బిస్తరి మడతలు విప్పినట్టు
రాత్రిని విప్పుతుంటే
ప్రాణంలో సగం గుర్తొచ్చి నిట్టూర్పు

రాత్రుళ్లు నేను
సగం ఒడ్డు మీదా సగం నీళ్ళలోనూ
ఊగే పడవను

చెదిరిన జ్ఞాపకాల్ని మూటగట్టుకొనేలోపే
పనులు చిట్టా విప్పడానికి
తెగిస్తుంది వేకువ

పనిలో పడిపోతే మరణిస్తాననే
విరామాల్లో తప్పనిసరిగా జీవిస్తుంటాను

4.
ఎత్తిపోసే నురగల మెరుపంతా తీరంలోనే
లోపలంతా కాటుకరంగు సముద్రం
పులికి దొరికిపోకుండా ఉండడానికి
చీకటిపొదలకు చిక్కుతుంటాను

ఎనిమిదో తొమ్మిదో నెలల తర్వాత
డ్యూటీ దిగి ఊళ్ళోకి వెళ్తుంటే
అందరికీ నేనొక కొత్త కరెన్సీనోటు గానో
పాత ఏటీఎం కార్డుగానో కనిపిస్తాను

5.
డెక్ మీద కొన్ని సాయంత్రాలు
నాకు నేను ఒక గాలిపటాన్ని.
దారం నుండి నన్ను తెంపేసే
పెనుగాలి అంటూ ఒకటి ఉంటుందని తెలుసు

సొంతగడ్డ మీద
చివరి ఊపిరి విడిచే అదృష్టం
నా వరకూ ఒక యాదృచ్ఛిక ఘటన.

సాంబమూర్తి లండ

96427 32008

ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 35.3 కనిష్ఠం 23.5

నేడు, రేపు ప్రధాని పర్యటన ● పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు

హైదరాబాద్ సిటీ (ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పర్యటన సందర్భంగా 4, 5 తేదీల్లో పలుప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని సిటీ ట్రాఫిక్ అడిషనల్ సీపీ తెలిపారు. నాలుగోతేదీన రాత్రి 7:40 నుంచి 8:10 మధ్య బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి రాజ్‌భవన్ మార్గంలో, ఐదోతేదీన ఉదయం 9:50 నుంచి 10:15 మధ్య రాజ్‌భవన్ నుంచి బేగంపేట ఎయిర్‌పోర్టు మార్గంలో ఆంక్షలు ఉంటాయన్నారు.



వాస్తవ విస్తీర్ణం **90** ఎకరాలు
ప్రస్తుత విస్తీర్ణం **60** ఎకరాలు

ఇది శేరిలింగంపల్లి పరిధిలోని గోపీ చెరువు పరిస్థితి.. దాదాపు 30 ఎకరాలు ఆక్రమణకు గురయ్యాయి. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో అధికారికంగానే 50 ఆక్రమణలను గుర్తించారు. అనధికారికంగా అంతకుమించే ఉంటాయి.



వాస్తవ విస్తీర్ణం **27.26** ఎకరాలు
ప్రస్తుత విస్తీర్ణం **20** ఎకరాలు

ఈ చెరువు గోపన్‌పల్లిలోనిది. ఇది కూడా కాలక్రమేణా కుంచించుకుపోతోంది. ఈప్రాంతంలో ఇప్పటికే 40 ఆక్రమణలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. మట్టిపోస్తూ కబ్జా ప్రయత్నాలు ఇంకా జరుగుతూనే ఉన్నాయి.




వాస్తవ విస్తీర్ణం **27** ఎకరాలు
ప్రస్తుత విస్తీర్ణం **14** ఎకరాలు

గగన్‌పహాడ్ పై భాగంలో ఉన్న అప్పా చెరువు పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. రికార్డుల్లో చెరువు విస్తీర్ణం 27 ఎకరాలకుపైగా ఉన్నప్పటికీ.. కొందరు స్థానిక రాజకీయ నేతల ప్రోత్సాహంతో యథేచ్ఛగా కబ్జాలు జరుగుతున్నాయి.

అచ్చెరువు పోయేలా..!

మట్టిపోసి చదును చేస్తూ.. ఆక్రమణలు



చెరువులు చెర -1



వాస్తవ విస్తీర్ణం **84** ఎకరాలు
ప్రస్తుత విస్తీర్ణం **60** ఎకరాలు

ఇది నల్లగండ్ల చెరువు పరిస్థితి. దాదాపు 24 ఆక్రమణలను ఇక్కడ గుర్తించారు.



వాస్తవ విస్తీర్ణం **12** ఎకరాలు
ప్రస్తుత విస్తీర్ణం **8** ఎకరాలు

ఖాజాగూడలోని పెద్దచెరువులో నాలుగు ఎకరాలు కబ్జాకు గురయ్యాయి.

- కుంచించుకుపోతున్న జలాశయాలు
- ఎఫ్‌టీఎల్‌లోనూ నిరభ్యంతర పత్రాలు
- రెవెన్యూ, ఇరిగేషన్ విభాగాల తీరుపై ఆరోపణలు
- వాటి ఆధారంగా జీహెచ్ఎంసీ అనుమతులు
- కోకొల్లలుగా వెలుస్తున్న అక్రమ నిర్మాణాలు

ఒకప్పుడు నల్లగండ్లలోని పెద్దచెరువును చూసినవారు.. ఇప్పుడెళ్లి చూస్తే.. ఆశ్చర్యపోవాల్సిందే. ఎందుకంటే, అప్పుడు 84 ఎకరాల్లో కనిపించిన చెరువు.. ఇప్పుడు 60 ఎకరాలకే పరిమితమైంది. మిగిలిన 24 ఎకరాలూ ఆక్రమణకు గురయ్యాయి. సిటీపరిధిలోని మెజార్టీ చెరువులు ఇప్పటికే కనుమరుగు కాగా, శివారు ప్రాంతాల్లోనూ క్రమంగా అదే పరిస్థితి కనిపిస్తోంది. పరిరక్షించాల్సిన ప్రభుత్వ విభాగాలు చేష్టలుడిగి చూస్తున్నాయి. ఫలితంగా అక్కడక్కడా మిగిలిన చెరువుల్లోనూ అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి. పలుప్రాంతాల్లో 'అధికారి'క అనుమతులతో ఏకంగా లే అవుట్‌ల అభివృద్ధి, బహుళ అంతస్తుల భవనాల నిర్మాణం యథేచ్ఛగా జరుగుతోంది. మహానగరంలోని చెరువుల దుస్థితిపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

హైదరాబాద్ సిటీ, మార్చి3 (ఆంధ్రజ్యోతి): చెరువుల పరిరక్షణ, సుందరీకరణకు వందల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోన్న బల్దియా.. అదే జలాశయాలను మింగేస్తూ చేపడుతున్న నిర్మాణరంగ ప్రాజెక్టులకు గుడ్డిగా అనుమతులిస్తోంది. ఫుల్‌ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్), బఫర్‌జోన్ వంటివి పరిగణనలోకి తీసుకోకుండానే అడిగినంత ఇస్తే.. దరఖాస్తుదారుడు కోరుకున్నట్టు ఇరిగేషన్, రెవెన్యూ విభాగాలు ఎన్‌ఓసీ(నిరభ్యంతర పత్రం) జారీ చేస్తున్నాయి. వాటిని ప్రామాణికంగా తీసుకుంటున్న జీహెచ్ఎంసీ పట్టణ ప్రణాళికా విభాగం.. క్షేత్రస్థాయి పరిస్థితులు పరిగణనలోకి తీసుకోకుండా అనుమతులిస్తోంది. ఇక అక్రమంగా వెలిసే నిర్మాణాలకు లెక్కే లేదు. ఎఫ్‌టీఎల్ నిర్ధారణ, సరిహద్దుల గుర్తింపు.. ఫెన్సింగ్ ఏర్పాటు నామ్‌కేవాస్తేగా సాగుతుండడంతో చెరువుల పరిరక్షణ ప్రహసనంగా మారింది. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో ఇటీవల నగరంలోని పలు చెరువులను సందర్శించిన అడ్వకేట్ కమీషన్ క్షేత్రస్థాయిలో పరిస్థితులు చూసి నిర్ఘాంతపోయింది. చెరువుల ఎఫ్‌టీఎల్‌లో కాలనీలు, బహుళ అంతస్తుల భవనాలు ఉండడంపై ఆశ్చర్యం వ్యక్తం చేసింది.

నామ్ కే వాస్తేగా...

అధికారిక లెక్కల ప్రకారం గ్రేటర్‌లో 185 చెరువులున్నాయి. వీటి పరిరక్షణలో భాగంగా ఎఫ్‌టీఎల్ నిర్ధారణ, బఫర్ జోన్ గుర్తింపునకు హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ), రెవెన్యూ, ఇరిగేషన్ విభాగాలు దాదాపు దశాబ్దం క్రితం శ్రీకారం చుట్టాయి. కానీ ఇప్పటికీ ప్రక్రియ

మిగతా 8వ పేజీలో..



బైరామల్‌గూడ చౌరస్తాలోని మద్దెలకుంట చెరువు

గతంలో రేవంత్ ఆదేశించినా..

ఓవైపు సాగర్ రింగ్‌రోడ్డు.. మరోవైపు కర్మన్‌ఘాట్ రహదారి.. బైరామల్‌గూడ చౌరస్తాలోని మద్దెలకుంట చెరువు కనుమరుగవుతోంది. సర్వే నంబర్ 16లో 6.25 ఎకరాల విస్తీర్ణంలో మద్దెలకుంట చెరువు ఉన్నట్టు రికార్డుల్లో ఉంది. దాదాపు 2.5 ఎకరాల మేర చెరువు ఆక్రమణకు గురైంది. ప్రస్తుత సీఎం, నాటి మల్కాజిగిరి ఎంపీ రేవంత్‌రెడ్డి రెండేళ్ల కింద చెరువును పరిశీలించారు. ఆక్రమణలు తొలగించాలని అధికారులను ఆదేశించారు. అయినా ప్రభుత్వ విభాగాలు పట్టించుకున్న దాఖలాలు లేవు. ఆక్రమణల తొలగింపును పక్కన పెడితే.. చెరువు కబ్జా మరింత పెరిగింది. వంతెన పక్కన చెరువులో కొత్తగా నిర్మాణాలు వెలిశాయి. మరోవైపు సాయినగర్ కాలనీలోనూ చెరువును ఆక్రమిస్తూ నిర్మాణాలు యథేచ్ఛగా సాగుతున్నాయి.



పరోక్షంగా ఆక్రమణదారులకు భరోసా

రూ.271 కోట్లతో సుందరీకరణ, బండ్‌ల బలోపేతం వంటి పనులను అధికారులు చేపట్టారు. చాకలివాని చెరువు, దోబీ చెరువు, గోపన్‌పల్లి పెద్ద చెరువు, కూకట్‌పల్లి ఎల్లమ్మ చెరువు, బంజారా లేక్, ఉప్పల్‌లోని నల్ల చెరువు, బాతుల కుంట, కాప్రా చెరువుల్లో ట్రాక్‌ల నిర్మాణం, మురుగు నీటి మళ్లింపులో భాగంగా చుట్టూ మట్టి పోశారు. వీటిలో కొన్ని పనులు పూర్తవగా.. ఇంకొన్ని పురోగతిలో ఉన్నాయి. వాస్తవ ఎఫ్‌టీఎల్‌ను పట్టించుకోకుండా, ఆక్రమణలను తొలగించే ప్రయత్నం చేయకుండా ప్రస్తుతం చెరువు ఉన్నంత మేర బండ్‌లు నిర్మిస్తున్నారు. దీంతో ఇప్పటి వరకు వెలిసిన అక్రమనిర్మాణాల విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోమన్న సంకేతాలు ఇచ్చినట్టవుతోంది. దీంతో ఇంకొన్ని చెరువులను అక్రమార్కులు కబ్జా చేస్తున్నారు. నలువైపులా మట్టి పోస్తుండడంతో వర్షపు నీరు చెరువులోకి వెళ్లే పరిస్థితి లేకుండా పోతోంది. అక్కడక్కడా కల్వర్టులు ఉంటాయని జీహెచ్ఎంసీ ఇరిగేషన్ విభాగం అధికారులు చెబుతుండగా, క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి లేదు. 'కొత్తకాలనీలు వరద ముంపునకు గురయ్యేందుకూ సుందరీకరణ పనులూ ఓ కారణం. చెరువుల్లోకి వరద నీరు వెళ్లే పరిస్థితి లేక.. పక్కనున్న కాలనీలు, బస్తీలు మునుగుతున్నాయి' అని పర్యావరణ నిపుణుడొకరు పేర్కొన్నారు. చెరువులు ఎండిపోవడంతో పరిసర ప్రాంతాల్లోని భూగర్భ జలాలపైనా ప్రభావం పడుతోంది.



జిల్లెలగూడ చందచెరువు

సుందరీకరణ పేరుతో..

వాస్తవానికి ఏ చెరువుకైనా ఒకవైపు బండ్ (కట్ట), సామర్థ్యానికి మించిన నీరు దిగువకు వెళ్లేలా మరోవైపు అలుగు(మత్తడి) ఉంటాయి. మిగతావైపుల్లో వర్షపునీరు చేరేందుకు వీలుగా ఇన్‌లెట్లు, అనుసంధానంగా నాలాలు, ఖాళీస్థలం ఉంటాయి. అభివృద్ధి, సుందరీకరణ పేరిట చెరువు చుట్టూ కొంత స్థలాన్ని వదిలి ట్రాక్‌ల నిర్మాణం కోసం జీహెచ్ఎంసీయే మట్టి పోసి నింపుతోంది. నలువైపులా మట్టి పోసి బండ్, వాకింగ్ ట్రాక్‌లు, ల్యాండ్ స్కేపింగ్, సందర్శకులు కూర్చునేందుకు కుర్చీలు వంటివి ఏర్పాటు చేస్తోంది.

పోలియో రహిత సమాజాన్ని నిర్మించాలి



చిన్నారికి పోలియో నివారణ చుక్కలు వేస్తున్న మంత్రి పొన్నం, చిత్రంలో కలెక్టర్ అనుదీప్

● జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం

హైదరాబాద్ సిటీ, మార్చి3 (ఆంధ్రజ్యోతి): పోలియో రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖల, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నదని తెలిపారు. నగరంలోని చింతల్‌బస్తీ అర్బన్ ప్రైమరీ హెల్త్‌సెంటర్‌లో ఏర్పాటు చేసిన పల్స్‌పోలియో కార్యక్రమాన్ని మంత్రి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో 2007 తర్వాత నుంచి ఒక్క పల్స్‌పోలియో కేసు కూడా నమోదు కాలేదని వివరించారు. కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లల నిండైన జీవితానికి రెండు పోలియో చుక్కలు వేయించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 0-5 ఏళ్ల లోపు 5,06,930 మంది చిన్నారులు ఉన్నారని, వీరి కోసం 2,800 బూత్‌లను, 85 ట్రాన్సిట్ కేంద్రాలు, 79 మొబైల్ బృందాలు, 11200 మంది సిబ్బందిని ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఈనెల 4,5,6 తేదీల్లోనూ ఇంటింటా పోలియో చుక్కల కార్యక్రమం కొనసాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వెంకట్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి, ఆశా, ఏఎన్ఎం సిబ్బంది పాల్గొన్నారు.

సింథ'ట్రిక్స్'లో ఉన్నతాధికారులు సేఫ్!

- అక్రమార్జనలో సింహభాగం వాటాలు వారికే
- అయినా చర్యలు తీసుకున్న దాఖలాలు కరువు
- కింది స్థాయి సిబ్బందిపైనే వేటు
- గతంలో సీసీఎస్‌లో కేసు



హైదరాబాద్ సిటీ, మార్చి3 (ఆంధ్రజ్యోతి): సింథటిక్ వేలిముద్రలతో పారిశుధ్య కార్మికుల హాజరు వేస్తూ జీహెచ్ఎంసీ ఖజానాకు గండికొడుతున్న సిబ్బందిని ఇప్పటికి నాలుగు పర్యాయాలు పోలీసులు అరెస్టు చేశారు. ప్రతిసారీ క్షేత్రస్థాయిలో పనిచేసే శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్లు(ఎస్ఎఫ్ఏ), జవాన్లపై వేటు పడుతోంది. ఆ అక్రమాల్లో నెలనెలా వాటాలు తీసుకుంటున్న ఉన్నతాధికారులు సేఫ్‌గా ఉంటున్నారు. అంబర్‌పేట సర్కిల్ ఘటనలోనూ అదే జరిగింది. 31 సింథటిక్ వేలిముద్రలతో పట్టుబడిన ఎస్ఎఫ్ఏలు ఉమేష్, శివరాంలతో పాటు, 11 మంది కార్మికులను విధుల నుంచి తొలగించారు. వీరి పనితీరు పర్యవేక్షణలో నిర్లక్ష్యం వహించినందుకు శానిటరీ సూపర్‌వైజర్ ప్రతాప్‌సేన్‌ను సస్పెండ్ చేస్తున్నట్టు కమిషనర్ ఆదేశాల మేరకు డిప్యూటీ మునిసిపల్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎందుకిలా..? కేవలం కింది స్థాయి ఉద్యోగులే ఎందుకు బలవుతున్నారు..? అన్న చర్చ బల్దియాలో జరుగుతోంది.

రహదారులు ఊడ్చే పారిశుధ్య కార్మికుల పనితీరును పర్యవేక్షించేందుకు జీహెచ్ఎంసీలో 952 మంది ఎస్ఎఫ్ఏలు ఉన్నారు. ఒక్కో ఎస్ఎఫ్ఏ పరిధిలో 14 నుంచి 21 (రెండు, మూడు యూనిట్లు) మంది కార్మికులు పని చేస్తుంటారు. కార్మికుల బోగస్ హాజరు విషయంలో శానిటరీ సూపర్‌వైజర్ స్థాయి వరకు చర్యలు తీసుకుంటున్న ఉన్నతాధికారులు ఏఎంఓహెచ్‌లు, డీసీల జోలికి వెళ్లడం లేదు. గతంలోనూ సంస్థలోని విజిలెన్స్ విభాగం అధికారులు సింథటిక్ వేలిముద్రలతో కార్మికుల హాజరు వేస్తోన్న తొమ్మిది మంది ఎస్ఎఫ్ఏలను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ వ్యవహారంపై విచారణ జరపాల్సిందిగా సీసీఎస్‌లోనూ ఫిర్యాదు చేశారు. అప్పట్లో ఇది సంచలనంగా మారింది. తర్వాత ఏమైందో ఏమో.. ష్.. గప్‌చుప్ అన్నట్టుగా ఎవరూ దీని గురించి పట్టించుకోలేదు.

హైదరాబాద్‌పై కమలం గురి

● మజ్లిస్‌కు గట్టి పోటీ ఇచ్చేందుకే ధార్మికవేత్త మాధవీలతకు టికెట్ కేటాయింపు



మాధవీలత

హైదరాబాద్ సిటీ, చాంద్రాయణగుట్ట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : నగరంలో బీజేపీ పూర్వ వైభవం కోసం ప్రయత్నిస్తోంది. పాతబస్తీలో పార్టీని పటిష్టం చేయాలనే ధ్యేయంతో అడుగులు వేస్తోంది. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో హైదరాబాద్ స్థానంలో మజ్లిస్‌కు గట్టి పోటీ ఇచ్చేందుకు విరించి ఆస్పత్రి, లతామా ఫౌండేషన్‌ల చైర్‌పర్సన్ మాధవీలతకు టికెట్ ఖరారు చేసింది. మజ్లిస్‌కు దీటుగా ఉండేందుకే మాధవీలతకు టికెట్ ఇచ్చినట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. రాజకీయాలకు మాధవీలత కొత్త. ఆమెకు పార్టీలో గాడ్‌ఫాదర్ ఎవరూ లేరనే చెప్పొచ్చు. ఎంఐఎం కంచుకోటను బద్దలు కొడతానని ఆమె ధీమా వ్యక్తం చేస్తున్నారు. తొలుత హైదరాబాద్ స్థానంలో గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌ను బరిలో నిలపాలని భావించినా ఆయన నిరాకరించారని సమాచారం. ఎన్‌సీసీ క్యాడెట్‌గా, క్లాసికల్ సింగర్‌గా మాధవీలత గుర్తింపు తెచ్చుకున్నారు. బ్రాహ్మణ సామాజికవర్గానికి చెందిన మాధవీలత రెండేళ్లుగా పాతబస్తీ వేదికగా అనేక ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తూ సోషల్ మీడియాలో చురుగ్గా ఉంటున్నారు. గోశాలతో పాటు భారీ యజ్ఞశాల ఏర్పాటు చేసి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగాలు, పాలనా స్ఫూర్తితో బీజేపీలో చేరారు. కొంతకాలంగా పాత బస్తీ ప్రజలతో మమేకమై పేదలను ఆదుకుంటున్నారు. సామాజిక కార్యకర్తగా ట్రిపుల్ తలాక్‌పై అనేక ముస్లిం మహిళా సంఘాలతో కలిసి పనిచేశారు. ఎంపీ అసదుద్దీన్ ఓవైసీపై కౌంటర్‌గా ఇచ్చిన పలు ఇంటర్వ్యూలతో ఆమె పాపులర్ అయ్యారు. బీజేపీ ప్రతినిధిగా అసదుద్దీన్ విధానాలను తనదైన శైలిలో వ్యతిరేకించడంతో పార్టీ అధిష్ఠానం దృష్టిలో పడ్డారు. మాధవీలత ఎంపికపై పునరాలోచించాలని హైదరాబాద్ స్థానం కోసం ప్రయత్నాలు చేసిన బీజేపీ భాగ్యనగర్ జిల్లా నాయకులు అధిష్ఠానాన్ని కోరుతున్నారు.

25 ఏళ్లు సంతోష్‌నగర్‌లోనే..

మాధవీలత పాతబస్తీలోని ఓల్డ్ సంతోష్ నగర్‌లో జన్మించారు. విద్యాదాయిని పాఠశాలలో ప్రాథమిక విద్యనభ్యసించారు. నిజాం కాలేజీలో డిగ్రీ, కోఠి ఉమెన్స్ కాలేజీలో పొలిటికల్ సైన్స్‌లో పీజీ పూర్తి చేశారు. ఆమె పుట్టి పెరిగిందంతా ఓల్డ్ సంతోష్‌నగర్‌లోనే. 25 సంవత్సరాల పాటు అక్కడే ఉన్నారు. వివాహం అనంతరం భర్త కె.విశ్వనాథ్ (విరించి గ్రూప్ ఫౌండర్)తో కలిసి జూబ్లీహిల్స్‌కు వెళ్లిపోయారు. వీరికి

మిగతా 8వ పేజీలో..



కార్ట్ కారుతో రైజర్ విన్యాసం

రయ్.. రయ్ మంటూ కార్ట్ కార్ల పరుగు

● ఆకట్టుకున్న రెడ్‌బుల్ సోప్‌బాక్స్ నాన్ మోటార్ రేసింగ్

బంజారాహిల్స్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఇంజన్ లేని కార్ట్ కార్లు సందడి చేశాయి. విభిన్న రూపాల్లో ఉన్న వాహనాలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఇంజన్ ఉండదు, కేవలం స్టీరింగ్, చక్రాలు, బ్రేకులను ఉపయోగించి గురుత్వాకర్షణతో ఏటవాలు నుంచి పల్లపు ప్రాంతానికి అడ్డంకులను అధిగమించి పరుగులు తీయించాలి. 30 మంది రైజర్లు తమ ప్రతిభతో చూపరులను కట్టిపడేశారు. రెడ్‌బుల్ సోప్‌బాక్స్ నాన్‌మోటార్ రేసింగ్ మూడో ఎడిషన్ పోటీలు ఫిలింనగర్ రామానాయుడు స్టూడియోలో ఆదివారం జరిగాయి. తక్కువ బరువు ఉన్న పరికరాలతో సిద్ధమైన కార్లతో 23 రాష్ట్రాలకు చెందిన 30 మంది పోటీ పడ్డారు. ఎత్తు ప్రాంతం నుంచి పల్లపు ప్రాంతానికి వెళ్లేటప్పుడు వాహనాన్ని అధీనంలో ఉంచుకొని తక్కువ సమయంలో లక్ష్యం చేరుకునేందుకు రైజర్లు చేసిన విన్యాసాలు ఆకర్షించాయి. వైవిధ్యరూపాల్లో ఉన్న కార్లను చూసేందుకు నగరవాసులు ఉత్సాహం ప్రదర్శించారు. కార్ట్ కార్లతో ఫొటోలు దిగారు. ఈ పోటీలకు చెస్ క్రీడాకారుడు తినాయా సచ్‌దేవ్, హాకీ క్రీడాకారులు మన్‌ప్రీత్‌సింగ్, లాల్‌రెమ్సియామి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

నేడు జీహెచ్‌ఎంసీలో ప్రజావాణి

హైదరాబాద్ సిటీ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ప్రజావాణి జరగనుంది. లోయర్ ట్యాంక్‌బండ్‌లోని ఆఫీస్‌లో ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు ఫోన్ ద్వారా, అనంతరం నేరుగా పౌరుల నుంచి అధికారులు ఫిర్యాదులు స్వీకరిస్తారు. ఫోన్‌లో ఫిర్యాదు చేయాలనుకునే వారు 040- 21111111 నంబర్‌కు ఫోన్ చేయాలని కమిషనర్ రోనాల్డ్‌రోస్ సూచించారు. జోనల్, సర్కిల్ కార్యాలయాల్లోనూ ప్రజావాణి కార్యక్రమం జరగనుంది.

భానుడి భగభగ... 38.8 డిగ్రీలు

హైదరాబాద్ సిటీ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): భానుడి భగ.భగలతో నగరవాసులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. మార్చి మొదటి వారంలోనే పలు ప్రాంతాల్లో 39 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సరూర్‌నగర్, కార్వాన్‌లో ఆదివారం అత్యధికంగా 38.8 డిగ్రీలు నమోదయ్యాయి. వారం రోజుల క్రితం గ్రేటర్‌లో 3,100 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ నమోదైతే పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో 3,300 మెగావాట్లకు పెరిగింది. పగటి ఉష్ణోగ్రలతోపాటు రాత్రి ఉష్ణోగ్రత 24 డిగ్రీల వరకు నమోదవుతున్నది. మరో రెండురోజులు ఇదే తరహాలో ఉష్ణోగ్రతలు నమోదవుతాయని ఉపరితల గాలులు దక్షిణ/నైరుతి దిశలో గంటకు 4-8 కిలోమీటర్ల వేగంతో వీస్తాయని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు.

చార్మినార్	38.4
బేగంపేట	38.7
సంతోష్‌నగర్	38.5
గోషామహల్	38.3
ఉప్పల్	38.3
కాప్రా	38.3
హయత్‌నగర్	38.0
ఎల్‌బీనగర్	37.9
మూసాపేట	37.7
రాజేంద్రనగర్	37.6
కుత్బుల్లాపూర్	37.6

సహజనటి జయసుధకు ఎక్సలెన్స్ అవార్డు


నటి జయసుధకు అవార్డు ప్రదానం చేస్తున్న విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ

హైదరాబాద్ సిటీ, మార్చి 3(ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఈస్ట్ వారు సినిమా, సంగీతం, వైద్య విభాగాల్లో ఇచ్చే ప్రతిష్ఠాత్మక వొకేషనల్ ఎక్సలెన్స్ అవార్డు (వృత్తిపరమైన సమర్థత పురస్కారం)ను సినీ నటి జయసుధ అందుకున్నారు. హైదరాబాద్ ఫిల్మ్‌నగర్‌లో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం జయసుధకు అవార్డు ప్రదానం చేశారు. సినిమారంగం నుంచి సహజనటి జయసుధ, నటుడు కాదంబరి కిరణ్‌కుమార్, సంగీతం నుంచి ప్రఖ్యాత ఈలపాట గాయకుడు ఎంవీ రమణారెడ్డికి, బయోకెమిస్ట్రీ నుంచి డా.సాయిపద్మకు ఈ అవార్డును అందజేశారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ ఈస్టుకు చెందిన అధ్యక్షులు సుదేష్‌రెడ్డి, వొకేషనల్ సర్వీస్ డైరెక్టర్ సీవీ సుబ్బారావు, కార్యదర్శి టీఎంఎన్ చౌదరి, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎల్లో రిబ్బన్ రన్


విజేతలకు నగదు బహుమతి అందజేస్తున్న అతిథులు

ఖైరతాబాద్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఎండో మెట్రియాసిస్ వ్యాధిపై అవగాహన కల్పిస్తూ జరిగిన ఎల్లో రిబ్బన్ పరుగు చూపరులను ఆలోచింపజేసింది. ఎండో మెట్రియాసిస్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో దేశంలో తొలిసారిగా ఈ వ్యాధిపై అవగాహన కల్పిస్తూ పీవీ నర్సింహారావు మార్గంలోని జలవిహార్ నుంచి సంజీవయ్యపార్కు వరకు, తిరిగి జలవిహార్ వరకు 3కె, 5కె రన్‌లు జరిగాయి. దీనిని అపోలో ఆస్పత్రి సీఈవో తేజస్విరావు ప్రారంభించగా, ఎన్‌ఎండీసీ డైరెక్టర్ వినయ్‌కుమార్, ఎల్ఐసీ అధికారులు జీవీబీ రామయ్య, సంధ్యారాణి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ వీమీ బింద్రా మాట్లాడుతూ ఇది మహిళల్లో వచ్చే గర్భాశయ సంబంధిత వ్యాధి అని, ప్రపంచవ్యాప్తంగా 24 కోట్ల మంది మహిళలు దీనితో బాధపడుతుండగా దేశంలో 4.2 కోట్ల మంది అవస్థ పడుతున్నారని తెలిపారు. మహిళలు ప్రారంభదశలోనే చికిత్స చేయించుకునేలా చైతన్యం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అర్చనారెడ్డి, డాక్టర్ శ్వేతారెడ్డి, యువత పాల్గొన్నారు.

మెస్‌చార్జీలు, స్కాలర్‌షిప్‌లు పెంచాలి: ఆర్.కృష్ణయ్య


ధర్నాలో ఆర్.కృష్ణయ్య, తదితరులు

కవాడిగూడ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): పెరిగిన ధరల ప్రకారం రాష్ట్రంలోని ఎనిమిది లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టల్ గురుకుల పాఠశాల విద్యార్థులతో పాటు 16లక్షల మంది కళాశాలల విద్యార్థుల మెస్‌చార్జీలను పెంచాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద పెరిగిన నిత్యావసరాల ధరలకు అనుగుణంగా కళాశాలలు, పాఠశాలల విద్యార్థుల మెస్ చార్జీలు, స్కాలర్‌షిప్‌లను పెంచాలని డిమాండ్ చేస్తూ బీసీ విద్యార్థి సంఘం నేత జిల్లపల్లి అంజి, గుజ్జ సత్యం ఆధ్వర్యంలో విద్యార్థులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సొంత భవనాల్లో 300 హాస్టళ్ల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేష్, బీసీ సంఘం నాయకులు రాజేందర్, అనంతయ్య కృష్ణయాదవ్, నరసింహగౌడ్, రఘుపతి, వంశీ, మణికంఠ విద్యార్థులు పాల్గొన్నారు.

గృహజ్యోతి బిల్లుల జారీలో సమస్యలు..!

- వివరాలన్నీ సరిగా ఉన్నవారికే జీరోబిల్లులు

హైదరాబాద్ సిటీ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): గృహజ్యోతి జీరోబిల్లుల జారీలో సమస్యలు తలెత్తుతున్నాయి. మార్చి 1న ఉదయం 6గంటలకే గృహజ్యోతి జీరోబిల్లుల జారీని విద్యుత్‌శాఖ ప్రారంభించినా రోజుకు ఎంతమందికి జీరో బిల్లులు జారీచేస్తున్నారనే వివరాలు మాత్రం వెల్లడించలేకపోతున్నారు. హైదరాబాద్ సౌత్‌సర్కిల్‌లోని పలుప్రాంతాల్లో ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తుల్లో వివరాలు సరిగా లేకపోవడంతో పలువురికి సాధారణ విద్యుత్‌బిల్లులు ఇస్తున్నారు. దరఖాస్తులో అన్ని వివరాలు సరిగా నమోదుచేసి ఉండి, విద్యుత్‌శాఖ స్పాట్ బిల్లింగ్ మెషీన్లలో వివరాల పరిశీలన పూర్తయిన గృహజ్యోతి లబ్ధిదారులకు మాత్రం జీరో బిల్లులు జారీచేస్తున్నారు. అయితే గృహజ్యోతి అర్హత కలిగి వివరాలు తప్పుగా నమోదైతే జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకొని వివరాలు సరిచేయించుకుంటే వారికి కూడా జీరో బిల్లులు జారీచేస్తామని విద్యుత్‌శాఖ అధికారులు చెబుతున్నారు.

హైకోర్టు ఉద్యోగుల క్రికెట్ మ్యాచ్ రన్నర్ టీఎస్ జట్టు

అమరావతి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఏపీ, తెలంగాణ హైకోర్టు ఉద్యోగుల మధ్య మంగళగిరి అంతర్జాతీయ స్టేడియంలో ఆదివారం క్రికెట్ మ్యాచ్ జరిగింది. ఇరుజట్ల మధ్య హోరాహోరీగా జరిగిన ఈ మ్యాచ్‌లో ఏపీ జట్టు 18 పరుగులతో విజేతగా నిలిచింది. మొదట బ్యాటింగ్ చేసిన ఏపీ జట్టు 20 ఓవర్లలో 126 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన తెలంగాణ జట్టు 108పరుగులకు ఆలౌటైంది. అంతకు ముందు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎన్.జయసూర్య, జస్టిస్ సురేష్‌రెడ్డి, జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి క్రికెట్ మ్యాచ్‌ను ప్రారంభించారు. మ్యాచ్‌లో విజయం సాధించిన ఏపీ జట్టుకు ఏపీ హైకోర్టు ప్రోటోకాల్ రిజిస్ట్రార్ ఏవీ రాఘవస్వామి ట్రోఫీ అందజేశారు. రన్నరప్‌గా నిలిచిన తెలంగాణ జట్టుకు ఏపీ హైకోర్టు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అక్కెన వేణుగోపాల్ కప్ అందించారు.

నేడు టీఎస్ఆర్టీసీ లక్కీడ్రా

చాదర్‌ఘాట్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): గతేడాది దసరా సందర్భంగా అక్టోబర్ 18 నుంచి 30వ తేదీ వరకు టీఎస్ఆర్టీసీ లక్కీ డ్రా బాక్స్‌లను బస్సుల్లో ఏర్పాటు చేసింది. సోమవారం ఎంజీబీఎస్‌లో డ్రా తీయనున్నట్లు రంగారెడ్డి రీజియన్ ఇన్‌చార్జి ఆర్ఎం బి.రాజు తెలిపారు. ఎల్బీనగర్ జోన్ డీసీపీ శ్రీనివాస్ చేతుల మీదుగా రీజియన్ పరిధిలో 10 లక్కీ డ్రాలు తీయనున్నారని ఆయన తెలిపారు. ఇందులో ఐదుగురు మహిళలు, మరో ఐదుగురు పురుషులను ఎంపిక చేయనున్నారు. ఒక్కో విజేతకు రూ.9,900 నగదు బహుమతి ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

నిమ్స్ వైద్యుల పరిశోధన పత్రానికి మొదటి బహుమతి


ప్రజ్వల్, ఉమామహేశ్వరరావు

హైదరాబాద్ సిటీ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో మార్చి 1 నుంచి 3వ తేదీ వరకు నిర్వహించిన తెలంగాణ న్యూరో సైన్సెస్ 8వ వార్షిక సదస్సులో నిమ్స్ వైద్యులు ప్రజ్వల్, ఉమామహేశ్వరరావు సమర్పించిన పరిశోధన పత్రానికి మొదటి బహుమతి దక్కింది. తలకు గాయాలపాలైన రోగులపై ప్రొఫెసర్ డాక్టర్ ఎం.విజయ్ సారథి మార్గదర్శకత్వంలో వీరు పనిచేస్తున్నారు.


దూద్‌బౌలిలో చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న రాజేశ్ కుమార్


గోషామహల్‌లో పోలియో చుక్కలు వేస్తున్న బీఆర్ఎస్ బీసీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోటి శైలేష్


రాజేంద్రనగర్ వార్డు కార్యాలయంలో పోలియో చుక్కలు వేస్తున్న శ్రీధర్


ఉడంగడ్డలో మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సదాలక్ష్మి

పల్స్ పోలియో విజయవంతం

నేడు, రేపు ఇంటింటికీ సిబ్బంది


హైదర్‌గూడలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న కార్పొరేటర్ మోంద్ర సంగీత గౌరీశంకర్

రాజేంద్రనగర్/ అఫ్జల్‌గంజ్/ పహాడిషరీఫ్/ మదీన, మార్చి3(ఆంధ్రజ్యోతి): పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆధ్వర్యంలో ఏఎన్ఎం, అంగన్‌వాడీ సిబ్బంది, ప్రభుత్వ అధికారులు రాజేంద్రనగర్, అఫ్జల్‌గంజ్, పహాడిషరీఫ్, మదీన, చార్మినార్ ప్రాంతాలలోని కమ్యూనిటీ హాళ్లు, వార్డు కార్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడి కేంద్రాలలో 0-5సంవత్సరాలలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. రాజేంద్రనగర్ సర్కిల్‌లో 74 కేంద్రాల ద్వారా 36,209 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు రంగారెడ్డి జిల్లా డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సృజన తెలిపారు. డాక్టర్ రేఖ, డాక్టర్ శ్రీదేవీ, డాక్టర్ స్వాతీ పర్యవేక్షణలో వైద్య సిబ్బంది సిరాజుద్దీన్, చెన్న కేశవులు, శివకుమార్ పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. సర్కిల్ పరిధిలో ఐదేళ్లలోపు చిన్నారులు 37,718 మంది ఉన్నట్లు గుర్తించి, వారిలో 36,209 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేశామని తెలిపారు. సోమ, మంగళవారాలలో ఇంటింటికీ వెళ్లి వైద్య సిబ్బంది చిన్న పిల్లలకు పోలియో చుక్కలను వేస్తారని తెలిపారు.


వాదీ ఏ ముస్తఫా బస్తీలో చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న షేక్ అఫ్జల్


బిస్మిల్లా కాలనీలో పిల్లలకు పోలియో చుక్కలు వేస్తున్న కాంగ్రెస్ నాయకుడు సయ్యద్ అబ్దుల్

జూపార్కులో ప్రపంచ వన్యప్రాణి దినోత్సవం


వన్యప్రాణుల మాస్కులతో విద్యార్థులు

మదీన, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చిన్ననాటి నుంచే వన్యప్రాణులు, పర్యావరణంపై అవగాహన కలిగి వుండాలని జూపార్కు క్యూరేటర్ డాక్టర్ సునీల్ ఎస్.హిరెమత్ అన్నారు. మానవాళి మనుగడకు పర్యావరణంతోపాటు వన్యప్రాణులు కూడా దోహదం చేస్తాయన్నారు. ప్రపంచ వన్యప్రాణి దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం జూపార్కులో విద్యార్థులకు, సందర్శకులకు అవగాహన కల్పించారు. జూపార్కులోని జంతువులు, వాటి ఆహారం, జీవన శైలి గురించి అవగాహన కల్పించారు. వన్యప్రాణులను, చెట్లను కాపాడుదాం అంటు చిన్నారులతో ప్రతిజ్ఞ చేయించారు. జంతువుల వ్యాపారాలను అరికట్టాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ క్యూరేటర్లు, పీఆర్ఓ హనీఫుల్లాతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు పార్టీలో సముచిత స్థానం


నిర్మల్ కుమార్ యాదవ్‌ను సత్కరిస్తున్న ప్రేమ్‌లాల్ తదితరులు

అఫ్జల్‌గంజ్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు కాంగ్రెస్ పార్టీలో సముచిత స్థానం ఉంటుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ప్రేమ్‌లాల్ అన్నారు. ఆదివారం బేగంబజార్‌లోని యాదవ్ సమాజ్ భవనంలో యాదవ్ ఆహీర్ సమాజ్, కాంగ్రెస్ పార్టీల సంయుక్తాధ్వర్యంలో కాంగ్రెస్ ఓబీసీ విభాగం, యుపీ ఇన్‌చార్జి, జాతీయ కో-ఆర్డినేటర్‌గా నియామకమైన ఎం.నిర్మల్ కుమార్ యాదవ్‌కు సన్మాన సభ నిర్వహించారు. నిర్మల్ కుమార్ యాదవ్‌ను పలువురు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో శ్యామ్‌సింగ్, కన్నయ్యలాల్ సాహు, రఘునందన్ రూప్, జగదీష్ యాదవ్, దుర్గేశ్ ఆహీర్, బజరంగ్ లాల్, రూపుసింగ్, ఎండీ జహంగీర్, బద్రి, ఠాకూర్ చిత్తరంజన్ పాల్గొన్నారు.

చూడటం, వినడం కవిత్వానికి రెండు కళ్లు


యువ కవయిత్రుల అధ్యయన శిబిరంలో ఆచార్య ఎల్లూరి శివారెడ్డి తదితరులు

అఫ్జల్‌గంజ్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): తెలుగు సాహిత్య వికాసానికి కొత్త తరాన్ని తయారు చేయాలన్న సంకల్పంతో తెలంగాణ సారస్వత పరిషత్తు నిర్వహిస్తున్న కార్యక్రమాల పరంపరకు విశేష స్పందన లభించిందని పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, ప్రముఖ కవి సుంకిరెడ్డి నారాయణ రెడ్డి పేర్కొన్నారు.

ఆదివారం బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్తు ఆడిటోరియంలో జరిగిన యువ కవయిత్రుల అధ్యయన శిబిరంలో ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, కవి సుంకిరెడ్డి నారాయణ్ రెడ్డి మాట్లాడుతూ... చూడటం, వినడం కవిత్వానికి రెండు కళ్లు లాంటివి అన్నారు. మొదటిది చూడటం, రెండోది చూసిన దాన్ని వినడం, విన్న దాన్ని మననం చేసుకోవడం కవికి ముఖ్యంగా ఉండవలసిన లక్షణమని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

కార్యక్రమంలో ప్రొఫెసర్ డాక్టర్ దాసోజు పద్మావతి, బాల సాహిత్యవేత గరిపెల్లి అశోక్ తదితరులు పాల్గొన్నారు.


8న హరిహర క్షేత్రంలో శివరాత్రి ఉత్సవాలు

రాజేంద్రనగర్, మార్చి3 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం (హరిహర క్షేత్రం)లో ఈ నెల 8న మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం కమిటీ సభ్యులు ఆలయ ఆవరణలో సమావేశమై ఉత్సవ ఏర్పాట్లపై చర్చించారు. మహాశివరాత్రి రోజున ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తామని వారు తెలిపారు. శివరాత్రి రోజున ఉపవాసం ఉంటున్న భక్తులకు 9వ తేదీన అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశామని తెలిపారు. సమావేశంలో ఆలయ పూజారి అనంతాచార్యులు, దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పూజలు

రాజేంద్రనగర్, మార్చి3 (ఆంధ్రజ్యోతి): మైలార్‌దేవపల్లి డివిజన్ పద్మశాలిపురంలోని కేదరానాథ్ లింగేశ్వర స్వామి ఆలయాన్ని ఆదివారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాశ్ గౌడ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు ఎమ్మెల్యేకు ఆశీర్వచనాలు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు రాజు, యాదగిరి పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ వినికిడి దినోత్సవం


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి వెంకటేశం, డాక్టర్ భాస్కర్‌రావు తదితరులు

ఖైరతాబాద్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): వినికిడి బలహీనత ఓ అదృశ్య వైఫల్యమని, దానిని ముందే గుర్తిస్తే జీవితాలను మార్చి న వారమవుతామని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బి.వెంకటేశం అన్నారు. ప్రపంచ వినికిడి దినోత్సవం సందర్భంగా ఆశ్రయ్-ఆకృతి సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఖైరతాబాద్ విశ్వేశ్వరయ్య భవన్‌లో జరిగిన కార్యక్రమంలో పలువురు విద్యార్థులకు వినికిడి యంత్రాలను పంపిణీ చేశారు. దీంతోపాటు వినికిడి లోపాలతో బాధపడుతున్న విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా వెంకటేషం మాట్లాడుతూ ఆశ్రయ్-ఆకృతి సంస్థ వినికిడి లోపం ఉన్న పిల్లలకు కొత్త జీవితాలను అందించడంలో విశేష కృషి చేస్తున్నదన్నారు.


దర్గాకు చాదర్ సమర్పిస్తున్న ఎంపీ రంజిత్ రెడ్డి

మత సమరస్యాన్ని చాటే ఉర్సు

పహాడిషరీఫ్ మార్చి 3 (ఆంధ్రజ్యోతి): పహాడిషరీఫ్ దర్గా ఉర్సు మత సమరస్యాన్ని చాటుతుందని, చేవెళ్ల ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు, ఆదివారం పహాడిషరీఫ్ బాబా షర్ఫుద్దీన్ ఉర్సు సందల్‌ను పురస్కరించుకొని ఆయన దర్గాకు చేరుకొని చాదర్ సమర్పించారు. అనంతరం దర్గా ర్యాంప్ పనులను పరిశీలించారు. దర్గా వద్ద ఏసీపీ ఉమామహేశ్వర్‌రావు, ఇన్‌స్పెక్టర్ గురువారెడ్డి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇక జల్‌పల్లిలోని బాబా ఫక్రుద్దీన్ 739వ ఉర్సు సందల్ ఆదివారం రాత్రి జల్‌పల్లి జామే మసీద్ నుంచి మామిడిపల్లి రోడ్డులో ఉన్న దర్గాకు చేరుకుంది. మూతవల్లి షా మొహమ్మద్ రహిమమొద్దీన్ షకీల్ షహీర్వారి బాబా ఫక్రుద్దీన్ జీవిత విశేషాలా గురించి వివరించారు. ఆయా కార్యక్రమాలలో కొండల్ యాదవ్, గౌస్, రాజేష్, ముతవల్లీలు మొయినుద్దీన్, అహ్మద్ అలీ, సలీం, ఇమ్రాన్, ఇర్ఫాన్, నాసిర్ పాషా, సూరెడ్డి కృష్ణారెడ్డి, యంజాల జనార్దన్, సైఫ్ పటేల్ సయీద్ పటేల్, నజీబ్ పటేల్ పాల్గొన్నారు

మృతుల కుటుంబాలకు
రూ.15 లక్షల చొప్పున ఆర్థిక సహాయం

అఫ్జల్‌గంజ్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): సీవరేజీ పైపులైన్ పనుల్లో మృతిచెందిన ఒక్కో కుటుంబానికి రూ.15 లక్షలు ఆర్థిక సాయం అందజేశారు. జియగూడ బైపాస్ రోడ్డులో సివరేజీ పైపులైన్ మ్యాన్‌హోల్‌లో పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విషవాయువుల కారణంగా ఊపిరి ఆడక ముగ్గురు కూలీలు హనుమంత్, శ్రీనివాస్, వెంకటరాములు మృతి చెందిన విషయం తెలిసిందే. ఆదివారం అయ్యప్ప ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ ప్రతినిధి శంకర్‌గౌడ్ మృతుల కుటుంబాల్లో ఒక్కొక్కరికి రూ.15 లక్షల ఆర్థిక సహాయాన్ని మృతుల భార్యలకు అందజేశారు. ఈ సందర్భంగా శంకర్‌గౌడ్ మాట్లాడుతూ ప్రమాదం జరిగిన వెంటనే తమ కంపెనీ ప్రతినిధులు అందరూ స్పందించారని, చనిపోయిన వారికి ఉస్మానియా మార్చురీలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాలను ప్రత్యేక అంబులెన్స్‌లో వారి స్వగ్రామాలకు తరలివెళ్లేందుకు ఆర్థిక సహాయ సహకారాలు అందించినున్నట్ల తెలిపారు. భవిష్యత్తులో మృతుల కుటుంబాలకు అండగా ఉంటామన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు.


వ్యాపారంలో పెట్టుబడి పెడితే లాభం ఇస్తానని మోసం

యూసఫ్‌గూడ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): వ్యాపారంలో పెట్టుబడి పెడితే వచ్చే ఆదాయంలో వాటా ఇస్తానని చెప్పి రూ.5 లక్షలు తీసుకుని మోసం చేసిన వ్యక్తిపై మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. టోలిచౌకికి చెందిన నగల వ్యాపారి ఫాసిల్ మహ్మద్ కార్మికనగర్‌కు చెందిన షకీల్ అహ్మద్‌తో 2022లో ఒప్పందం కుదుర్చుకున్నాడు. రూ. 5 లక్షలు పెట్టుబడి పెడితే 11 నెలల్లో తిరిగి ఇస్తానని, నెలకు 30 వేల వరకు వడ్డీ ఇస్తానని ఫాసిల్ చెప్పాడు. ఒప్పందంలో భాగంగా మొదట రూ.50 వేలు జీపే చేయించుకుని, మిగతా రూ.4.5 లక్షలు నగదు తీసుకున్నాడు. ఒప్పందంలో భాగంగా మొదటి నెల 30 వేలు డబ్బు చెల్లించాడు. తరువాత డబ్బులు ఇవ్వటం మానేశాడు. కొంతకాలం తరువాత షకీల్ డబ్బు గురించి అడిగితే ఫాసిల్ అహ్మద్ దాటవేయడం మొదలు పెట్టాడు. ఆ తరువాత ఫోన్ స్విచ్చాప్ చేశాడు. షకీల్ అహ్మద్ ఫిర్యాదుతో మధురానగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పార్కు చేసిన స్కూటీ మాయం

యూసఫ్‌గూడ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఓ నర్సింగ్ హోమ్ వద్ద పార్కు చేసిన స్కూటీని దొంగలు ఎత్తుకెళ్లారు. చందానగర్‌కు చెందిన డ్రైవర్ జి.నర్సింహ బంధువును చూసేందుకని ఈ నెల 2న స్కూటీపై రాజా నర్సింగ్‌హోమ్ వద్దకు వచ్చాడు. స్కూటీని పార్కు చేసి లోపలికి వెళ్లాడు. మరుసటి రోజు ఉదయం వచ్చి చూడగా స్కూటీ కనిపించలేదు. మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్‌లో చేరిన తీగల భుం లింగగౌడ్


దీపాదాస్ మున్షీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న భుం లింగగౌడ్

హిమాయత్‌నగర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు తీగల భుం లింగగౌడ్ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఆదివారం గాంధీభవన్‌లో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ కలిశారు. ఆయనకు కాంగ్రెస్ కండువా కప్పిన దీపాదాస్ మున్షీ పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ, టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, నాయకులు ఆంజనేయులు గౌడ్, చెరుకు శ్రీనివాస్‌గౌడ్, హరికృష్ణ, ప్రభాకర్‌గౌడ్ పాల్గొన్నారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/tu3usXP లో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: hrpps://epaper.andhrajyothy.comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.


డాక్టరేట్ అందుకుంటున్న వేము వందనం

వేము వందనంకు గౌరవ డాక్టరేట్

రాజేంద్రనగర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ సర్కిల్ భవానీ కాలనీకి చెందిన కవి, రచయిత, దర్శకుడు వేము వందనంకు గౌరవ డాక్టరేట్ బహూకరించారు. పద్మభూషణ్ గుర్రం జాషువా జయంతి సందర్భంగా ఆదివారం రవీంద్ర భారతీలో గుర్రం జాషువా కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వేము వందనంకు గౌరవ డాక్టరేట్‌ను బహూకరించారు. సాహితీ, సాంస్కృతిక సేవా కళారంగాల్లో వేము వందనం 45 ఏళ్లుగా చేస్తున్న సేవలకుగాను డాక్టరేట్ అందజేసినట్టు గుర్రం జాషువా స్మారక కళాపరిషత్ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ పెద్దేటి యోహాన్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


సిరాజ్ (ఫైల్)

రాజేంద్రనగర్, మార్చి3(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతిచెందాడు. హైదర్‌గూడ శివానగర్ పెద్ద తాళ్లకుంట ఓ వ్యక్తి కిందపడి ఉన్నాడని స్థానికులు రాజేంద్రనగర్ పోలీసులకు సమాచారం ఇవ్వగా, వారు అక్కడికి వెళ్లి పరిశీలించగా అతడు మృతిచెంది ఉన్నాడు. అతని దగ్గర లభించిన ఆధారాల ప్రకారం... చింతల్‌మెట్‌కు చెందిన సయ్యద్ సిరాజ్(42) అని తెలిసింది. రాజేంద్రనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నీళ్ల కోసం స్విచ్ఛాన్ చేయబోయి.. విద్యుదాఘాతంతో బాలుడి మృతి


బాలుడి మృతదేహం

చాంద్రాయణగుట్ట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): లలితాబాగ్, భయ్యాలాల్‌నగర్‌లోని ఓ ఇంట్లో ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురై ఓ బాలుడు మృతిచెందాడు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన జయరామ్, మీనాక్షి దేవి దంపతులు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలతో కొన్నేళ్లుగా భయ్యాలాల్‌నగర్‌లో నివాసముంటున్నాడు. మీనాక్షిదేవి ఆదివారం నీళ్లు పట్టేందుకు మోటార్ ఆన్ చేయమని చిన్న కుమారుడు నక్స్ కుమార్(10)కు చెప్పింది. బాలుడు మోటార్ ఆన్ ఆన్ చేసే ప్రయత్నంలో వైర్ తగిలి విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. కుటుంబసభ్యులు ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడని వైద్యులు తెలిపారు. ఛత్రినాక పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకుని ఇద్దరి ఆత్మహత్య

అఫ్జల్‌గంజ్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు. ఆర్థిక సమస్యలతో ఒకరు, జీవితంపై విరక్తి మరొకరు ఉరేసుకుని మృతి చెందారు. జియగూడ ఇందిరానగర్‌కు చెందిన ఆర్‌సీకే నరేశ్(40) ఆటో డ్రైవర్. ఇతడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. నరేశ్ కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. దీనికి తోడు కుటుంబపోషణ కష్టంగా మారింది. జీవితంపై విరక్తి చెందిన నరేశ్ ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జియగూడ ఇందిరానగర్‌కు చెందిన నితేష్(25)కు సీనా తో మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. నెల క్రితం బాబు జన్మించాడు. నితేష్ కొంతకాలంగా పని చేయకుండా ఇంటి వద్ద ఉంటున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో ఇంట్లో టెర్రస్‌పై రేకుల షెడ్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి వెళ్లి రెండు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతుల బంధువుల ఫిర్యాదు మేరకు అఫ్జల్‌గంజ్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు

ఉదారతను చాటుకున్నారు


స్వచ్ఛంద సంస్థకు తీసుకెళ్తున్న యువకులు

రాజేంద్రనగర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కొంతకాలంగా రోడ్డు పక్కన బ్రిడ్జి క్రింద ఉంటూ కాలుకు గాయం కావడంతో పురుగులు పట్టి తీవ్రంగా ఇబ్బందులు పడుతున్న వ్యక్తిని గుర్తించిన యువకులు అతడిని ఆనాథాశ్రమంలో చేర్పించి ఉదారతను చాటుకున్నారు. వివరాలు ఈ విధంగా ఉన్నాయి. 40 నుంచి 45 ఏళ్లున్న ఓ గుర్తు తెలియని వ్యక్తి కొంత కాలంగా 44వ జాతీయ రహదారి ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రధాన ద్వారం ముందు బ్రిడ్జి క్రింద 20 రోజుల నుంచి అక్కడే ఉంటున్నాడు. అతడి కాలుకు గాయం కావడంతో పురుగులు పడ్డాయి. గమనించిన ప్రేమావతిపేట్‌కు చెందిన ఎడ్లకాడి సూర్యం, ఊపేందర్ అతని వద్దకు వెళ్లి వివరాలు సేకరించారు. 20 రోజులుగా ఇక్కడ ఎందుకు ఉంటున్నావు.. మీది ఎక్కడ అని అడిగారు. దానికి ఆ వ్యక్తి మా వాళ్లు వస్తారు.. నన్ను తీసుకుపోతారు అని సమాధానం ఇచ్చాడు. అయినా ఆయన కోసం ఎవరు రాకపోవడంతో ఈ విషయాన్ని ఆదివారం సామాజిక కార్యకర్త బుద్వేల్‌కు చెందిన రగడంపల్లి శ్రావణ్ దృష్టికి తీసుకెళ్లాగా, ఆయన స్పందించి స్ట్రీట్ లైట్ స్వచ్ఛంద సంస్థకు ఫోన్ చేశాడు. ఆ సంస్థకు చెందిన ప్రతినిధి శేఖర్ వచ్చి అంబులెన్స్‌లో ఆనాథాశ్రమానికి తీసుకువెళ్లారు. అతని బాగోగులు తామే చూసుకుంటామని, వైద్యం చేయిస్తామని శేఖర్ చెప్పినట్లు ఎడ్లకాడి సూర్యం తెలిపారు. కార్యక్రమంలో స్థానిక యువకులు పెండ్యాల సాయిమల్లిక్, మలాకి, గోల్కొండ ఊపేందర్ పాల్గొన్నారు.

హోటల్‌లో రౌడీ గ్యాంగ్ హల్‌చల్

బిర్యానీ అయిపోయిందని చెప్పిన సిబ్బంది, కస్టమర్లపై దాడి



పిస్తాహౌజ్ మండీ హోటల్‌లో అర్ధరాత్రి కస్టమర్లపై దాడి చేస్తున్న వ్యక్తులు

రాజేంద్రనగర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఉప్పర్‌పల్లిలోని ఓ హోటల్‌లో శనివారం అర్ధరాత్రి ఓ రౌడీగ్యాంగ్ హల్‌చల్ చేసింది. బిర్యానీ కావాలని కోరగా అయిపోయిందని చెప్పిన హోటల్ సిబ్బందిని, అక్కడ భోజనం చేస్తున్న కస్టమర్లను చితకబాదారు. దీంతో భయపడ్డ కస్టమర్లు హోటల్ బయటకు పరుగులు తీశారు. రౌడీగ్యాంగ్‌పై హోటల్ నిర్వాహకులతో పాటు, గాయపడ్డ ఓ యువకుడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి...రాజేంద్రనగర్ సర్కిల్ ఉప్పర్‌పల్లిలోని పిస్తా హౌజ్ మండీ హోటల్‌కు శనివారం అర్ధరాత్రి ఆరుగురు వ్యక్తులు వచ్చి బిర్యానీ కావాలని అడిగారు. అప్పటికే సమయం 12.30 గంటలు కావడంతో బిర్యానీ అయిపోయిందని హోటల్ సిబ్బంది చెప్పారు. అయినా వారు వినకుండా హోటల్ లోపలికి వెళ్లారు. వారిలో ఓ వ్యక్తి అక్కడ భోజనం చేస్తున్న వారిని వీడియో తీశాడు. వీరంతా తింటున్నారు కదా అని హోటల్ సిబ్బందిని ప్రశ్నించాడు. వారంతా ఎప్పుడో వచ్చారని సిబ్బంది చెప్పగా ఆగ్రహం చెందిన ఆ వ్యక్తి భోజనం చేస్తున్న వారిని వెళ్లిపొమ్మని బెదిరించారు. కొందరు లేచి వెళ్లిపోగా... ఉన్న వారిపై రౌడీగ్యాంగ్ దాడి చేసింది. హోటల్ బయట పార్కింగ్ వద్ద నిలుచున్న వారిని కూడా రౌడీగ్యాంగ్ వదలలేదు. హోటల్ మేనేజర్ మతీన్, రౌడీగ్యాంగ్ దాడిలో గాయపడ్డ దీపక్ తండ్రి ఫిర్యాదుతో అత్తాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. హోటల్‌లో దాడికి పాల్పడింది నౌ నెంబర్ ప్రాంతానికి చెందిన రౌడీషీటర్ గ్యాంగ్‌గా తెలిసింది. పోలీసులు సీసీ టీవీ ఫుటేజీలో వారి కదలికలు గుర్తించినట్టు సమాచారం.

నెలలు నిండకముందే జననాలు

- వాతావరణ మార్పుల దుష్ప్రభావం
- బాల్యం నుంచే జబ్బుల బారిన భావితరం
- పెరిగిపోతున్న శ్వాసకోశ సమస్యలు
- మందగిస్తున్న ఎదుగుదల.. తాజా అధ్యయనంలో వెల్లడి



హైదరాబాద్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఏటేటా భూతాపం పెరుగుతోంది. అధిక ఉష్ణోగ్రతలతో వాతావరణంలో ప్రతికూల మార్పులు వేగంగా చోటు చేసుకుంటున్నాయి. ఈ మార్పుల ప్రభావం పుట్టబోయే పిల్లలపై కూడా ఉంటుందని ఒక అధ్యయనంలో తాజాగా వెల్లడైంది. వాతావరణ మార్పుల వల్ల ముందుందు ప్రపంచవ్యాప్తంగా 60 శాతం జననాలు నెలలు నిండకముందే సంభవించే ప్రమాదం ఉందని ఆ స్టడీ హెచ్చరించింది. పుట్టిన పిల్లల్లో దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని తెలిపింది. యూనివర్సిటీ ఆఫ్ వెస్టర్న్ ఆస్ట్రేలియాకు చెందిన పరిశోధకుల బృందం ఈ అధ్యయనం జరిపింది. దీంట్లో భాగంగా ప్రపంచవ్యాప్తంగా జరిగిన 163 పరిశోధనలను విశ్లేషించారు. తద్వారా, చిన్నారుల ఆరోగ్యంపై వాతావరణ మార్పుల ప్రభావం ఏవిధంగా ఉంటుందనే దానిపై అందుబాటులో ఉన్న శాస్త్రీయ సమాచారాన్ని సమగ్రంగా అధ్యయనం చేశారు. ప్రత్యేకించి ఎటువంటి తీవ్ర వాతావరణ మార్పుల వల్ల భావితరాల ఆరోగ్యంపై ఏ రకమైన ప్రభావం ఉంటుందన్నది పరిశీలించారు. పరిశోధనకు నేతృత్వం వహించిన కోరే బ్రాడ్‌షా తాము గుర్తించిన అంశాలను వెల్లడిస్తూ.. 'పిల్లల ఆరోగ్యంపై వాతావరణ మార్పుల ప్రభావం గణనీయంగా ఉంటోందని గుర్తించాం. తీవ్రమైన చలివాతావరణం వల్ల చిన్నారుల్లో శ్వాససంబంధిత సమస్యలు ఎక్కువగా తలెత్తుతున్నాయి. కరువు, అధిక వర్షాలు వంటివి చిన్నారుల్లో ఎదుగుదలపై ప్రభావం చూపుతున్నాయి. అధిక ఉష్ణోగ్రతల వల్ల ఆస్ట్రేలియాలోని తూర్పు, ఉత్తర ప్రాంతాల్లో నెలలు నిండకముందే పుట్టే పిల్లల సంఖ్య పెరిగినట్లు గుర్తించాం. పశ్చిమ ఆస్ట్రేలియా, క్వీన్స్‌ల్యాండ్‌లలో పిల్లల్లో శ్వాససంబంధిత సమస్యలు అధికమవుతున్నాయి. అధిక ఉష్ణోగ్రతల వల్ల దక్షిణాఫ్రికాలో చిన్నారుల మరణాల సంఖ్య కూడా పెరుగుతోంది' అని తెలిపారు. పిల్లలపై వాతావరణ మార్పుల ప్రభావం పేద, సంపన్న దేశాలనే తేడాలనే లేకుండా అన్ని చోట్లా కనిపిస్తోందన్నారు. ఈ పరిస్థితులు ఇలాగే కొనసాగితే మరిన్ని దుష్ప్రభావాలు ఉంటాయని, అదొక సామాజిక, ఆర్థిక సమస్యలుగా మారుతుందని హెచ్చరించారు. భవిష్యత్ తరాలు బాల్యంలోనే జబ్బుల బారినపడటంతో ఆయా దేశాలపై ఆర్థికభారం పెరుగుతుందని, కుటుంబాలపై, ఆరోగ్య సేవలపై తీవ్ర ఒత్తిడి పెరుగుతుందని పేర్కొన్నారు. దీనిని ఎదుర్కొనేందుకు ప్రజారోగ్య అభివృద్ధి విధానాలపై దృష్టిసారించాలని, మానవ చర్యలతో సంభవిస్తున్న వాతావరణ మార్పులను తగ్గించే విధానాలను అమలు చేయాలని ఈ అధ్యయనం ప్రపంచ దేశాలకు సూచించింది. ఈ స్టడీ వివరాలను 'సైన్స్' జర్నల్ ప్రచురించింది.

ఏపీలో జగన్‌కు భారీ ఓటమే!

ఆంధ్రలో టీడీపీ గెలుపు ఖాయం.. ప్రశాంత్ కిశోర్ జోస్యం

- ప్రజలు అభివృద్ధి కోరతారు..
- యువత ఉద్యోగాలు అడుగుతారు
- ఇతరత్రా ప్రయోజనాలు ఆశించరు
- భవంతిలో బటన్ నొక్కితే ఓట్లు రాలవు
- జగన్‌కూ కేసీఆర్ గతే: ప్రశాంత్ కిశోర్



అమరావతి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో వచ్చే అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి భారీ పరాజయం ఎదుర్కోనున్నారని రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ (పీకే) జోస్యం చెప్పారు. ఆయన రాజకీయ భవిష్యత్ క్షీణ దశలో ఉందని, తెలంగాణలో కేసీఆర్‌కు పట్టిన గతే ఆయనకూ పట్టబోతోందన్నారు. తెలుగుదేశం పార్టీ విజయం ఖాయమని తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఓట్లు వేసేటప్పుడు ప్రజలు అభివృద్ధికే ప్రాధాన్యమిస్తారని.. ఉచిత పథకాలకు కాదని స్పష్టం చేశారు. 'యువత.. ముఖ్యంగా విద్యావంతులు ఉద్యోగాలు కోరుకుంటారు.. ఇతరత్రా ప్రయోజనాలు కాదు. ఉచితాలపైనే జగన్ పూర్తిగా ఆధారపడ్డారు. దీనివల్ల ఆయన గడ్డు పరిస్థితులను ఎదుర్కోబోతున్నారు. మామూలు ఓటమి కాదు.. భారీ పరాజయం తప్పదు' అని తేల్చిచెప్పారు. ప్రజలు సమర్థ నిర్వహణను చూస్తారని.. కేవలం వనరుల నిర్వహణను కాదని చెప్పారు. ప్రజాధనాన్ని ఖర్చు చేస్తూ వారి బాగోగులను చూస్తున్నామని భావిస్తే అది పొరపాటని. జగన్ ఇదే చేస్తున్నారని.. తెలంగాణలో కూడా కేసీఆర్ ఇదేచేసి దెబ్బతిన్నారని తెలిపారు. ఎన్నికల ఫలితాలను ధనబలం మాత్రమే నిర్ణయించగలదని అనుకుంటే.. ఏ ప్రభుత్వాన్నీ ఓడించలేరని స్పష్టం చేశారు. జగన్ భారీ పరాజయం చవిచూడనున్నారని.. ఎందుకంటే.. భవంతిలో కూర్చుని బటన్ నొక్కి నేరుగా డబ్బును జమచేసినంత మాత్రాన ఓట్లు రాలవని తేల్చిచెప్పారు. ధనమే కీలకమైతే ఏ ప్రభుత్వమూ ఓడిపోదని పునరుద్ఘాటించారు. దక్షిణాదిన రాజకీయాల్లో డబ్బు సంస్కృతి అలవడిందని.. కానీ తీసుకున్న డబ్బు ఆధారంగా ప్రజలు ఓట్లు వేయరని తెలిపారు. 'ఎందుకంటే ఉత్తర భారతంలో కంటే దక్షిణాదినే జనం ఎక్కువ ప్రభుత్వాలను మార్చేశారు' అని చెప్పారు. ఏతావాతా వచ్చే ఎన్నికల్లో ఏపీలో టీడీపీ విజయం తథ్యమని ఆయన అంచనా వేశారు. గత ఎన్నికల్లో ప్రశాంత్ కిశోర్ వైసీపీకి వ్యూహకర్తగా ఉండి ఆ పార్టీని విజయతీరాలకు చేర్చిన సంగతి తెలిసిందే. రెండేళ్ల కిందట ఇక ఎవరికీ రాజకీయ వ్యూహకర్తగా పనిచేయనని ప్రకటించి.. బిహార్ రాజకీయాల్లో మార్పు కోసం 'జన్‌సురాజ్' పేరిట పాదయాత్ర చేపట్టారు. అయితే ఆయన ఐ-ప్యాక్ టీం ఇప్పటికీ జగన్‌కు పనిచేస్తోంది. ఆ మధ్య పీకే టీడీపీ అధినేత చంద్రబాబుతో కూడా సమావేశమయ్యారు. ఆ పార్టీ తరఫున పనిచేయబోతున్నారని వార్తలు వచ్చినా ఉభయవర్గాలూ వాటిని తోసిపుచ్చాయి.

కదిలిన యంత్రాంగం

(మొదటి పేజీ తరువాయి)

తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ బృందం ఈ భూములను పరిశీలించి సర్వే నిర్వహించారు. డ్రోన్ సర్వే ద్వారా నిర్మాణాలు, భూముల సరిహద్దులు, ఎవరెవరు ఇక్కడ భూములు రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు? ఎంత భాగం ఇందులో భూదాన భూములున్నాయి? వంటి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ సర్వే నంబర్లపై విచారణ జరుపుతున్నామని, అన్ని అంశాలతో కూడిన సమగ్ర నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామని చెప్పారు. ఇదిలా ఉండగా.. ఈ భూముల్లో పాగా వేసిన మరికొంత మంది పెద్దల పేర్లు కూడా వెలుగులోకి వస్తున్నాయి. ధరణి వచ్చిన తరువాత పెద్దలంతా అధికార అండతో ఈ భూములను సొంతం చేసుకున్నట్లు వెల్లడవుతోంది. 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలతో.. భూదాన్ భూములను కొనుగోలు చేసిన వారంతా లోలోన ఆందోళన చెందుతున్నారు. మరోవైపు ప్రభుత్వం కూడా భూదాన భూముల వ్యవహారంలో సీరియస్‌గా ఉన్నట్లు తెలిసింది. దీనిపై లోతైన విచారణ జరపాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించినట్లు సమాచారం. ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర నివేదిక పరిశీలించిన అనంతరం ఉన్నతాధికారులు సోమవారం ఒక నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. వట్టినాగులపల్లిలో భూమికి సంబంధించి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఇచ్చిన వివరణకు, రికార్డుల్లో ఉన్న వివరాలకు పొంతన కుదరడం లేదు. తాను 2014లో భూమిని రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు పల్లా రాజేశ్వర్‌రెడ్డి చెబుతున్నా.. రెవెన్యూ రికార్డుల్లో 2021 వరకు ఎందుకు నమోదు కాలేదనే విషయానికి మాత్రం సమాధానం లేదు. రాజేశ్వర్‌రెడ్డితో పాటు అనేక మంది భూముల వివరాలు కూడా రెవెన్యూ రికార్డుల్లో ఎక్కడా నమోదు కాలేదు. ధరణి పోర్టల్ వచ్చిన తరువాతే వీరందరికీ పాస్‌బుక్‌లు జారీ అయ్యాయి. విచిత్రమేమిటంటే.. 2021 జూన్ 10వ తేదీన అప్పటి కలెక్టర్ ఈ 29.27 ఎకరాల భూదాన భూములను 22ఏ కింద నిషేధిత జాబితాలో పెట్టగా, అదే ఏడాది ఆగస్టు 24వ తేదీన పల్లా రాజేశ్వర్‌రెడ్డికి సర్వే నంబరు 188/1/2 పేరుతో పట్టాదారు పాస్‌బుక్ జారీ అయింది. ఆయనతోపాటు మిగతా వారికి పాస్‌బుక్ జారీ చేయడం వెనుక పెద్ద తతంగమే నడిపారు. ఏడీ సర్వే ల్యాండ్ రికార్డు స్కెచ్, భూదాన బోర్డు స్కెచ్ కూడా చూపించి ధరణి ద్వారా పాస్‌బుక్‌లు జారీ చేశారు. సాధారణంగా ఇలాంటి విషయాల్లో స్థానిక తహసీల్దార్, మండల సర్వే అధికారుల నివేదిక తీసుకుంటారు. కానీ, ఇక్కడ నేరుగా ఏడీ ల్యాండ్ రికార్డ్స్ ఇచ్చిన స్కెచ్, భూదాన బోర్డు ఇచ్చిన స్కెచ్ ఆధారంగా పాస్‌బుక్‌లు ఇచ్చినట్లు చెబుతున్నారు. అయితే అప్పటి వరకు అసలు సబ్‌డివిజన్, ఎంజాయ్‌మెంట్ సర్వే జరిగినట్లు ఆధారాలు కూడా లేకపోవడం వల్లే రెవెన్యూ అధికారులు పాస్‌బుక్‌లు నిలిపివేశారు. ఈ విషయాన్ని కలెక్టర్ 22ఏ జాబితాలో కూడా స్పష్టంగా పేర్కొన్నారు. పైగా.. వీరు చూపిస్తున్న భూదాన బోర్డు స్కెచ్‌లో ఎక్కడా సంతకం గానీ, తేదీ గానీ, కనీసం స్టాంప్ గానీ లేకపోవడం గమనార్హం. ధరణి ముసుగులో జరిగిన ఈ బాగోతాలు ఒకటి రెండు రోజుల్లో అధికారికంగానే బట్టబయలయ్యే అవకాశం ఉంది.

నేను కొన్నది భూదాన భూమి కాదు: పల్లా

వట్టినాగులపల్లి భూదాన భూముల వ్యవహారంలో తనపై వస్తున్న ఆరోపణలు నిజం కాదని, వాటిని ఖండిస్తున్నానని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తనకు అక్కడ ఉన్నది కేవలం 1.10 ఎకరాలు మాత్రమేనని, ఇది కూడా భూదాన భూమి కాదని చెప్పారు. తాను వట్టినాగులపల్లి సర్వే నంబరు 181/1/2లో భూమి కొనుగోలుకుకు ఒప్పందం కుదుర్చుకున్నానని, దీనిపై న్యాయసలహాలు కూడా తీసుకుని 2014లో రిజిస్ట్రేషన్ చేసుకున్నానని పేర్కొన్నారు. ఈ వివరాలను ఎన్నికల అఫిడవిట్‌లో కూడా పొందుపరిచానని తెలిపారు. ఈ భూమికి సంబంధించిన వివరాలన్నీ తన వద్ద ఉన్నాయని, ఏడీ సర్వే ల్యాండ్ రికార్డు స్కెచ్, భూదాన బోర్డు స్కెచ్ కూడా ఉన్నాయని చెప్పారు. వీటిని ఎవరైనా పరిశీలించుకోవచ్చన్నారు.

మత్తుమందు ఇచ్చి యువతిపై ఇద్దరి అత్యాచారం

- నగ్నచిత్రాలు ఉన్నాయంటూ వేధింపులు
- పోలీసులకు ఫిర్యాదుతో వెలుగులోకి ఘటన

బోరబండ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఓ యువతికి మత్తు మందు ఇచ్చి ఇద్దరు యువకులు అత్యాచారం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తమ వద్ద నగ్న చిత్రాలు ఉన్నాయంటూ.. చెప్పినట్లు వినకపోతే వాటిని బయటపెడతామంటూ ఆ ఇద్దరూ యువతిపై వేధింపులకు దిగారు. ఈక్రమంలోనే ఆమె పోలీసులను ఆశ్రయించింది. ఏడాది క్రితం జరిగిన ఈ ఘటనకు సంబంధించి హైదరాబాద్ బోరబండ పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఘటన ఎల్బీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరగడంతో కేసును అక్కడికే బదిలీ చేశారు. పోలీసుల వివరాల మేరకు.. ఎల్బీనగర్ పరిధిలో తల్లిదండ్రులతో కలిసి ఉంటూ డిగ్రీ చదివే యువతికి ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రణవ్ అనే యువకుడు పరిచయమయ్యాడు. దీంతో అతడు యువతి కళాశాల దగ్గర వెళ్లి కలిసేవాడు. గతేడాది యువతి కళాశాల వద్దకు వెళ్లిన ప్రణవ్ ఆమెను ఇంటి వద్ద డ్రాప్ చేస్తానని బైక్‌పై తీసుకెళ్లాడు. అయితే ఆమెను ఇంటికి తీసుకెళ్లకుండా హోటల్‌కు తీసుకెళ్లి.. తాగునీటిలో మత్తుమందు కలిపిచ్చి స్పృహ కోల్పోయేలా చేశాడు. ఆ తర్వాత మరో యువకుడితో కలిసి అత్యాచారానికి పాల్పడ్డాడు. దీంతో భయపడిన యువతి విషయాన్ని ఎవరికీ చెప్పలేదు. అయితే 2 నెలల క్రితం యువతి కుటుంబం బోరబండకు మకాం మార్చారు. ఈ నేపథ్యంలోనే యువతికి ఆ ఇద్దరు మళ్లీ ఫోన్ చేశారు. తాము చెప్పినట్లు వినాలని.. లేదంటే నగ్నచిత్రాలు బయటపెడతామంటూ వేధింపులకు దిగారు. దీంతో ఆ యువతి విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పి.. వారితో కలసి బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేసింది.









డాక్టర్స్ క్రికెట్ లీగ్ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న నారాయణపేట ఎమ్మెల్యే పరిణికారెడ్డి



విన్నర్స్ టీమ్

ఉత్సాహంగా ఉమెన్ డాక్టర్స్ క్రికెట్ లీగ్

- రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన 70 మంది డాక్టర్లు

హైదరాబాద్ సిటీ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఐ ఉమెన్స్ ఆర్గనైజేషన్ నిర్వహించిన ఉమెన్ డాక్టర్స్ క్రికెట్ లీగ్ రెండో సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 70 మంది మహిళా డాక్టర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. నగరశివారు వట్టినాగులపల్లిలోని ఓ క్రికెట్ గ్రౌండ్‌లో ఆదివారం జరిగిన ఈ లీగ్‌లో రుద్రమ రైడర్స్, చెన్నమ్మ ఛాలెంజర్స్, తారా టైటాన్స్, లక్ష్మీ లయన్స్ అంటూ నాలుగు టీమ్‌లు టైటిల్ కోసం పోటీపడ్డాయి. ఈ పోటీలను నారాయణపేట ఎమ్మెల్యే డాక్టర్ పరిణికారెడ్డి, పాలకుర్తి కాంగ్రెస్ నేత ఝాన్సీరెడ్డి ప్రారంభించారు. నాకౌట్ పద్ధతిలో జరిగిన ఈ పోటీలో చెన్నమ్మ ఛాలెంజర్స్ విజేతగా నిలవగా, తారా టైటాన్స్ రన్నర్స్‌గా నిలిచింది. ఈ లీగ్ విశేషాలను ఐ ఉమెన్స్ ఫౌండర్లు డాక్టర్ కీర్తన యాదవ్, డాక్టర్ వినోద వెల్లడించారు. క్రికెట్ అంటే ఆసక్తి కలిగిన డాక్టర్లకు ఓ ప్లాట్‌ఫామ్ కల్పించాలన్న లక్ష్యంతో ఉమెన్ డాక్టర్స్ క్రికెట్ లీగ్‌ను ప్రారంభించామని తెలిపారు.

చిన్నారి కిడ్నాప్ కథ సుఖాంతం



నస్రత్ బేగం(ఫైల్)

- గంటల్లోనే కేసును ఛేదించిన పోలీసులు
- క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగింత



చిన్నారి

సైదాబాద్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): చిన్నారి కిడ్నాప్ కథ సుఖాంతం అయింది. పోలీసులు కేసును గంటల వ్యవధిలోనే ఛేదించారు. చిన్నారిని క్షేమంగా తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. నాంపల్లి ఆగాపురా బోయిగూడ కమాన్ ప్రాంతానికి చెందిన వ్యాపారి ఫైజన్ అహ్మద్ సిద్దిఖీ భార్య అమయాఠ్ర సిద్దిఖీ తన ఎనిమిది నెలల కుమార్తెను తీసుకొని పనిమనిషితో కలిసి చంచల్‌గూడ నర్సింగ్‌హోంకు శనివారం రాత్రి 8 గంటల సమయంలో వెళ్లారు. అమయాఠ్ర సిద్దిఖీ ఆస్పత్రి లోపలికి వెళ్లింది. పనిమనిషి చిన్నారిని ఎత్తుకొని బయట ఉంది. కొద్దిసేపటి తర్వాత అమయాఠ్ర బయటికి వచ్చి చూడగా.. కుమార్తె, పనిమనిషి కనిపించలేదు. వారి ఆచూకీ లభించకపోవడంతో వెంటనే మాదన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు ఆస్పత్రికి చేరుకొని సీసీ ఫుటేజీల ఆధారంగా ఇమ్లీబన్ బస్టాండ్‌లో చిన్నారితో జహీరాబాద్ బస్సెక్కినట్లు గుర్తించారు. మాదన్నపేట పోలీసులు జహీరాబాద్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పనిమనిషి జహీరాబాద్‌లో బస్సు దిగగానే ఆమెను అదుపులోకి తీసుకున్నారు. ప్రత్యేక వాహనంలో చిన్నారిని తీసుకొచ్చి మాదన్నపేట పోలీస్‌స్టేషన్‌లో తల్లిదండ్రులకు అప్పగించారు. దీంతో కుటుంబ సభ్యులు ఊపిరిపీల్చుకున్నారు. నిందితురాలు కర్ణాటక రాష్ట్రం గుల్బర్గాకు చెందిన నస్రత్ బేగం అలియాస్ షేనాజ్(38)గా గుర్తించారు. చిన్నారిని విక్రయించేందుకు కిడ్నాప్ చేసినట్లు ఆమె అంగీకరించింది. పనిమనిషిగా రెండు రోజుల క్రితమే చేరి చిన్నారిని కిడ్నాప్ చేయడంపై పోలీసులు విచారిస్తున్నారు.

హైదరాబాద్‌పై కమలం గురి

(5వ పేజీ తరువాయి)

ముగ్గురు పిల్లలు. ప్రస్తుతం బంజారాహిల్స్‌లోని విరించి ఆస్పత్రి చైర్‌పర్సన్‌గా, లతా ఫౌండేషన్ నిర్వాహకురాలిగా వ్యవహరిస్తున్నారు.

1962లో జనసంఘ్ పోటీ

1962 ఎన్నికల్లో హైదరాబాద్ స్థానంలో జనసంఘ్ పోటీ చేసింది. ఆ తర్వాత జనసంఘ్ జనతాపార్టీలో విలీనమైంది. 1980లో బీజేపీ తరఫున ఆలె నరేంద్ర రంగంలోకి దిగారు. ఆయనకు 1,35,304 ఓట్లు వచ్చాయి. 1984, 1989లో బీజేపీ తెలుగుదేశం పార్టీకి మద్దతిచ్చింది. 1991లో జరిగిన ఎన్నికల్లో మళ్లీ పోటీ చేసిన బీజేపీ 42.2 శాతం, 1996లో జరిగిన ఎన్నికల్లో 26.68 శాతం ఓట్లు సాధించింది.

1991 నుంచి బరిలో బాల్‌రెడ్డి

1991లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ తరఫున దివంగత నాయకుడు బద్దం బాల్‌రెడ్డి పోటీ చేసి 4,15,299 ఓట్లు సాధించారు. 1996లో జరిగిన ఎన్నికల్లో ఆయనకు 2,47,772 (26.13) ఓట్లు, 1998లో 4,14,173 (38.07) ఓట్లు వచ్చాయి. 1999లో జరిగిన ఎన్నికల్లో మరోసారి బద్దం బాల్‌రెడ్డి పోటీ చేయగా 3,87,344 ఓట్లు వచ్చాయి. 2004 ఎన్నికల్లో పోటీచేసిన సుబాష్‌చందర్‌జీ 2 లక్షల 78 వేల ఓట్లు సాధించారు. 2009లో సతీష్ అగర్వాల్ పోటీ చేసినా పెద్దగా ఓట్లు రాలేదు. 2009లో స్థానికంగా పట్టున్న భగవంతరావును బరిలోకి దింపగా గట్టి పోటీ ఇచ్చి దాదాపు 3.11,414 ఓట్లు సాధించారు. పాతబస్తీలో పార్టీకి పట్టుందని నిరూపించారు.

1984 నుంచి ఓవైసీల అడ్డా

హైదరాబాద్ స్థానం ఎంఐఎం అడ్డాగా పేరు పొందింది. ఇక్కడి నుంచి ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ 2004 నుంచి వరుసగా విజయం సాధిస్తున్నారు. అంతకుముందు ఆయన తండ్రి సలావుద్దీన్ ఓవైసీ ఎంపీగా ఉన్నారు. మొత్తంగా 1984 నుంచి 2024 వరకు నాలుగు దశాబ్దాల పాటు ఎంఐఎం పార్టీదే ఆధిపత్యం. ఈ సారి ఎలాగైనా ఎంఐఎంకు చెక్ పెట్టి విజయం సాధించాలని భావిస్తున్న బీజేపీ అధిష్ఠానం అనూహ్యంగా మాధవీలతకు ఛాన్స్ ఇచ్చింది.

అసెంబ్లీ ఎన్నికల్లో ఎంఐఎంకు గట్టి పోటీ ఇచ్చిన ఎంబీటీ

పాతబస్తీలో తమకు ఎదురే లేదని భావిస్తున్న ఎంఐఎంకు ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో యాకుత్‌పురాలో ఎంబీటీ అభ్యర్థి అంజదుల్లా ఖాన్ గట్టి పోటీ ఇచ్చారు. నాంపల్లిలో సైతం కాంగ్రెస్ అభ్యర్థి ఫిరోజ్ ఖాన్ గట్టిగా నిలబడ్డారు. హైదరాబాద్ స్థానంలో అనేక సార్లు లోక్‌సభకు పోటీ చేసిన బీజేపీ అభ్యర్థి బద్దం బాల్ రెడ్డి ఎంఐఎంకు గట్టిగా పోటీ ఇచ్చారు. నాటి నుంచి ఈ స్థానంలో ఎంఐఎం పట్టు నిలుపుకుంటూ వచ్చినా 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్, 2014 నుంచి నేటి వరకు బీఆర్ఎస్ సాయంతో గెలుస్తూ వస్తోంది.

బీజేపీ జెండా ఎగరేస్తా : మాధవీలత

సిట్టింగ్ ఎంపీగా ఉన్న అసదుద్దీన్ ఒవైసీని ఓడించి తీరుతా. హైదరాబాద్ ఎంపీ స్థానంలో బీజేపీ జెండా ఎగురవేస్తాం. ఇక్కడ విజయం సాధించి అయోధ్య బాలరాముడి పాదాలకు, ప్రధాని నరేంద్ర మోదీకి అంకితం ఇస్తా.

సర్జరీకి సాయం చేయరూ..



గౌసియా

హైదరాబాద్ సిటీ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఇరవై రెండేళ్ల గౌసియా తలలో కణితి సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. మెదడు వద్ద ఏర్పడిన కణితి కారణంగా ఆరోగ్య పరిస్థితి ఇబ్బందికరంగా మారింది. పదకొండేళ్ల క్రితం బంజారాహిల్స్‌లోని కేర్ ఆస్పత్రిలో వైద్యులు ఆమెకు ఆపరేషన్ చేసి మెదడులో కణితిని తొలగించి సరిచేశారు. ఆమె ఇటీవల కిందపడడంతో ఇంతకు ముందు సర్జరీ చేసిన మెదడు వద్ద భాగం దెబ్బతింది. దీంతో సర్జరీ సమయంలో తలలో ఏర్పాటు చేసిన ప్లేట్లు కదలడంతో తలపై కణితి మాదిరిగా ఏర్పడింది. దీంతో ఆమెను ఆస్పత్రికి తీసుకురాగా పరీక్షించిన వైద్యులు ఆమెకు మళ్లీ సర్జరీ చేసి తలలో ఏర్పాటు చేసిన ప్లేట్లను సరిచేయాల్సి ఉంటుందని చెప్పారు. ఇందుకుగాను దాదాపు నాలుగు లక్షల రూపాయలు అవుతాయని వైద్యులు చెప్పినట్లు ఆమె తండ్రి ఎస్. చాంద్‌బాష పేర్కొన్నారు. ఆర్థిక స్థోమత కారణంగా తన బిడ్డకు ఆపరేషన్ చేయించే పరిస్థితి లేదని, దాతలు ముందుకు వచ్చి సహకరించాలని ఆయన కోరారు. దాతలు ఎస్.చాంద్‌బాష అకౌంట్ నంబర్ 6229732296, ఐఎఫ్ఎస్‌సీ నంబర్ ఎస్‌బీఐఎన్0022041లో జమ చేయాల్సిందిగా ఆయన కోరారు. వివరాలకు 7674055786కు ఫోన్ చేయాలని విజ్ఞప్తి చేశారు.

సైబర్ నేరగాళ్లకు బ్యాంకు ఖాతాలిచ్చిన వ్యక్తి అరెస్ట్

హైదరాబాద్ సిటీ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): విదేశాల్లో ఉండి సైబర్ నేరాలకు పాల్పడుతున్న వారికి బ్యాంకు ఖాతాలు సమకూర్చి సహకరిస్తున్న వ్యక్తిని హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. కేరళకు చెందిన ఎన్‌హెచ్ సాబి(46), స్నేహితుడు నిషాంత్ దుబాయ్, హాంకాంగ్, చైనాలో ఉండే సైబర్ నేరగాళ్లతో జట్టు కట్టారు. వారికి బ్యాంకు ఖాతాలు సమకూర్చడంతోపాటు ఖాతాలో జమ అయిన డబ్బును, క్రిప్టో కరెన్సీలోకి మార్చి వారు సూచించిన విదేశీ ఖాతాలకు పంపుతున్నారు. సైబర్ నేరగాళ్లు ట్రేడింగ్‌లో పెట్టుబడి పెడితే ఎక్కువ లాభాలు గడించవచ్చని చెప్పి, ఆసక్తి చూపిన వారి వద్ద నుంచి డబ్బులు కాజేస్తున్నారు. ఇదేవిధంగా చిక్కడపల్లికి చెందిన ఓ వ్యక్తి నుంచి ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో రూ. 18.60 లక్షలు మోసం చేశారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులు, బ్యాంకు ఖాతాల ద్వారా నిందితుడిని గుర్తించి అరెస్ట్ చేశారు. నిందితుడు కొంతకాలంగా సైబర్ నేరగాళ్లకు కమీషన్ మీద 9 బ్యాంకు ఖాతాలు ఇచ్చి సహకరిస్తున్నాడని గుర్తించారు.

అచ్చెరువు పోయేలా..!

(5వ పేజీ తరువాయి)

పూర్తవలేదు. చాలా ప్రాంతాల్లోని చెరువుల ఎఫ్‌టీఎల్‌లో ఇప్పటికే కబ్జాలు, నిర్మాణాలు జరుగగా.. ప్రస్తుతం ఉన్న ఏరియాల వరకే మార్కింగ్ చేసి వదిలేశారు. ఎన్ని చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ నిర్ధారణ జరిగింది..? ప్రస్తుతం ఎన్ని ఎకరాల మేర చెరువులున్నాయి..? వాటి వాస్తవ విస్తీర్ణమెంత..? అన్నది అధికారికంగా ప్రకటించిన దాఖలాలు లేవు. కొన్ని చెరువుల మ్యాపులు ఆన్‌లైన్‌లో, రెవెన్యూ రికార్డుల్లో మాయమవుతున్నాయని ఇటీవల ఫిర్యాదులు వస్తున్నట్టు ఉన్నతాధికారులు చెబుతున్నారు. నగరంలోని చాలా చెరువుల్లో రాత్రిపూట నిర్మాణ రంగ వ్యర్థాలు అక్రమంగా డంప్ చేస్తున్నారు. కొన్నాళ్ల అనంతరం వాటిని చదును చేసి తాత్కాలిక, శాశ్వత నిర్మాణాలు చేపడుతున్నారు. లేక్‌ప్రొటెక్షన్ సిబ్బందిని నియమించామని జీహెచ్ఎంసీ చెబుతోన్నా.. ఆక్రమణలు ఆగకపోవడం గమనార్హం. చెరువుల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు, నిరంతర నిఘా కాగితాలకే పరిమితమైంది.



లేఅవుట్ బ్రోచర్‌ను విడుదల చేస్తున్న ఎన్ఎస్ఆర్ గ్రూప్స్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాసరావు, తదితరులు

ఎన్ఎస్ఆర్ గ్రూప్స్ తిరుమల హిల్స్-2 బ్రోచర్ విడుదల

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ శివారు కవాడిపల్లిలో ఎన్ఎస్ఆర్ గ్రూప్స్ తిరుమల హిల్స్-2 గేటెట్ కమ్యూనిటీ పేరుతో ఏర్పాటు చేసిన లేఅవుట్ బ్రోచర్‌ను ఆదివారం విడుదల చేశారు. ఆ గ్రూప్స్ మేనేజింగ్ డైరెక్టర్ నల్లమల్లి శ్రీనివాసరావు పలువురు రియల్ ఎస్టేట్ వ్యాపారులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ గుర్తింపు పొందిన రామోజీ ఫిల్మ్‌సిటీకి కేవలం రెండు కిలోమీటర్ల దూరంలోనే ఈ లేఅవుట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పొల్యూషన్ రహిత ప్రాంతం, ఆహ్లాదకరమైన వాతావరణంలో ఈ లేఅవుట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బుకింగ్ ప్రారంభించినట్లు చెప్పారు.

అందం అంటే ఆత్మవిశ్వాసం

మోడల్ కావాలి, ర్యాంప్ మీద నడవాలి... ఇది థ్రేసియా స్టెల్లా జీవితాశయం. కానీ నల్లగా, సన్నగా ఉండే ఆమెకు వెక్కిరింతలు, ఈసడింపులు, బాడీ షేమింగ్... నిత్యానుభవాలు. "అందం అంటే ఆత్మవిశ్వాసం. ఇదీ నా నమ్మకం" అంటున్న థెర్సియా అవరోధాలెన్నిటినో అధిగమించి... ఇటీవలి 'గోల్డెన్ ఫేస్ ఆఫ్ సౌతిండియా' పోటీలో రన్నరప్‌గా నిలిచారు. తన లక్ష్యం దిశగా బలమైన అడుగు వేసిన థ్రేసియా కథ ఆమె మాటల్లోనే...



"అవి 'గోల్డెన్ ఫేస్ ఆఫ్ సౌతిండియా - 2024 ఫైనల్స్. నాతో సహా 29 మంది పోటీ పడుతున్నాం. మొదటి రౌండ్‌లో... సంప్రదాయ దుస్తులతో స్వీయ పరిచయం చేసుకోవాలి. తరువాత ప్రశ్నోత్తరాల రౌండ్ ఉంటుంది. నన్ను ఆన్‌లైన్ డేటింగ్ యాప్స్ గురించి ప్రశ్న అడిగారు. నేను సమాధానం ఇచ్చాక... కాసేపటి వరకూ చప్పట్లు ఆగలేదు. స్టేజ్ దిగి వస్తున్నాను. న్యాయనిర్ణేతలుగా ఉన్న అమీ జాక్సన్, శ్రియా శరణ్ పక్క నుంచి నేను వెళ్తుండగా... "షీ ఈజ్ అమేజింగ్" అని వారు అనడం వినిపించింది. నా ఒళ్ళు జలదరించింది. 'ఈ పోటీలో గెలుస్తానో లేదో నాకు అనవసరం. ఈ సెలబ్రిటీలకు నేను నచ్చాను. ఇది చాలు' అనుకున్నాను. కొంతసేపటికి విజేతలను ప్రకటిస్తూ... నేను రన్నరప్ అని చెప్పినప్పుడు... కన్నీరు ఆగలేదు. అంత భావోద్వేగాన్ని నా జీవితంలో ఎన్నడూ అనుభవించలేదు. నా మొత్తం జీవిత ప్రయాణం ఒక్కసారిగా ఆ క్షణంలో కళ్ళ ముందు మెదిలింది.

చదువు మానేద్దామనుకున్నాను...

నేను పుట్టి పెరిగింది కేరళ రాష్ట్రం తిరువనంతపురం జిల్లాలోని పుల్లువిలా. మాది ఆర్థికంగానూ, సామాజికంగానూ వెనుకబడిన మత్స్యకార కుటుంబం. నాకు ఊహ తెలిసినప్పటి నుంచీ ఈసడింపులు, వెక్కిరింతలు ఎదురవని రోజు లేదు. కారణం... నేను బాగా నల్లగా, సన్నగా ఉండడం. తరగతి గదిలో, వీధిలో ఎవరూ నా పేరు పెట్టి పిలిచేవారు కాదు. నాతో కలిసేవాళ్ళు కాదు. హైస్కూల్లో, కాలేజీలో చదువుతున్నప్పుడు తీవ్రమైన బాడీషేమింగ్‌కు గురయ్యాను. అందరూ నన్ను వెలివేసినట్టు చూసేవారు. నేను ఏడ్చేదాన్ని. ఇంటికి వచ్చి అమ్మతో చెప్పేదాన్ని. చదువు మానేద్దామని ఎన్నో సార్లు అనుకున్నాను. "నువ్వు నీ గురించి, నీ జీవితం గురించి ఆలోచించు. ఎవరో ఏదో అన్నారని... ఎప్పుడూ అదే ఆలోచిస్తూ ఉంటే... కుంగిపోవడం తప్ప ప్రయోజనం ఉండదు" అని మా అమ్మ నచ్చజెప్పేది. ప్రతి ఒక్కరూ వెలి వేస్తున్న చోట నన్ను నేను ఎలా నిరూపించుకోవాలి? కష్టపడి చదివేదాన్ని. స్కూల్లో, కాలేజీలో ఫస్ట్ ర్యాంకర్ని. మరోవైపు సాంస్కృతిక పోటీల్లో, ఆటల పోటీల్లో ప్రతిసారీ నాకు ప్రైజ్ రావాల్సిందే. అందరూ నాలో చూస్తున్న 'రంగు' అనే (వారి దృష్టిలో) లోపాన్ని నా ప్రతిభతో అధిగమించడానికి ప్రయత్నించేదాన్ని.



అయితే నాకూ, మా అమ్మకూ మాత్రమే తెలిసిన సంగతి ఒకటుంది. నేను బాల్యం నుంచి కలలుగన్న ప్రొఫెషన్ మోడలింగ్. టీవీలో ఫ్యాషన్ షోలు చూస్తూ దాని మీద ఆసక్తి పెంచుకున్నాను. ర్యాంప్ మీద నడిచే మోడల్స్‌ను చూసి... వారిని అనుకరించడానికి ప్రయత్నించేదాన్ని. మన చిన్ననాటి అభిరుచులు పెరిగి పెద్దయ్యాక మారిపోతూ ఉంటాయి. కానీ నా విషయంలో అలా కాదు. మోడలింగ్ మీద నా ఇష్టం నానాటికీ బలపడుతూ వచ్చింది. అయితే మా ఇంట్లో నేను మోడల్ కావడం ఏమాత్రం ఇష్టం లేదు. మోడలింగ్ అంటే వాళ్ళ దృష్టిలో పొట్టిపొట్టి దుస్తులు వేసుకోవడం. ఆ భావన తప్పని ఎన్నిసార్లు వివరించినా వాళ్ళ ధోరణిలో మార్పు రాలేదు. అలాగే ఈ సమాజంలో తెల్లటి రంగు లేదా డబ్బు ఉన్నవాళ్ళకే మర్యాద అనేది నా అనుభవం. కాబట్టి నా దృష్టంతా చదువుమీదే కేంద్రీకరించాను. ఇంజనీరింగ్ పూర్తి చేశాను. ఒక మెడికల్ కంపెనీలో చేరాను. కానీ నా ఆలోచనలన్నీ మోడలింగ్‌పైనే. చిన్న చిన్న మోడల్ ఏజెన్సీలను సంప్రతించేదాన్ని. ఫొటోషూట్స్ కోసం ప్రయత్నించేదాన్ని. ఉద్యోగం చేసే చోట... నా రంగు వల్ల చేదు అనుభవాలు ఎదురుకాలేదని చెప్పను కానీ... చాలా తక్కువ. ఆర్థిక స్థాయి, రంగు లాంటి వాటికన్నా సామర్థ్యానికి విలువ ఇచ్చేవారే నాకు ఎక్కువ తటస్థపడ్డారు. వారిలో చాలామంది స్నేహితులయ్యారు. మోడలింగ్ కోసం నేను చేస్తున్న ప్రయత్నాలు తెలిసి... వివిధ కేటగిరీల్లో జరిగే పోటీలకు హాజరయ్యేలా ప్రోత్సహించారు. నాకు చిన్నప్పటి నుంచీ స్టేజ్ ఫియర్ లేదు. రంగువల్ల నాకు కొత్తగా ఎదురయ్యే అవమానాలేవీ లేవు. కాబట్టి చిన్న చిన్న పోటీల్లో పాల్గొన్నాను. దీనికోసం నేను ఎక్కడా శిక్షణ పొందలేదు, ఎవరి సలహాలూ తీసుకోలేదు. నా ఆత్మవిశ్వాసంతోనే ప్రతి చోటా నిలబడ్డాను. సొంతంగా ఫొటోలు తీసుకొని, వీడియోలు చేసి సామాజిక మాధ్యమాల్లో ఉంచేదాన్ని. వాటివల్ల అనేక సర్కిల్స్ నన్ను గుర్తించడం ప్రారంభించాయి.

స్నేహితులే అండగా నిలిచారు..

ఈ క్రమంలోనే 'గోల్డెన్ ఫేస్ ఆఫ్ సౌత్ ఇండియా' పోటీకి ఆడిషన్ జరుగుతుందని ఇన్‌స్టాగ్రామ్‌లో చూశాను. అప్పటివరకూ నేను జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలకే హాజరయ్యాను. ఇది దక్షిణ భారతదేశ స్థాయిది కాబట్టి ఆసక్తిగా అనిపించి... అప్లై చేశాను. కొచ్చీలో ఆడిషన్స్‌కు వెళ్ళి ఎంపికయ్యాను. కానీ పోటీలో పాల్గొనాలంటే రిజిస్ట్రేషన్ ఫీజుగా ముప్ఫైవేలు కట్టాలన్నారు. మాది పెద్ద కుటుంబం. ఇంటికి నా జీతమే ఆధారం. ఒకేసారి ముప్ఫై వేలు ఇచ్చే స్థోమత నాకు లేదు. ఆ సంగతే నిర్వాహకులకు చెప్పాను. "వారం రోజులు టైముంది. ఆలోచించుకోండి" అన్నారు. ఇక ఆ పోటీ సంగతి మరచిపోదామని నిర్ణయించుకున్నాను. ఆఫీసులో నా కొలీగ్ అశ్విని నా ఆడిషన్ గురించి అడిగింది. మహారాష్ట్రకు చెందిన ఆమె నాకు మంచి స్నేహితురాలు కూడా కావడంతో... వివరాలు చెప్పాను. "ఆ డబ్బు నేనిస్తాను. లెక్కలు తరువాత చూసుకుందాం. వద్దంటే ఊరుకోను" అంటూ... నాతో రిజిస్టర్ చేయించింది. ఆ తరువాత పోటీకి అవసరమైన దుస్తుల కోసం కాలేజీ ఫ్రెండ్ ఒకరు సాయం చేశారు. నేను బస చేయడానికి, వీడియోలు తీసే సామర్థ్యం ఉన్న ఫోన్ కొనుక్కోడానికి... ఇలా ప్రతిదానికీ నా స్నేహితుల ప్రోత్సాహం, సహకారం ఉన్నాయి. నా గెలుపులో వారికీ భాగం ఉంది.

చెన్నైలో పోటీ జరిగే చోటుకు చేరుకున్న తరువాత... వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన అమ్మాయిలను చూడగానే... 'ఈ పోటీలో నేను గెలవగలనా?' అనే సందేహం వచ్చింది. కానీ వెంటనే నా సంకోచాలన్నీ పక్కకు నెట్టేశాను. పోటీలో ధైర్యంగా పాల్గొన్నాను. ఎర్నాకుళానికి చెందిన అమ్మాయి విన్నర్ అయితే... నేను ఫస్ట్ రన్నరప్ అగా... అంటే రెండో స్థానంలో నిలిచాను. సెలబ్రిటీల ప్రశంసలు అంతకుమించిన ఆనందాన్ని ఇచ్చాయి. ఇప్పుడు 'ఫెమీనా' లాంటి ప్రతిష్ఠాత్మక సంస్థలు నిర్వహించే అందాల పోటీల్లో పాల్గొనడానికి సిద్ధమవుతున్నాను. తెల్లటి మేని రంగే అందం అనేది సమాజంలో ఎక్కువశాతం మంది అభిప్రాయం. అయితే క్రమంగా మార్పు వస్తోందని గట్టిగా చెప్పగలను. నా లక్ష్య సాధన దిశలో ఈ విజయం తొలి అడుగు. నా అనుభవంతో నేను చెప్పేది ఒక్కటే... మీకు కల ఉంటే, దాన్ని నెరవేర్చుకోవడానికి కష్టపడండి. సంకల్పం ఉంటే... ఎలాంటి సంక్షోభం మిమ్మల్ని ఏమీ చెయ్యలేదు."



తెలుగులో తొలి బంజారా పీహెచ్‌డీ నాదే

గిరిజన తండాలో పుట్టిపెరిగిన సూర్యా ధనంజయ్ ఉస్మానియా విశ్వవిద్యాలయం సీనియర్ ప్రొఫెసర్‌గా ఎదిగిన తీరు మహిళా లోకానికి స్ఫూర్తి పాఠం. పెళ్లితో ఆగిన చదువును తన భర్త ధనంజయ్ ప్రోత్సాహంతో పూర్తిచేసి స్వయంకృషి, పట్టుదలకు ప్రతిరూపంగా నిలిచారు. ఆమె పర్యవేక్షణలో ఇరవైకుపైగా పీహెచ్‌డీలు వెలువడటం బోధనా రంగంలో అరుదైన విషయం. "బంజారా భాషా సాహిత్యాల అభివృద్ధే నా లక్ష్యం" అంటున్న ప్రొఫెసర్ సూర్య విద్యార్థి, ఉద్యోగ జీవిత ప్రస్థానంలోని కొన్ని విశేషాలను 'నవ్య'తో చెబుతున్నారిలా.!

"ప్రతిష్ఠాత్మక ఉస్మానియా విశ్వవిద్యాలయంలో మొట్టమొదటి బంజారా మహిళా ప్రొఫెసర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తుండటం ఒకెత్తు అయితే, నా పర్యవేక్షణలో ఇరవైకి పైగా పీహెచ్‌డీలు, మూడు పోస్టు డాక్టోరల్ డిగ్రీలు వెలువడటం మరొక ఎత్తు. ఒక గిరిజన తండా నుంచి వచ్చిన నాకు సగటు విద్యార్థి ఎదుర్కొనే కష్టాలన్నీ తెలుసు కనుక నా విద్యార్థులతో నేను మాత్రం ఆధిపత్య ధోరణితో వ్యవహరించకూడదని ఈ వృత్తిలోకి అడుగుపెట్టిన తొలి రోజే నిశ్చయించుకొన్నాను. పిల్లల అభిరుచి మేరకే పరిశోధనాంశాలను ఎంపిక చేసుకొనే అవకాశమిచ్చాను. నా అభిప్రాయాలను ఎన్నడూ వాళ్ల మీద రుద్దలేదు. కనుకనే ఎరుకల, చెంచు, మాదిగ, మైనార్టీ... ఇలా విస్మృతికి లోనైన అణగారిన వర్గాల సాహిత్యం మీద పీహెచ్‌డీ పరిశోధనలు వెలుగుచూశాయి. తెలంగాణ పాట, ఈగ బుచ్చిదాసు సంకీర్తనలు తదితర వైవిధ్యభరితమైన అంశాలమీద నా విద్యార్థులు అధ్యయనం చేశారని చెప్పడానికి గర్విస్తున్నాను. 'పంచమహాకావ్యాల్లో స్త్రీ పాత్రలు' లాంటి ప్రాచీన సాహిత్యాంశాలమీదా నా పర్యవేక్షణలో పరిశోధనలు వచ్చాయి. బంజారా సాహిత్యం మీద తెలుగులో పీహెచ్‌డీ పరిశోధన చేసిన మొట్టమొదటి మహిళను నేనే. తద్వారా మా సంస్కృతి, జీవన విధానాన్ని బయట ప్రపంచానికి పరిచయం చేయగలిగానన్న తృప్తి నాకుంది.

తెలుగు సాహిత్యంతో పరిచయం...

మాది నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలంలోని భల్లూ నాయక్ తండా. పదిమంది పిల్లల్లో నేను తొమ్మిదో సంతానం. వ్యవసాయం జీవనాధారమైన మాకు పేదరికం కూడా వెన్నంటే ఉండేది. నేను పుట్టినప్పుడు... 'మళ్లీ ఆడపిల్లే... వడ్ల గింజో, సారాచుక్కో పోస్తే సరి' అని బంధువులు సలహా ఇచ్చారట. దానికి ఒప్పుకోని మా అమ్మానాన్న నన్ను ఉన్నంతలో అపురూపంగానే పెంచారు. మా నాన్న భల్లూ నాయక్‌కు చదువంటే ఇష్టం. ఆయన చొరవతోనే మా తండాలో ఒక పూరిపాకలో ఏకోపాధ్యాయ పాఠశాల ప్రారంభమైంది. నాకు నాలుగేళ్ల వయసప్పుడు మా నాన్న అనారోగ్యంతో కన్నుమూశారు. ఆ తర్వాత కొద్ది రోజులకు ఆ బడి కూడా మూతపడింది. దాంతో ఏడేళ్లు కూడా లేని నేను రోజూ ఏడు కిలోమీటర్లు కాలినడకన చదువుకోడానికి మరో తండాకు వెళ్లేదాన్ని. ఆరో తరగతికి మా అక్క కూతురితో కలిసి మిర్యాలగూడ బాలికల పాఠశాలలో చేరాను. అప్పుడు స్థానిక ఎస్టీ హాస్టల్‌లో ఉండేవాళ్లం. మా పాఠశాలలో వెయ్యిమంది విద్యార్థినులుంటే అందులో మేమిద్దరమే బంజారా అమ్మాయిలం. మా మాతృభాష బంజారా అయినా, తెలుగు మాధ్యమంలో నా చదవు సజావుగా సాగడానికి ఉపాధ్యాయులు బాగా ప్రోత్సాహించారు. మా వసతిగృహంలో రోజూ రాత్రిపూట అమ్మాయిలమంతా ఒకచోట చేరి కథలు, నవలలు కలిసి చదివేవాళ్లం. అలా నాకు తెలుగు సాహిత్యంతో సాన్నిహిత్యం ఏర్పడింది. ఆ అభిరుచే నన్ను ఇవాళ ఈ స్థానంలో నిలిపిందేమో.

> **నా భర్తతోనే నాకు అస్తిత్వ స్పృహ...**
>
> నా అసలు పేరు సూర్య. పెళ్లి అయ్యాక పేరు చివర ధనంజయ్ చేరింది. 'పేరు చివర మొగుడి పేరు తగిలించుకొన్నావు. నీకంటూ సొంత అస్తిత్వం లేదా' అని కొందరు హేళనగా మాట్లాడుతుంటారు. బలమైన కుటుంబ నేపథ్యముండి, ఉన్నత చదువులు చదివి కూడా భార్యను వంటింటికే పరిమితం చేస్తున్న మగవాళ్లు మనచుట్టూ బోలెడుమంది కనిపిస్తారు. అలాంటిది తండా నుంచి వచ్చిన నా భర్త ముప్ఫై ఏళ్ల కిందట నేను చదువుకోడానికి, తద్వారా స్వావలంబన సాధించడానికి అడుగడుగునా అండగా నిలిచి నన్ను ముందుకు నడిపించారు. నా భర్త ధనంజయ్‌తోనే నాకు అస్తిత్వ స్పృహ కలిగిందని నమ్ముతాను. ఆయన ప్రోత్సాహం లేనిదే భల్లూ నాయక్, ధాళీబాయిల బిడ్డ సూర్య... ప్రొఫెసర్ సూర్యగా ఎదిగేది కాదు. మాకు ఇద్దరబ్బాయిలు, ఒక అమ్మాయి. చిన్న అబ్బాయి నెదర్లాండ్‌లో ఎల్ఎల్ఎమ్ చేస్తున్నాడు. పెద్దబ్బాయి సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడ్డాడు. అమ్మాయి మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగం చేస్తూ, ఓయూ ఇంజనీరింగ్ కళాశాలలో రోబొటిక్స్ మీద పీహెచ్‌డీ చేస్తోంది. నా చదువును ప్రోత్సహిస్తూ, ధనంజయ్ కూడా జియాలజీ, న్యాయశాస్త్రాలలో పీహెచ్‌డీ చేశారు. కమర్షియల్ ట్యాక్స్ డిపార్టుమెంట్‌లో అసిస్టెంట్ కమిషనర్‌గా పదవీ విరమణ చేశారు. ప్రస్తుతం తెలంగాణ హైకోర్టు లాయర్‌గా ప్రాక్టీసు చేస్తున్నారు.

డిస్టెన్స్‌లో డిగ్రీ...

మా తండాలో అమ్మాయిలకు పన్నెండేళ్లలోపే పెళ్లి చేయడం ఆనవాయితీ. నేనా ఊరు దాటివెళ్లి చదువుతున్నాను. దాంతో ఇరుగు పొరుగు వారంతా అమ్మను 'పిల్లకు పెళ్లెప్పుడు చేస్తావు' అని సూటిపోటిమాటలతో పొడవసాగారు. నన్ను బాగా చదివించాలి అనుకున్న అమ్మకు నిర్ణయం మార్చుకోక తప్పలేదు. ఇంటర్ మొదటి సంవత్సరంలో ఉండగా నాకు ధనంజయ్ నాయక్‌తో వివాహమైంది. 'నా కూతురిని చదివించాలి' అని అమ్మ ఆయన దగ్గర ముందే మాట తీసుకొన్నదట. అప్పుడు ధనంజయ్ ఉస్మానియా యూనివర్సిటీలో ఎమ్మెస్సీ జియాలజీ చదువుతున్నారు. పెళ్లి తర్వాత వెంటనే పిల్లలు, కుటుంబ బాధ్యతలతో నా చదువుకు బ్రేక్ పడింది. ఆయనకు పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి అవ్వగానే, ఉస్మానియాలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగం వచ్చింది. అయితే, ఇక నా చదువు అటకెక్కిందనుకొన్న సమయంలో, ధనంజయ్ ప్రోత్సాహంతో అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ డిగ్రీలో చేరాను. ప్రతి ఆదివారం తరగతులకు వెళితే, పిల్లల ఆలనాపాలనా ఆయన చూసేవారు. పరీక్షల సమయంలోనూ ఇంటి బాధ్యతలన్నీ తానే చూసుకొనేవారు. నా చదువుకు తొలి ప్రాధాన్యత ఇచ్చేవారు. నాకు అర్థం కానివి చెబుతూ, దగ్గర కూర్చొబెట్టుకొని మరీ చదివించేవారు. అలా మంచి మార్కులతో డిగ్రీ పట్టా అందుకున్నాను.



చదవలేనన్నాను...

నేను పోస్టుగ్రాడ్యుయేషన్ మాత్రం రెగ్యులర్‌గా చేయాలనేది నా భర్త సంకల్పం. దాంతో కోఠి మహిళా కాలేజీలో ఎమ్మే తెలుగులో చేరాను. తెలుగు అంటే ఏదో రోజూ మనం చదివేది, మాట్లాడేదే కదా. సులభంగా ఉంటుందనుకొన్నా. తీరా నాలుగు రోజులు గడిచాక 'వ్యాకరణం' ఎంత కష్టమో అర్థమైంది. ఇంటికొచ్చి నా వల్లకాదు అన్నాను. 'కష్టంగా ఉందని వదిలేస్తే, ఇష్టమైన జీవితాన్ని పొందలేమని' ధనంజయ్ నాకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అప్పుడు మేమూ ఓయూ క్వార్టర్స్‌లోనే ఉండేవాళ్లం. మా ఇంటి పక్కనే ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, మరో వైపు తంగెడ కిషన్‌రావు, ఇంకో వైపు రుకునుద్దీన్ లాంటి తెలుగు పండితులుండేవారు. అలాంటి అరుదైన అవకాశాన్ని సద్వినియోగపరుచుకోమని సూచించారు. రోజూ కాలేజీ నుంచి వచ్చిన తర్వాత కసిరెడ్డి వెంకటరెడ్డి సర్ దగ్గరకెళ్లి వ్యాకరణం పాఠాలు చెప్పించుకొనేదాన్ని. తర్వాత గురువుగారి సహ అధ్యాపకురాలిగా నేను చదివిన కోఠి మహిళా కళాశాలలోనే చేరడం జీవితంలో మరిచిపోలేని ఒక మధురానుభూతి. నాకు ఎంఫిల్, పీహెచ్‌డీలలో పర్యవేక్షకుడిగా ఉన్న ఆచార్య మసన చెన్నప్పతో పాటు సినారె, ఆచార్య ఎన్ గోపీ తదితర పెద్దల సహకారం మరిచిపోలేనిది. వారంతా నన్ను కూతురిలా భావించి ప్రోత్సహించారు. అలాంటి గొప్ప ఆచార్యులు, పండితులు పరిచయం కావడం నా అదృష్టం.

రామాయణాల్లోని ఆశ్రమాలు...

మారుమూల తండాలో పుట్టి పెరిగిన నేను ఎమ్మే తెలుగులో పట్టా పొందాను. నా మాతృభాష బంజారా అయినా... 'రామాయణం అరణ్యకాండలోని ఆశ్రమాలు- శ్రీరాముని దర్శనాలు' అంశంమీద ఎంఫిల్ పరిశోధన చేశాను. అందుకు శ్రీవాల్మీకి 'రామాయణం' సంస్కృతం, గోన బుద్ధారెడ్డి 'రంగనాథ రామాయణం', మొల్ల 'రామాయణం' చదివాను. అందులో శ్రీరాముడు సందర్శించిన ఆశ్రమాలు, వాటి స్థితిగతులు, మహర్షులు, విద్యా వాటికలు... లాంటి సునిశిత అంశాలను థీసెస్‌లో రాశాను. ప్రాచీన సాహిత్యం మీద కొంతవరకు సాధికారత సాధించగలిగాను. అది నేను పొందిన విజయం అనుకొంటాను. అమెరికా ఫోక్లోర్ సొసైటీ ఆహ్వానం మేరకు అక్కడికెళ్లి 'బంజారాల వస్త్ర, ఆభరణాల ప్రాముఖ్యత' మీద పత్ర సమర్పణ చేశాను. మా తండా జీవితాలు ఇతివృత్తంగా కథలు, నానీలు, కవిత్వం... ఇలా పదికిపైగా పుస్తకాలు రాశాను. ఇరవైకుపైగా పుస్తకాలకు సంపాదకత్వం వహించాను. తద్వారా మా వాళ్ళ గొంతుకను వినిపిస్తున్నాను. తెలుగు సాహిత్య చరిత్రలో బంజారా సాహిత్యాన్ని నమోదు చేయగలిగాను. తెలంగాణ ప్రభుత్వం నుంచి 'ఉమెన్ అచీవర్' అవార్డు అందుకొన్నాను.

> **అదే నా ఆశయం..**
>
> నాకు ధాళీబాయి జన్మనిస్తే... ఆగిన నా చదువు తిరిగి కొనసాగేలా అవకాశమిచ్చిన డాక్టర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం పునర్జన్మనిచ్చింది. ఉస్మానియా విశ్వవిద్యాలయం జీవితాన్నిచ్చింది. గిరిజన సాహిత్య అధ్యయన కేంద్రాన్ని నెలకొల్పాలి. తద్వారా చరిత్రలో నమోదు కాని సంచార, గిరిజన సాహిత్యాన్ని వెలుగులోకి తేవాలి. బంజారా భాషా సాహిత్యాల అభివృద్ధికి కృషి చేయాలి అన్నది నా ఆశయం. ఆ దిశగా ప్రయత్నిస్తున్నాను.

అమ్మ స్మారకంగా...

ఉన్నత విద్య అభ్యసిస్తున్న క్రమంలోనే ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం వచ్చింది. అంతటితో తృప్తి చెందలేదు. ప్రొఫెసర్ కావాలి అనుకొన్నాను. అదే లక్ష్యంగా కొన్నేళ్ల కష్టపడ్డాను. నా కల సాకారమైంది. పాతికేళ్లగా బోధనా రంగంలో కొనసాగుతున్నాను. ఉస్మానియా తెలుగు శాఖ అధ్యక్షురాలిగా నాలుగేళ్ల బాధ్యతలు నిర్వర్తించాను. బిరుదురాజు రామరాజు తర్వాత అంతకాలం హోదాలో కొనసాగింది నేనే అని తెలిసి ఉప్పొంగిపోయాను. రాయప్రోలు సుబ్బారావు అధ్యక్షుడిగా 1919లో మొదలైన మా తెలుగు శాఖకు శతాబ్ది ఉత్సవాలను నిర్వహించడం నాకు లభించిన మరొక గొప్ప అవకాశం. నన్ను మరొకరు వేలెత్తి చూపిందానికి అవకాశం లేకుండా, స్వీకరించిన ప్రతి బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నాను.

అబ్బాయిలనే పెద్దగా బడికి పంపని ఆ రోజుల్లో నన్ను పదో తరగతి వరకు చదివించింది మా అమ్మ ధాళీబాయి. నన్ను విద్యావంతురాలిని చేయాలని ఆమె ఎంతగా కలలు కన్నదో నాకు తెలుసు. అక్షరం ముక్క రాకున్నా ఆమె ప్రేమతత్వం మహత్తరమైనది. అదే నన్ను విజయతీరాలకు చేర్చింది. అందుకే మా అమ్మ స్మారకంగా 'యాడి' (అమ్మ) చారిటబుల్ ట్రస్ట్ ద్వారా కష్టాల్లో ఉన్న విద్యార్థులకు తోచిన సహాయం చేస్తున్నాను. ఉజ్వల్ క్రియేషన్స్ ద్వారా యువ రచయితలను ప్రోత్సహించాలని, వారి రచనలు ముద్రిస్తున్నాం.

• సాంత్వన్

నవ్య | చిత్రజ్యోతి

'నాటునాటుకు' రామ్ చరణ్‌తో చిందేసిన ఖాన్ త్రయం



ఖాన్ త్రయాన్ని ఒకే తెరపై చూడాలని అభిమానులు ఎప్పటినుంచో కలలు కంటున్నారు. వారి కల ఇప్పటికి నిజమైంది. కానీ అది సినిమాలో కాదు.. ముఖేష్ అంబానీ పుత్రుడు అనంత్, వీరేన్ మర్చెంట్ కుమార్తె రాధిక ప్రీ వెడ్డింగ్ సంబరాల్లో. గుజరాత్‌లోని జామ్‌నగర్ వేదికగా జరుగుతున్న ఈ వేడుకలో బాలీవుడ్ ప్రముఖులు సందడి చేశారు. ఈ వేడుకకు మన టాలీవుడ్ స్టార్ హీరో రామ్ చరణ్ కూడా తన సతీమణి ఉపాసనతో విచ్చేశారు. ఇక తెలుగు వారి పాటను అంతర్జాతీయంగా అందలమెక్కించిన నాటునాటు పాటకు ఖాన్ త్రయం రామ్ చరణ్‌తో కలిసి చిందులేశారు. ప్రస్తుతం వీరు కలిసి స్టెప్పులేసిన వీడియో నెట్టింట అభిమానులను సంబరాల్లో ముంచెత్తుతోంది. ఈ వేడుకలో డ్యాన్సింగ్ హంగామా ఇంతటితో ఆగిపోలేదు. అతిలోక సుందరి శ్రీదేవి కుమార్తెలు జాన్వీ కపూర్, ఖుషీ కపూర్ కలిసి 'కభీ ఖుషీ కభీ గమ్'లోని 'బోలె చూడియాన్ బోలే కంగనా' పాటకు డాన్స్ చేశారు. వీరికి అనన్యా పాండే, సారా అలీఖాన్ కూడా జతకలవడంతో సందడి మరింత పెరిగింది. అంగరంగ వైభవంగా సాగుతోన్న ఈ ప్రీ వెడ్డింగ్ వేడుకలో క్రికెటర్ మహేంద్ర సింగ్ ధోనీ దంపతులు, స్టార్ డైరెక్టర్ అట్లీ, నటి రాణీముఖర్జీతో పాటు స్టార్ కపుల్స్ రణవీర్-దీపికా, రన్‌బీర్-అలియా భట్ తళుక్కుమన్నారు.

కేక పెట్టించే సినిమా అవుతుంది

గోపిచంద్



'భీమా' చిత్రం అవుట్‌పుట్ అద్భుతంగా వచ్చింది. ఈ సినిమా కేక పుట్టిస్తుంది. అందులో సందేహం లేదు' అని గోపిచంద్ అన్నారు. ఏ హర్ష దర్శకత్వంలో గోపీచంద్ కథానాయకుడిగా నటించిన యాక్షన్ ఎంటర్టైనర్ 'భీమా'. ప్రియా భవానీ శంకర్, మాళవికా శర్మ హీరోయిన్లు. కె.కె రాధామోహన్ నిర్మాత. ఈ నెల 8న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం హన్మకొండలో ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. గోపీచంద్ మాట్లాడుతూ 'ఈ సినిమాను గ్రాండ్‌గా నిర్మించడానికి మా నిర్మాతే కారణం. వారికి ధన్యవాదాలు. రవిబస్రూర్ అద్భుతమైన సంగీతం ఇచ్చారు' అని అన్నారు. ఏ హర్ష మాట్లాడుతూ 'భీమా' కథలో లో ఎనర్జీ, పవర్ ఉంది. ప్రేక్షకులను ఆకట్టుకునే అన్ని హంగులు ఈ సినిమాలో ఉన్నాయి. థియేటర్లలో హై ఇంపాక్ట్ ఇచ్చే సినిమా ఇది. మార్చి 8న బ్రహ్మ రాక్షసుడు కనిపిస్తాడు' అని చెప్పారు. ఇందులో నటనకు ఆస్కారమున్న పాత్ర పోషించాను అని మాళవిక శర్మ చెప్పారు. కేకే రాధామోహన్ మాట్లాడుతూ 'మహా శివరాత్రి సందర్భంగా సినిమాను విడుదల చేస్తున్నాం. అందరం సమష్టిగా పనిచేసి మంచి సినిమాను తెరకెక్కించాం' అని తెలిపారు.

ఫ్యామిలీ ఎంటర్టైనర్



విజయ్ దేవరకొండ కథానాయకుడిగా నటిస్తున్న కుటుంబ కథా చిత్రం 'ఫ్యామిలీ స్టార్'. మృణాల్ ఠాకూర్ కథానాయిక. పరశురామ్ పెట్ల దర్శకుడు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్‌రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. ఏప్రిల్ 5న ఈ చిత్రం విడుదలవుతోంది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలకు చక్కటి ఆదరణ దక్కుతోంది. ఇప్పుడు యూనిట్ ప్రచార కార్యక్రమాల్లో స్పీడ్ పెంచింది. టీజర్ ఈరోజే విడుదల అవుతోంది. ఈ సందర్భంగా విజయ్ దేవరకొండ సరికొత్త లుక్‌లో ఉన్న స్టిల్‌ను యూనిట్ విడుదల చేసింది. ఫ్యామిలీ యాక్షన్ ఎంటర్టైనర్‌గా ఈ సినిమా తెరకెక్కుతోన్నట్లు మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: గోపీసుందర్. సినిమాటోగ్రఫీ: కేయూ మోహనన్.

ఆగస్టులో సరిపోదా...



నాని కథానాయకుడిగా వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'సరిపోదా శనివారం'. డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో నాని యాక్షన్ ప్యాక్డ్ అవతార్‌లో కనిపించనున్నారు. ఇటీవలే విడుదలైన టీజర్‌కు చక్కటి స్పందన వచ్చింది. తాజాగా చిత్రబృందం రిలీజ్ డేట్‌ను ఖరారు చేసింది. 'సరిపోదా శనివారం' చిత్రాన్ని ఆగస్టు 29న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు యూనిట్ ప్రకటించింది. ఈ సందర్భంగా విడుదల చేసిన రిలీజ్ డేట్ పోస్టర్‌లో నాని ఒక చేత్తో పిడికిలి బిగించి, మరో చేత్తో రౌడీని పట్టుకున్న పవర్‌ఫుల్ లుక్‌లో కనిపించారు. ఈ చిత్రంలో ప్రియాంక అరుల్ మోహన్ కథానాయిక. ఎస్‌జే సూర్య కీలకపాత్ర పోషిస్తున్నారు. జేక్స్ బిజోయ్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: మురళీ జి. ఎడిటర్: కార్తిక్ శ్రీనివాస్

మధ్యతరగతి మనుషుల కథ



చైతన్య రావు, భూమి షెట్టి జంటగా నటించిన చిత్రం 'షరతులు వర్తిస్తాయి' కుమారస్వామి దర్శకత్వం వహించారు. నాగార్జున సామల, శ్రీష్ కుమార్ గుండా, డాక్టర్ కృష్ణ కాంత్ చిత్తజల్లు నిర్మించారు. ఈ నెల 15న థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధమవుతోందీ సినిమా ట్రైలర్‌ను ఆదివారం రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా నటుడు సంతోష్ యాదవ్ మాట్లాడారు. ఈ సినిమాలో శంకరన్న క్యారెక్టర్‌లో నటించానని తెలిపారు. టీజర్ రిలీజైన తర్వాత నన్ను అందరూ శంకరన్న అని పిలవడం మొదలు పెట్టారని ఆనందం వ్యక్తం చేశారు. మంచి సినిమాతో మా సంస్థ లాంచ్ అవుతుండటం హ్యాపీగా ఉందని నిర్మాత కృష్ణకాంత్ అన్నారు. మంచి ప్రయత్నం చేసినప్పుడు ఎన్నో అడ్డంకులు ఎదురవుతాయని దర్శకుడు అన్నారు. కానీ వాటిని ధైర్యంగా ఎదుర్కొని ప్రొడ్యూసర్స్‌ను సేఫ్‌గా ఉంచుతూ ఈ చిత్రాన్ని కంప్లీట్ చేశానని దర్శకుడు వివరించారు. ఇదొక న్యూ ఏజ్ సినిమా అని హీరోయిన్ భూమి షెట్టి తెలిపారు. మధ్య తరగతి, దిగువ మధ్య తరగతి వాళ్ల జీవితాల్లో ఉండే అన్ని ఎమోషన్స్ ఇందులో ఉంటాయని నటుడు చైతన్య రావు వివరించారు.

37.53 లక్షల మంది చిన్నారులకు పోలియో చుక్కలు

» రాష్ట్రవ్యాప్తంగా 92 శాతం నమోదు

హైదరాబాద్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం చేపట్టిన పల్స్ పోలియో విజయవంతమైనట్లు వైద్యశాఖ ప్రకటించింది. రాష్ట్రంలో 40.57లక్షల మంది ఐదేళ్లలోపు చిన్నారులుండగా వారిలో 37.53లక్షల మంది(92%)కి పోలియో చుక్కలు వేసినట్లు వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా సంగారెడ్డి జిల్లా జోగిపేటలోని ఏరియా ఆస్పత్రిలో ప్రారంభించారన్నారు. ఆదివారం పోలియో చుక్కలు వేసుకోలేకపోయిన చిన్నారులకు సోమ, మంగళ వారాల్లో వారి ఇంటివద్దనే చుక్కలు వేయనున్నట్లు ఆయన తెలిపారు.

రాష్ట్రంలో మరో నూతన జర్నలిస్టు సంఘం

జర్నలిస్ట్ యూనియన్ ఆఫ్ స్టేట్ తెలంగాణ పేరుతో ఏర్పాటు

హైదరాబాద్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో మరో జర్నలిస్టు సంఘం ఆవిర్భవించింది. జర్నలిస్ట్ యూనియన్ ఆఫ్ స్టేట్ తెలంగాణ(జస్ట్) పేరుతో సంఘాన్ని ఏర్పాటు చేసినట్టు నూతన కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. హైదరాబాద్‌లోని టీఎన్‌జీవోస్ భవన్‌లో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సంఘం కన్వీనర్‌గా ఎంవీ రమణ, కో కన్వీనర్లుగా పీవీ శ్రీనివాస్, గణేష్, బిజిగిరి శ్రీనివాస్, శశికాంత్, మురళి, మల్లీశ్వరి, సలహాదారుగా కొండల్‌రావు ఎన్నికయ్యారు. స్టేట్ కో కన్వీనర్‌గా నియామకమైన గుంటిపల్లి వెంకట్ ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జిగానూ వ్యవహరిస్తారని కమిటీ తెలిపింది. కాగా పలు జిల్లాల ఇన్‌చార్జిలతో స్టేట్ అడ్‌హాక్ కమిటీని కూడా నియమించారు.

ఇస్కాన్‌కు 9 ఎకరాల మామిడి తోట విరాళం

» నిజామాబాద్ జిల్లాకు చెందిన భక్తుడి దానం

నవీపేట, మార్చి 3: నిజామాబాద్ జిల్లా నవీపేట మండలం హనుమాన్‌ఫారం గ్రామానికి చెందిన కొండపావులూరి శ్రీనివాస్ రావు, సుభాషిణి దంపతులు తమ తొమ్మిదిన్నర ఎకరాల మామిడి తోటను ఇస్కాన్ సంస్థకు విరాళంగా అందజేశారు. ఈ తోట విలువ సుమారు రూ.3కోట్లు ఉంటుంది. హైదరాబాద్‌లో వ్యాపారం చేస్తున్న శ్రీనివాస్ రావు.. ఎన్నో ఏళ్లుగా శ్రీకృష్ణుడికి భక్తులు. హరేకృష్ణ మూమెంట్ ఇస్కాన్ సంస్థలో సభ్యునిగానూ ఉన్నారు. నవీపేట మండలంలోని శాఖాపూర్ గ్రామ శివారులోని తమ మామిడితోటను ఆదివారం ఇస్కాన్‌కు అందజేశారు. ఈ మామిడితోటలో త్వరలో ఇస్కాన్ మందిరం, వృద్ధాశ్రమం, గోశాల ఏర్పాటవుతాయని శ్రీనివాస్‌రావు ఈ సందర్భంగా తెలిపారు. అలాగే, హనుమాన్ ఫారంలో తమ సొంత డబ్బు రూ.లక్ష వ్యయంతో ఏర్పాటు చేసిన తాగునీటి శుద్ధి కేంద్రాన్ని శ్రీనివాస్‌రావు తన తండ్రి వెంకటేశ్వర్ రావు పేరిట విరాళంగా ఇచ్చారు.

అసదుద్దీన్.. ఇక నువ్వు ఇంటికే

» హైదరాబాద్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి మాధవి లత

న్యూఢిల్లీ, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఇక ఇంటికి వెళ్లాల్సిందేనని హైదరాబాద్ లోకసభ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి మాధవి లత అన్నారు. ఆదివారం ఢిల్లీలోని బీజేపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి తరుణ్ ఛుగ్‌తో ఆమె సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మాధవి లత మాట్లాడుతూ.. తాను సంఘ్ నుంచే వచ్చానని, కొత్తగా పార్టీలో చేరాల్సిన అవసరం లేదన్నారు. తాను చేసిన సేవా కార్యక్రమాలే తనకు టికెట్ వచ్చేలా చేశాయని చెప్పారు. "అసదుద్దీన్ హిందువులకే కాదు. చివరికి ముస్లింలకు కూడా ఏం చేయలేదు. అన్యాయంగా యువకులను జైళ్లలో పెట్టించారు" అని మాధవి లత ఆరోపించారు. ఈసారి హైదరాబాద్ ఎంపీగా తన విజయం ఖాయమని ఆమె ధీమా వ్యక్తం చేశారు.

సినీనటి సౌమ్యశెట్టి దొంగావతారం!

» స్నేహితురాలి ఇంట్లో విడతలవారీగా బంగారం చోరీ

విశాఖపట్నం, మార్చి 3 (ఆంధ్రజోతి): స్నేహితురాలి ఇంట్లో బంగారంపై కన్నేసిన ఆ సినీనటి.. బెడ్‌రూమ్‌లోని కప్‌బోర్డులో భద్రపరిచిన బంగారాన్ని విడతల వారీగా మాయం చేసింది. కొద్దిరోజుల తర్వాత చోరీ విషయం గుర్తించిన స్నేహితురాలి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సినీనటి సౌమ్య శెట్టి బండారం బయటపడింది. ఈ కేసులో 57 తులాల బంగారాన్ని రికవరీ చేసిన పోలీసులు ఆమెను అరెస్టు చేసి ఈ నెల 1న రిమాండ్‌కు తరలించారు. విశాఖపట్నంలోని దొండపర్తి ప్రాంతంలోని బాలాజీ రెసిడెన్సీలో ఉంటున్న జనపాల ప్రసాద్ పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో సీనియర్ సూపరింటెండెంట్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. ఆయన కుమార్తె మౌనిక 2016లో బీటెక్ చదువుతుండగా యూట్యూబ్ రీల్స్, షార్ట్‌ఫిల్మ్స్‌లో నటించే సౌమ్యతో పరిచయమైంది. మౌనికకు మోడలింగ్‌పై ఆసక్తి ఉండడంతో ఇద్దరూ కలిసి కొన్ని షార్ట్‌ఫిల్మ్స్‌లో కూడా నటించారు. తర్వాత తండ్రి ప్రసాద్ వారించడంతో మౌనిక వాటికి దూరమైంది. మౌనికకు వివాహం చేయడంతో ఇద్దరి మధ్య స్నేహం తెగిపోయింది. సౌమ్య కూడా సుజాతానగర్‌లో ఉంటున్న ఒడిశాకు చెందిన బలరాంశెట్టిని ప్రేమ వివాహం చేసుకుంది. ఇటీవల ఇద్దరి మధ్య మళ్లీ స్నేహం చిగురించింది. దొండపర్తిలోని పుట్టింట్లో ఉంటున్నానని మౌనిక చెప్పింది. ఈ క్రమంలో సౌమ్య పలుమార్లు దొండపర్తిలోని మౌనిక పుట్టింటికి వెళ్లి వచ్చారు. ఇదిలావుండగా ఈనెల 23న ఎలమంచిలిలోని బంధువుల ఇంట శుభకార్యం ఉండడంతో మౌనికతోపాటు ఆమె తల్లిదండ్రులు బంగారు ఆభరణాల కోసం బెడ్‌రూమ్‌లోని కప్‌బోర్డు తెరిచారు. ఆభరణాలు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదుచేశారు. పోలీసులు కేసు నమోదుచేసి వివరాలు సేకరించారు. తరచూ ఇంటికి వచ్చి వెళ్లినవారిలో సౌమ్యశెట్టి ఉన్నట్టు చెప్పడంతోపాటు ఆమె పలుమార్లు వాష్‌రూమ్‌కి వెళతానంటూ మాస్టర్ బెడ్‌రూమ్‌లోకి వెళ్లి డోర్ వేసుకునేదని చెప్పారు. దీంతో పోలీసులకు ఆమెపై అనుమానం ఏర్పడింది. దీంతో సౌమ్యశెట్టిని అదుపులోకి తీసుకుని విచారించగా మొదట తనకేమీ తెలియదని చెప్పింది. పోలీసులు ఆమె లావాదేవీలను బయటపెట్టడంతో నేరాన్ని అంగీకరించింది. కొంత సొమ్ముతో గోవాలో ఎంజాయ్ చేసినట్టు తెలిపింది.

సీఎంతో వరంగల్ మేయర్ సుధారాణి భేటీ

హస్తం గూటికి వెళ్తారని ప్రచారం

15 మంది బీఆర్ఎస్ కార్పొరేటర్లు కూడా!




సీఎం రేవంత్‌ను కలిసిన వరంగల్ మేయర్ గుండు సుధారాణి; సీఎంతో భేటీ అయిన బంగారు శ్రుతి

వరంగల్/హైదరాబాద్/భద్రాచలం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) కుడా హస్తగతం కానుంది. ఇప్పటికే ఏడుగురు కార్పొరేటర్లు బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. తాజాగా మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు నేతృత్వంలో 15 మంది బీఆర్ఎస్ కార్పొరేటర్లు సీఎం రేవంత్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరేందుకు హైదరాబాద్‌కు వెళ్లారు. ఈ క్రమంలో ఎప్పటి నుంచో పార్టీ మారాలని చూస్తున్న నగర మేయర్ గుండు సుధారాణి సైతం ఆదివారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు. తాను అభివృద్ధి పనుల కోసమే సీఎంను కలిసినట్లు సుధారాణి చెబుతున్నప్పటికీ.. ఆమె కూడా హస్తం గూటికి వెళ్తారని తెలుస్తోంది. అయితే మేయర్ చేరికను మంత్రితో పాటు కొందరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కూడా వ్యతిరేకిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా జోక్యం చేసుకుని సమస్య పరిష్కరిస్తారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. రెండుమూడు రోజుల్లో మేయర్‌తో పాటు.. 18 నుంచి 20 మంది కార్పొరేటర్లు గులాబీ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరనున్నారు. అలాగే డీసీసీబీ బ్యాంకు ఛైర్మన్ మార్నేని రవీందర్‌రావు సైతం ఇటీవల సీఎం సలహాదారు వేంనరేందర్‌రెడ్డిని కలిశారు. పార్లమెంట్ ఎన్నికల లోపు రవీందర్‌రావు కూడా కాంగ్రెస్ గూటికి చేరుతారనే ప్రచారం జరుగుతోంది. మరోవైపు.. వర్ధన్నపేట మునిసిపల్ ఛైర్‌పర్సన్ అంగోతు అరుణ, కౌన్సిలర్లు తుమ్మల రవీందర్, మంచాల రామకృష్ణ, స్థానిక బీఆర్ఎస్ నేతలు పలువురు.. ఆదివారం ఎమ్మెల్సీ మహేష్ కుమార్‌గౌడ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. మొత్తానికి బీఆర్ఎస్‌కు కంచుకోటగా ఉన్న ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి కీలక నేతలు పార్టీలు మారుతుండడం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

భద్రాచలం అభివృద్ధి కోసమే కలిశా: తెల్లం

భద్రాచలం బీఆర్ఎస్ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు.. సీఎం రేవంత్‌రెడ్డిని కుటుంబ సమేతంగా కలిశారు. ఆదివారం ఆయన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి హైదరాబాద్‌లో ముఖ్యమంత్రితో భేటీ అయి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా భద్రాచలం నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రం అందించారు. సీఎంను కలిసిన అనంతరం.. వెంకట్రావు మీడియాతో మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు.

కాంగ్రెస్‌లోకి బంగారు లక్ష్మణ్ కుమార్తె శ్రుతి!

బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శ్రుతి ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. ఆమె దివంగత నేత, బీజేపీ జాతీయ మాజీ అధ్యక్షుడు బంగారు లక్ష్మణ్ కుమార్తె. లోక్‌సభ ఎన్నికల్లో నాగర్‌కర్నూలు టికెట్‌ను ఆమె ఆశించారు. అయితే బీజేపీ అధిష్ఠానం.. మరో అభ్యర్థి పేరును ప్రకటించింది. దీంతో తీవ్ర అసంతృప్తితో ఉన్న శ్రుతి.. కాంగ్రెస్‌లో చేరనున్నట్లు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి.

దక్షిణాదిన తెలంగాణే టాప్

(మొదటి పేజీ తరువాయి)



ఢిల్లీ (రూ.8,217) తొలి నాలుగుస్థానాల్లో ఉండగా.. తెలంగాణ రూ.8,158 ఖర్చుతో ఐదో స్థానంలో నిలిచింది. ఆంధ్రప్రదేశ్(రూ.6,782) పదిహేనో స్థానంలో ఉంది. గ్రామీణ ప్రాంతాల ఎంపీసీఈ అధికంగా ఉన్న రాష్ట్రాల జాబితాలో మన రాష్ట్రం(రూ.4,802) టాప్ టెన్‌లో కూడా లేకపోవడం గమనార్హం. ఏపీ ఈ జాబితాలో 11వ స్థానంలో నిలవగా.. తెలంగాణ 13వ స్థానంలో నిలిచింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఆదాయాల నడుమ భారీగా పెరుగుతున్న అంతరానికి ఇది సూచిక అని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వాలు.. పట్టణ ప్రాంతాల అభివృద్ధిపైనే దృష్టిపెట్టడం దీనికి కారణమని విశ్లేషిస్తున్నారు.

ఉత్తరాది పెద్ద రాష్ట్రాల కన్నా..

దక్షిణాదిన ఉన్న ఐదు రాష్ట్రాలను పరిగణనలోకి తీసుకుంటే పట్టణ ప్రాంతాల ఎంపీసీఈ సగటు విషయంలో తెలంగాణే అగ్రస్థానంలో ఉంది. గ్రామీణ ప్రాంతాల ఎంపీసీఈ విషయంలో దక్షిణాదిన మన రాష్ట్రం కేరళ, తమిళనాడు, ఏపీ తర్వాత నాలుగో స్థానంలో ఉంది. ఇక.. ఉత్తరాదిన ఉన్న పలు రాష్ట్రాల గ్రామీణ, పట్టణ ప్రాంతాల ఎంపీసీఈ దక్షిణాది రాష్ట్రాలతో పోలిస్తే చాలా తక్కువగా ఉండడం గమనార్హం. ప్రధాని మోదీ సొంత రాష్ట్రమైన గుజరాత్.. పట్టణ ప్రాంత ఎంపీసీఈ రూ.6,621. ఇది తెలంగాణ, దక్షిణాదిలోని ఐదు రాష్ట్రాల్లో ఈ కేటగిరీలో అట్టడుగున ఉన్న ఏపీ పట్టణ ప్రాంత ఎంపీఈసీ (రూ.6,782) కన్నా తక్కువ. ఉత్తరప్రదేశ్ అర్బన్ ఎంపీసీఈ కేవలం రూ.5,040 కాగా.. మధ్యప్రదేశ్ అర్బన్ ఎంపీసీఈ అంతకన్నా తక్కువ.. రూ.4,987. రాజస్థాన్ అర్బన్ ఎంపీసీఈ రూ.5,913. ఆయా రాష్ట్రాల గ్రామీణ ప్రాంత ఎంపీసీఈ కూడా దక్షిణాది రాష్ట్రాలన్నింటి కన్నా తక్కువే!! ఇక ఈ సర్వేలో తేలిన మరో ఆసక్తికరమైన విషయం ఏంటంటే.. ప్రజలు తమ ఆదాయంలో అత్యధికం ఆహారేతర (టీవీ, రిఫ్రిజిరేటర్, శీతలపానీయాలు, ప్రాసెస్డ్ ఫుడ్, వైద్యం, రవాణా, అద్దె వంటి) అవసరాలకే ఖర్చు పెడుతున్నారు. సాధారణంగా దేశంలో ప్రజలు తమకు వచ్చే ఆదాయంలో అత్యధిక భాగం ఆహార అవసరాలకు ఖర్చుపెడితే.. అది అభివృద్ధి సూచిక కాదని ఆర్థిక నిపుణులు పేర్కొంటారు. తమకు వచ్చే దాంట్లో కొంత మేర ఆహారానికి పెట్టి.. ఇతరత్రా అవసరాలకు ఎక్కువ వినియోగించగలిగే అవకాశం వారికి ఉండడం పురోగతికి సూచన అని చెబుతారు. అంటే.. సంపాదించుకునే దాంట్లో ఎక్కువ మొత్తం తిండికే కాకుండా ఇతరత్రా అవసరాలకూ ఖర్చుపెట్టగలిగే స్వేచ్ఛ వచ్చిందనడానికి సూచన అది. నివేదిక చెబుతున్నది కూడా అదే. దీని ప్రకారం..

- గడిచిన పదేళ్లలో దేశవ్యాప్తంగా బియ్యం, పప్పు దినుసుల వినియోగం గణనీయంగా తగ్గింది. 2011-12లో గ్రామీణ ప్రాంతాల్లో ఒక కుటుంబం నెలవారీ ఖర్చు బియ్యం, పప్పు దినుసులపై 10.69% ఉండగా.. ఇప్పుడది 4.89 శాతానికి తగ్గింది. పట్టణ ప్రాంతాల్లో ఇది 6.61 నుంచి 3.62 శాతానికి తగ్గింది.
- ఆహార పదార్థాల కోసం గ్రామీణ ప్రాంతాల్లోని కుటుంబం తన మొత్తం ఆదాయంలో సరాసరిగా ప్రతినెల 46.38% ఖర్చు చేస్తోంది. 2011-12లో ఇది 52.9 శాతంగా ఉండేది. అలాగే పట్టణాల్లో ఇది 42.62% నుంచి 39.17 శాతానికి తగ్గింది.
- రవాణా ఖర్చు, ఇంటి అద్దె, వైద్యం వంటి ఆహారేతర ఖర్చులు 2012తో పోలిస్తే భారీగా పెరిగాయి.
- రవాణా ఖర్చు, ఇంటి అద్దె, వైద్యం వంటి ఆహారేతర ఖర్చులు 2012తో పోలిస్తే భారీగా పెరిగాయి.
- సిగరెట్, మద్యంపై ఖర్చులు గ్రామీణ ప్రాంతాల్లో 3.21% నుంచి 3.79 శాతానికి.. అర్బన్‌లో 1.61% నుంచి 2.43 శాతానికి పెరిగాయి.
- విద్యపై ఖర్చు గతంతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాల్లో 3.49% నుంచి 3.3 శాతానికి.. పట్టణాల్లో 6.9% నుంచి 5.78 శాతానికి తగ్గింది.

దక్షిణాది రాష్ట్రాల్లో ఇలా..

ఉత్తరాదిన ఉన్న పలు రాష్ట్రాలతో పోలిస్తే గ్రామీణ, పట్టణ ప్రాంత నెలవారీ, తలసరి వినియోగ వ్యయం దక్షిణాది ఐదు రాష్ట్రాల్లోనే ఎక్కువ. మన ఐదు రాష్ట్రాల పరిస్థితిని పరిశీలిస్తే..

గ్రామాల్లో ఎంపీసీఈ		పట్టణాల్లో ఎంపీసీఈ	
కేరళ	5,924	తెలంగాణ	8,158
తమిళనాడు	5,310	కర్ణాటక	7,630
ఆంధ్రప్రదేశ్	4,870	తమిళనాడు	7,630
తెలంగాణ	4,802	కేరళ	7,078
కర్ణాటక	4,397	ఆంధ్రప్రదేశ్	6,782

సమాజ ఉమ్మడి ఆస్తిగా బూతులు

» రాజకీయ పార్టీల నేతలు దారుణంగా మాట్లాడుతున్నారు: జస్టిస్ సుదర్శన్‌రెడ్డి

» ప్రజాసేవ కోసం వచ్చినవారికి ఎందుకంత కోపం: ఉండవల్లి

విజయవాడ కల్చరల్, మార్చి 3: 'ప్రస్తుతం బూతులు సమాజ ఉమ్మడి ఆస్తిగా మారిపోయాయి. మనకు ఉన్నవి ఏమిటని చూస్తే బూతులు, విద్వేషమే కనిపిస్తున్నాయి. దీనిపై చర్చించకపోతే బూతు భాష సమజానికి మనమిచ్చే వారసత్వం అవుతుంది' అని జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీలోని విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ నూతనంగా నిర్మించిన నాలుగో అంతస్తును ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం 'ప్రసార మాధ్యమాల్లో రాజకీయ పరిభాష' అంశంపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడారు. భావోద్వేగాలు లేకుండా రాజకీయాలు నడపాలని అభిప్రాయపడ్డారు. తీవ్రమైన పదజాలం ఉపయోగించకూడదని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. రాజకీయ పార్టీల సిద్ధాంతాలు, రాద్ధాంతాలు ఎలా ఉన్నా బూతుల జోలికి నేతలు వెళ్లడంపై ప్రజలు అసహ్యం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. రాజకీయ నేతలు ప్రయోగిస్తున్న భాష మంచిదేనా అనే చర్చ జరగాలని అభిప్రాయపడ్డారు. మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ జనం దేన్ని ఎక్కువగా ఇష్టపడితే దానినే మీడియా చూపిస్తోందని, మీడియా దేన్ని ఎక్కువగా చూపిస్తుందో దాన్నే రాజకీయ నేతలు మాట్లాడుతున్నారని వివరించారు. ప్రజాసేవ చేయడానికి వచ్చిన వారికి ఎందుకంత కోపం వస్తుందని ప్రశ్నించారు. సెన్సేషనల్ అంశాలకే మీడియా ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. బూతులు మాట్లాడేవారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవచ్చని తెలిపారు. రాజకీయాల్లో మహిళల గురించి అసభ్యంగా మాట్లాడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఓటీటీకి సెన్సార్ ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు.

బీఆర్ఎస్‌కు మరో షాక్!

» కమలం గూటికి అరూరి రమేశ్



వరంగల్, మార్చి 3(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వరంగల్‌లో బీఆర్ఎస్‌కు మరో షాక్ తగలనుంది. వరంగల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ బీజేపీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో వర్ధన్నపేట అసెంబ్లీ స్థానం నుంచి అరూరి బీఆర్ఎస్ తరఫున ఎమ్మెల్యేగా గెలిచారు. 2023 ఎన్నికల్లో ఓడిపోయారు. పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్ (ఎస్సీ రిజర్వుడు) స్థానం నుంచి బీఆర్ఎస్ టికెట్‌పై పోటీ చేసేందుకు రమేష్ ప్రయత్నాలు చేశారు. అయితే స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తన కుమార్తె కడియం కావ్యను బరిలో దించేందుకు వ్యూహరచన చేస్తున్నారు. ఈ క్రమంలో ఎంపీ టికెట్‌పై అధిష్ఠానం నుంచి ఎలాంటి హామీ రాకపోగా మరోవైపు.. బీజేపీ తరఫున పోటీ చేయాలని ఆ పార్టీ రాష్ట్ర, జాతీయ నేతలు ఆఫర్లు ఇస్తుండడంతో అరూరి రమేశ్ ఆలోచనలో పడ్డారు. రెండుమూడు రోజులుగా తన అనుచరులతో బీజేపీలో చేరికపై ఆయన మంతనాలు జరుపుతున్నారు. సోమవారం ఆదిలాబాద్ పర్యటనకు వస్తున్న ప్రధాని మోదీ నేతృత్వంలో బీజేపీలో చేరాలని, లేదంటే మరుసటి రోజు ఢిల్లీకి వెళ్లి కాషాయం కండువా కప్పుకోవాలని అరూరి నిర్ణయించుకున్నట్లు ఆయన సన్నిహితులు తెలిపారు.

ఎమ్మెల్యేలపై వ్యతిరేకతతోనే పార్టీ ఓటమి

(మొదటి పేజీ తరువాయి)



బీఆర్ఎస్ శ్రేణులతో భేటీలో మాట్లాడుతున్న కేసీఆర్

చేశారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్, బీజేపీలు పెద్ద ఎత్తున ఆపరేషన్ ఆకర్ష్‌కు తెరదీసి బీఆర్ఎస్ నేతలను తమ పార్టీల్లోకి లాక్కొంటుండడంపై ఆయన మాట్లాడినట్లు తెలిసింది. పార్టీ కేడర్‌ను కాపాడుకోవడంపై సూచనలు చేసినట్లు సమాచారం. ఇప్పటి వరకు లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తారని భావించిన నేతలు ఒక్కొక్కరుగా ఇతర పార్టీల్లోకి వెళ్లిపోతుండడంతో.. ఎవరికి చాన్స్ ఇవ్వాలి? అనేదానిపైనా సుదీర్ఘంగా చర్చించినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా కేసీఆర్ కొన్ని కీలక వ్యాఖ్యలు చేశారు. "అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను పట్టించుకోవొద్దు. ఆ ఎన్నికల్లో కేసీఆర్ గెలవాలని, తమ ఎమ్మెల్యేలు మాత్రం ఓడిపోవాలని ప్రజలు కోరుకున్నారు. దాంతో.. మొదటికే మోసం వచ్చింది. ఓడిపోయిన ఎమ్మెల్యేలపై ప్రజల్లో వ్యతిరేకత ఇప్పటికీ తగ్గలేదు. రాజకీయాల్లో గెలుపోటములు సహజం. ఓటమితో కుంగిపోవడం, విజయంతో పొంగిపోవడం అనే అలవాటు బీఆర్ఎస్‌కు లేదు. లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అంతా కలిసికట్టుగా పనిచేయాలి" అని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా బస్సు యాత్రలు చేపడతామని, నియోజకవర్గ స్థాయి నేతలు మండలస్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నియోజకవర్గాల్లో సమన్వయ కమిటీలను ఏర్పాటు చేసుకుని, కార్యాచరణను కొనసాగించాలన్నారు. ఈ నెల 12న కరీంనగర్‌లోని ఎస్.ఆర్.ఆర్ కాలేజీ మైదానంలో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేయనున్నట్లు కేసీఆర్ వెల్లడించారు. కరీంనగర్ స్థానంలో బీఆర్ఎస్ విజయఢంకా మోగిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. "ఎన్టీఆర్ నేతృత్వంలోని టీడీపీ 1989లో ఓటమిపాలైనా.. 1994లో బ్రహ్మాండమైన మెజారిటీతో గెలుపొందింది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మనం వంద కు పైగా స్థానాలను సాధిస్తాం. బీఆర్ఎస్ ఎంతోమంది నేతలను తయారు చేసింది. అధికారంలో లేకపోవడంతో కొందరు నేతలు అటూఇటూ పోవచ్చు. క్యాడర్ మాత్రం అలాగే ఉంటుంది. ఆ క్యాడర్‌ను కాపాడుకోవాలి" అని సూ చించారు. తాము అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ నేతలు ఎల్ఆర్ఎస్‌పై విమర్శలు చేశారని.. ఇప్పుడు మాత్రం ఆ స్కీమ్‌ను అమలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. అయితే.. కాంగ్రెస్ ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు ఉచితంగా ఎల్ఆర్ఎస్ చేయాలని డిమాం డ్ చేశారు. కాంగ్రెస్ సర్కారు నీళ్లు, వి ద్యుత్తు ఇవ్వడం లేదని ఆరోపించారు. మిడ్‌మానేరులో సమస్యలు వస్తే తాము తక్షణమే మరమ్మతులు చేశామని, ప్రాజెక్టుల్లో సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సీనియర్ నేతలు టి.హరీశ్‌రావు, బి.వినోద్‌కుమార్, గంగుల కమలాకర్, సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం, మానుకోటపై నేడు సమావేశం

మాజీ సీఎం కేసీఆర్ సోమవారం ఖమ్మం, మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గాలకు చెందిన పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం కానున్నారు.



బీఆర్ఎస్‌లో పోటీకి సిటింగ్‌లు విముఖం?

(మొదటి పేజీ తరువాయి)

సమాచారం. రంజిత్‌రెడ్డి బాటలోనే దక్షిణ తెలంగాణలో ఓ సిటింగ్ ఎంపీ కూడా పోటీకి విముఖత వ్యక్తం చేసినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. త్వరలో ఆయన బీజేపీ తీర్థం పుచ్చుకొంటారని సమాచారం. మహబూబాబాద్ సిటింగ్ ఎంపీ మాలోత్ కవిత కూడా ఈసారి పోటీకి ఆసక్తి చూపడం లేదన్న ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, పెద్దపల్లి ఎంపీ నేతకాని వెంకటేశ్, నాగర్‌కర్నూల్ ఎంపీ పోతుగంటి రాములు బీఆర్ఎస్‌ను వీడిన విషయం తెలిసిందే.! ఒకట్రెండ్రోజుల్లో మరో ముగ్గురు ఎంపీలు పార్టీకి గుడ్‌బై చెబుతారనే ప్రచారం సాగుతోంది. 2019 లోక్‌సభ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ టికెట్ కోసం గట్టి పోటీ నెలకొన్న విషయం తెలిసిందే.! ఇప్పుడు మాత్రం టికెట్ వచ్చినా.. పోటీ చేసే పరిస్థితి లేదని ఓ సీనియర్ నేత వాపోయారు. ఈ సారి లోక్‌సభ ఎన్నికలను అన్ని పార్టీలు సీరియస్‌గా తీసుకున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన ఉత్సాహంతో కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ పోలింగ్ సమరోత్సాహానికి సన్నద్ధమవుతోంది. మోదీ-3.0 నినాదంతో బీజేపీ ముందుకు సాగుతోంది. తెలంగాణలో పాగా కోసం తహతహలాడుతున్న బీజేపీ.. ఇప్పుడు వీలైనన్ని ఎక్కువ లోక్‌సభ స్థానాలను సాధించాలని అగ్రనేతలను రంగంలోకి దింపుతోంది. ప్రధాని మోదీ కూడా సోమ, మంగళవారాల్లో రాష్ట్రంలో పర్యటించనున్నారు. బీఆర్ఎస్ మాత్రం చావో రేవో అని తేల్చుకోవాల్సిన పరిస్థితిని ఎదుర్కొంటోంది. కాంగ్రెస్ సర్కారుపై వ్యతిరేకత ఉందని బీఆర్ఎస్ చెబుతున్నా.. లోక్‌సభ ఎన్నికల్లో దాని ప్రభావం ఎంతవరకు ఉంటుందనే దానిపై స్పష్టత లేదు. బీఆర్ఎస్ సిటింగ్ ఎంపీలు కొందరు ఈ సారి ఎన్నికల్లో పోటీకి విముఖత వ్యక్తం చేస్తుండడం ఆ పార్టీకి ప్రతికూలాంశమే.!

కరీంనగర్‌లో బోయినపల్లి, పెద్దపల్లిలో కొప్పుల

బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ సోమవారం పలు లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించనున్నట్లు తెలిసింది. కరీంనగర్, పెద్దపల్లి అభ్యర్థులను ఆదివారమే ఖరారు చేశారని తెలుస్తోంది. వీటితో పాటు ఖమ్మం, మహబూబాబాద్, సికింద్రాబాద్, వరంగల్, నల్లగొండ, జహీరాబాద్, చేవెళ్ల లోక్‌సభ స్థానాలకు కూడా అభ్యర్థులను ఖరారు చేసి, సోమవారం సాయంత్రానికి ప్రకటిస్తారని సమాచారం. బీఆర్ఎస్ వర్గాల సమాచారం ప్రకారం కరీంనగర్ స్థానానికి బోయినపల్లి వినోద్‌కుమార్, పెద్దపల్లికి కొప్పుల ఈశ్వర్ పేర్లను ప్రకటిస్తారని తెలుస్తోంది.

ఆ ఉద్యోగి.. పదోన్నతికి అనర్హుడు!

» అసలు ఆర్‌అండ్‌బీ శాఖ ఉద్యోగే కాదు

» మంత్రి, సీఎంవోకు ఉద్యోగుల లేఖ

హైదరాబాద్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): "ఆయన రోడ్లు, భవనాల శాఖ ఉద్యోగి కాదు. ఇరిగేషన్ శాఖలోని ఇంజనీరింగ్ రీసెర్చ్ ల్యాబ్ విభాగానికి చెందిన ఉద్యోగి. ఆర్‌అండ్‌బీలో పదోన్నతికి అనర్హుడు. తిరిగి ఆయన్ను తన మాతృ సంస్థకు పంపండి"అని పేర్కొంటూ పదోన్నతులకు అర్హులైన పలువురు.. సంబంధిత శాఖ మంత్రికి విజ్ఞప్తి చేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. సీఎంవోకు కూడా ఈ లేఖ అందినట్లు సమాచారం. వాస్తవానికి ఆర్ అండ్ బీలో పదోన్నతులు ఇవ్వాలంటే ఏపీ నుంచి సీనియారిటీ జాబితా రావాల్సి ఉంది. అప్పుడే ఇక్కడ పదోన్నతులకు మార్గం సుగమం అవుతుంది. ఈ మేరకు ఏపీ నుంచి జాబితాను తీసుకొచ్చేందుకు ఇప్పటికే పలువురు ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నేతలు.. ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. అయితే, శాఖలోని ఉన్నతస్థాయి పదవికి తాను అర్హుడినేనని, తనకు పదోన్నతి కల్పించాలని ఓ ఉద్యోగి సంబంధిత శాఖ ఉన్నతాధికారులను కోరినట్లు తెలిసింది. దీనిపై ఇతర ఉద్యోగులు స్పందిస్తూ.. అతడు అండ్ బీ శాఖ ఉద్యోగే కాదని, పదోన్నతికి అనర్హుడని పేర్కొంటూ సంబంధిత మంత్రితోపాటు సీఎంవోకు లేఖ రాసినట్లు తెలిసింది. పదోన్నతికి అర్హుడినని చెప్పుకొంటున్న ఉద్యోగి.. 1993లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఇరిగేషన్ శాఖ పరిధిలోని ఏపీ ఇంజినీరింగ్ రీసెర్చ్ ల్యాబ్‌లో అసిస్టెంట్ రీసెర్చ్ ఆఫీసర్‌గా నియమితులయ్యారని అందులో పేర్కొన్నారు. ఆర్‌అండ్‌బీలో ఓ ఉద్యోగి రాజీనామాతో ఏర్పడిన బ్యాక్‌లాగ్ (డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్) పోస్టులోకి 1996లో బదిలీపై వచ్చారని తెలిపారు. ఆయన్ను తిరిగి మాతృశాఖకు పంపాలని కోరారు. 1993లో ఆర్‌అండ్‌బీలో డైరెక్ట్‌గా రిక్రూట్ అయిన తాము మాత్రమే పదోన్నతులకు అర్హులమని వారు వెల్లడించారు.

స్పోర్ట్స్

రెండో రౌండ్‌కు హుస్సాముద్దీన్

బస్టో ఆర్సిజియో (ఇటలీ): ప్రపంచ ఒలింపిక్ బాక్సింగ్ క్వాలిఫయర్స్‌లో తెలుగు బాక్సర్ మహ్మద్ హుస్సాముద్దీన్ రెండో రౌండ్‌లోకి ప్రవేశించాడు. 57 కిలోల విభాగం తొలి రౌండ్‌లో బై లభించడంతో హుస్సామ్ పోటీ పడకుండానే నేరుగా రెండో రౌండ్ చేరుకున్నాడు. శుక్రవారం రెండో రౌండ్ జరగనుంది. మిగతా భారత బాక్సర్లలో దీపక్ బోరియా (51 కి) 2-3తో హుసేనోవ్ నిజాత్ (అజర్‌బైజాన్) చేతిలో ఓడగా, నరేందర్ (92 కి +) 0-5తో నెల్వీ టిఫాక్ (జర్మనీ) చేతిలో పరాజయం పాలయ్యాడు.

ఇండో-పాక్ మ్యాచ్ టికెట్ రూ.1.8 కోట్లా?

రీసేల్ మార్కెట్‌లో అ'ధర'హో

న్యూఢిల్లీ: భారత్, పాకిస్థాన్ మధ్య మ్యాచ్ అంటే ప్రపంచ క్రికెట్‌లో ఎనలేని క్రేజ్. అమెరికాలో జరగనున్న టీ20 వరల్డ్‌కప్‌లో జూన్ 9న న్యూయార్క్‌లో జరిగే ఈ ఇండో-పాక్ జట్ల మ్యాచ్ టిక్కెట్లకు కూడా ఊహించని డిమాండ్ ఏర్పడింది. అధికారిక వెబ్‌సైట్‌లో ఈ మ్యాచ్ కోసం ప్రత్యేకంగా మూడు కేటగిరీలుగా రూ. 14 వేల నుంచి 33 వేల వరకు (175, 300, 400 డాలర్లు) ధరలను నిర్ణయించారు. అయితే, అమ్మకాలు ఆరంభమైన కొద్ది సేపటికే అధికారిక సైట్‌లో టిక్కెట్లు మొత్తం అమ్ముడవగా.. రీసేల్ మార్కెట్‌లో కొన్ని టిక్కెట్లు ఎక్కువ ధరకు దర్శనమిస్తున్నాయి. వీఐపీ టిక్కెట్ల ధరలు రూ. 33 వేలు (400 డాలర్లు) ఉండగా.. రీసేల్‌లో రూ. 33 లక్షలు (40,000 డాలర్లు) పలుకుతున్నాయి. ఎన్‌బీఏ ఫైనల్‌కు ఎంతటి డిమాండ్ ఉంటుందో.. ఈ మ్యాచ్‌కు కూడా అదే తరహాలో క్రేజ్ ఉండడం విశేషం. రీసేల్ సైట్లలో అతి తక్కువ ధర టిక్కెట్ అంటే రూ. 96 వేలు (1166 డాలర్లు)గా ఉంది. సీట్ గీక్ అనే సేల్స్ వెబ్‌సైట్‌లో సెక్షన్ 500 టిక్కెట్ ధర ఏకంగా రూ. 1.86 కోట్లు (ఫీజులతో కలిపి) పలుకుతుండడం అందరినీ నోరెళ్లబెట్టేలా చేస్తోంది.

విదిత్‌పై ప్రజ్ఞానంద విజయం

ప్రేగ్ (చెక్ రిపబ్లిక్): సీనియర్ గ్రాండ్‌మాస్టర్ విదిత్ సంతోష్ గుజరాతికి యువ జీఎం ప్రజ్ఞానంద షాకిచ్చాడు. ప్రేగ్ ఇంటర్నేషనల్ చెస్ ఫెస్టివల్ ఐదో రౌండ్ పోటీల్లో విదిత్‌పై ప్రజ్ఞానంద విజయం సాధించాడు. మరో మ్యాచ్‌లో చెక్ జీఎం డేవిడ్ చేతిలో గుకేష్ ఓటమి పాలయ్యాడు. ఐదో రౌండ్ ముగిసేసరికి ప్రజ్ఞానంద 2.5 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచాడు.


రాధా యాదవ్ (3/20)

ఢిల్లీ హ్యాట్రిక్


జొనాసెన్ (3/22)

నేటి మ్యాచ్
యూపీ X బెంగళూరు
రాత్రి 7.30 గం. నుంచి

- లానింగ్ అర్ధసెంచరీ
- గుజరాత్‌కు నాలుగో ఓటమి

మహిళల ప్రీమియర్ లీగ్

బెంగళూరు: మహిళల ప్రీమియర్ లీగ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ అదరగొడుతోంది. తమ ఆరంభ మ్యాచ్‌లో మాత్రమే ఓడిన ఢిల్లీ ఆ తర్వాత జోరు కొనసాగిస్తూనే ఉంది. ఆదివారం గుజరాత్ జెయింట్స్‌ను 25 రన్స్ తేడాతో ఓడించి హ్యాట్రిక్ విజయాన్ని అందుకుంది. అలాగే ఆరు పాయింట్లతో, మెరుగైన రన్‌రేట్‌తో ముంబైని వెనక్కినెట్టి పట్టికలో టాప్‌నకు దూసుకెళ్లింది. ఇక విజయమే లేకుండా వరుసగా నాలుగో ఓటమితో జెయింట్స్ దాదాపుగా ప్లేఆఫ్స్ నుంచి వైదొలిగింది. ఈ మ్యాచ్‌లో చెత్త ఫీల్డింగ్‌తో మూడు కీలక క్యాచ్‌లను వదిలేసి మూల్యం చెల్లించుకుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ 20 ఓవర్లలో 8 వికెట్లకు 163 పరుగులు చేసింది. మెగ్ లానింగ్ (41 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్‌తో 55), క్యాప్సీ (17 బంతుల్లో 5 ఫోర్లతో 27) సత్తా చాటారు. మేఘనా సింగ్‌కు 4, గార్డ్‌నర్‌కు 2 వికెట్లు దక్కాయి. ఛేదనలో గుజరాత్ 20 ఓవర్లలో 138/8 స్కోరుకే పరిమితమై ఓడింది. ఆష్లే గార్డ్‌నర్ (31 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్‌తో 40) మాత్రమే రాణించింది. స్పిన్నర్లు రాధా యాదవ్, జొనాసెన్‌లకు మూడేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా జొనాసెన్ నిలిచింది.

స్పిన్ ధాటికి టపటపా: ఛేదనలో గుజరాత్ బ్యాటర్లు ఏ దశలోనూ పోరాటం చూపలేదు. జొనాసెన్, రాధా యాదవ్‌ల ధాటికి జట్టు వేగంగా వికెట్లు కోల్పోయింది. గార్డ్‌నర్ మాత్రమే క్రీజులో నిలదొక్కుకునే ప్రయత్నం చేసింది. రెండో ఓవర్‌లోనే ఓపెనర్ వోల్వార్డ్ (0) అవుట్ కాగా, ఐదో ఓవర్‌లో మరో ఓపెనర్ బెత్ మూనీ (12), లిచ్‌ఫీల్డ్ (15)లను జొనాసెన్ దెబ్బతీసింది. అనంతరం రాధా యాదవ్ బంతులకు మిడిలార్డర్ దారుణంగా తడబడింది. గార్డ్‌నర్ ధీటుగా ఆడినా ఆమెకు మరో ఎండ్‌లో సహకారం లభించలేదు. 15వ ఓవర్‌లో గార్డ్‌నర్ వికెట్‌ను జొనాసెన్ తీయడంతో జెయింట్స్ ఆట నామమాత్రమైంది.

లానింగ్ హాఫ్ సెంచరీ: టాస్ ఓడిన బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ ఇన్నింగ్స్‌లో ఓపెనర్, కెప్టెన్ మెగ్ లానింగ్ హైలైట్‌గా నిలిచింది. మూడు కీలక భాగస్వామ్యాలతో జట్టు సవాల్ విసిరే స్కోరుకు కారణమైంది. ఓపెనర్ షఫాలీ (13) తొలి ఓవర్‌లోనే 4,6తో జోరు చూపినా, ఆమె దూకుడు తొమ్మిది బంతులకే పరిమితమైంది. క్యాప్సీ క్రీజులో ఉన్నది కాసేపైనా 4 ఫోర్లతో రన్‌రేట్ తగ్గకుండా చూసింది. రెండో వికెట్‌కు లానింగ్‌తో 38 పరుగులు జోడించాక ఏడో ఓవర్‌లో క్యాప్సీ వెనుదిరిగింది. అప్పటిదాకా ఓపిగ్గా ఆడిన లానింగ్ బ్యాట్ ఝుళిపించింది. 13వ ఓవర్‌లో రెండు వరుస ఫోర్లతో అర్ధసెంచరీ పూర్తి చేసుకుంది. జెమీమా (7)తో కలిసి మూడో వికెట్‌కు 47 పరుగులు జత చేసింది. అయితే ఈ జోడీ స్వల్ప వ్యవధిలో పెవిలియన్‌కు చేరడంతో జట్టు తడబడింది. చివర్లో సదర్లాండ్ (20), శిఖా పాండే (14 నాటౌట్) మెరుపు ఆటతీరుతో ఢిల్లీ స్కోరు 160 దాటింది.


మెగ్ లానింగ్ (55)

సంక్షిప్త స్కోర్లు

ఢిల్లీ: 20 ఓవర్లలో 163/8 (లానింగ్ 55, క్యాప్సీ 27, సదర్లాండ్ 20; మేఘనా సింగ్ 4/37, గార్డ్‌నర్ 2/37).

గుజరాత్: 20 ఓవర్లలో 138/8 (గార్డ్‌నర్ 40, లిచ్‌ఫీల్డ్ 15; రాధా యాదవ్ 3/20, జొనాసెన్ 3/22).

మేం లేకపోతే.. అనే భ్రమల్లో ఉండొద్దు

సీనియర్లకు గవాస్కర్ చురక

న్యూఢిల్లీ: ఇంగ్లండ్‌పై టెస్టు సిరీస్ నెగ్గిన భారత జట్టుపై మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్ ప్రశంసలు కురిపించాడు. ఈ గెలుపును 2020-21లో ఆస్ట్రేలియాలో భారత్ 2-1తో సిరీస్ నెగ్గిన చరిత్రతో పోల్చాడు. 'మేం ఉంటేనే టీమిండియా గెలుస్తుందనే భ్రమల్లో ఎవరైనా పెద్ద ఆటగాళ్లు ఉంటే.. వారికి ఈ విజయం కనువిప్పు' అని సీనియర్లకు సన్నీ పరోక్షంగా చురకలంటించాడు. 2020 ఆసీస్ టూర్ తొలి టెస్టులో భారత్ ఘోరంగా ఓడింది. పలువురు ఆటగాళ్లు గాయపడగా.. కెప్టెన్ కోహ్లీ పెటర్నిటీ లీవ్‌లో వెళ్లిపోయాడు. అలాంటి పరిస్థితుల్లో పంత్, సిరాజ్ సత్తా చాటడంతో.. భారత్ 2-1తో సిరీస్ గెలిచి చరిత్ర సృష్టించింది. ఇప్పుడు స్వదేశంలో ఇంగ్లండ్‌తో జరుగుతున్న ఐదు టెస్టుల సిరీస్‌కూ కోహ్లీ దూరమయ్యాడు. కానీ భారత్ 3-1తో సిరీస్ నెగ్గిందంటే యువ ఆటగాళ్ల ప్రతిభే. సీనియర్ల గైర్హాజరీలో ధ్రువ్ జురెల్, సర్ఫరాజ్, ఆకాశ్ దీప్ మ్యాచ్ విన్నర్లుగా మారారు. 'ఈ క్రెడిట్ కెప్టెన్ రోహిత్, కోచ్ ద్రవిడ్‌కు దక్కుతుంది. కుర్రాళ్లకు అవకాశాలు ఇవ్వడంతోపాటు వారికి తగిన మార్గదర్శకం చేస్తూ అండగా నిలిచారు' అని సన్నీ అన్నాడు. ఇక, సెంట్రల్ కాంట్రాక్ట్ కోల్పోయిన శ్రేయాస్ అయ్యర్ పట్ల గవాస్కర్ సానుభూతి వ్యక్తం చేశాడు. ఈ విషయంలో బీసీసీఐ కొంత కఠినంగానే వ్యవహరించిందన్న సన్నీ.. అనుభవించే వాడికే ఆ బాధ తెలుస్తుందని.. శిక్షకులు దాన్ని అంచనా వేయలేరని గవాస్కర్ అన్నాడు.


శార్దూల్ ఠాకూర్ (109)

శార్దూల్ సూపర్ శతకం

207 పరుగుల ఆధిక్యంలో ముంబై
తమిళనాడుతో రంజీ సెమీస్

ముంబై: ఆల్‌రౌండర్ శార్దూల్ ఠాకూర్ (109) అదిరే శతకానికి తనుష్ కోటియన్ (74 బ్యాటింగ్) ఇన్నింగ్స్ తోడవడంతో.. తమిళనాడుతో జరుగుతున్న రంజీ సెమీస్‌లో ముంబై పట్టు బిగించింది. ఓవర్‌నైట్ స్కోరు 45/2తో రెండోరోజైన ఆదివారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ముంబై ఆట ముగిసేసరికి 353/9 స్కోరు చేసింది. తనుష్‌తో పాటు తుషార్ దేశ్‌పాండే (17) క్రీజులో ఉన్నారు. తమిళనాడు తొలి ఇన్నింగ్స్ స్కోరు 146తో పోల్చితే.. ముంబై 207 పరుగుల కీలక ఆధిక్యం సాధించింది. భారత జట్టులో చోటు కోల్పోయిన తర్వాత తొలి మ్యాచ్ ఆడిన శ్రేయాస్ అయ్యర్ (3)ను సందీప్ వెనక్కిపంపాడు. మోహిత్ (2), రహానె (19), ముషీర్ (55), ములాని (0)లను సాయి కిషోర్ (6/97) పెవిలియన్ చేర్చడంతో.. ముంబై 106/7తో పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో హార్దిక్ తమోర్ (35)తో కలిసి 8వ వికెట్‌కు 105 రన్స్ జోడించిన శార్దూల్.. తనుష్‌తో 9వ వికెట్‌కు 79 పరుగుల భాగస్వామ్యంతో జట్టును ఆదుకున్నాడు. తమోర్‌ను సాయి.. సెంచరీ అనంతరం ధాటిగా ఆడే ప్రయత్నం చేసిన శార్దూల్‌ను సేన్ అవుట్ చేశారు.

ఎంపీని నిలబెట్టిన హిమాన్షు


హిమాన్షు (126)

హిమాన్షు మంత్రి (126) సెంచరీతో.. విదర్భతో జరుగుతున్న రెండో సెమీస్‌లో మధ్యప్రదేశ్ (ఎంపీ)కు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం దక్కింది. ఓవర్‌నైట్ స్కోరు 47/1తో ఆదివారం మొదటి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన మధ్యప్రదేశ్ 252 పరుగులకు ఆలౌటైంది. ఉమేష్, యశ్ చెరో 3 వికెట్లు పడగొట్టారు. విదర్భ మొదటి ఇన్నింగ్స్ స్కోరు (170)తో పోల్చితే.. ఎంపీ 82 పరుగుల ఆధిక్యంలో ఉంది. అనంతరం రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన విదర్భ ఆట ముగిసేసరికి 13/1 స్కోరు చేసింది. ధ్రువ్ (10), అక్షయ్ (1) క్రీజులో ఉన్నారు.


లియోన్ (6/65)

ఆసీస్‌దే తొలి టెస్టు

ఆక్లాండ్: న్యూజిలాండ్‌తో జరిగిన తొలి టెస్టులో ఆస్ట్రేలియా జట్టు 172 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. 369 పరుగుల భారీ ఛేదన కోసం కివీస్ నాలుగో రోజైన ఆదివారం ఓవర్‌నైట్ స్కోరు 111/3తో రెండో ఇన్నింగ్స్ ఆరంభించింది. ఈ స్థితిలో కివీస్ పటిష్ఠంగానే కనిపించినా.. స్పిన్నర్ నాథన్ లియోన్ (6/65) ధాటికి తొలి సెషన్‌లోనే మిగతా 7 వికెట్లను కోల్పోయింది. ఫలితంగా కివీస్ 196 పరుగులకే కుప్పకూలింది. రచిన్ రవీంద్ర (59) మరో మూడు పరుగులు జత చేసి అవుటయ్యాడు. మిచెల్ (38), కుగ్గెలిన్ (26) ఫర్వాలేదనిపించారు. హాజెల్‌వుడ్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 383, రెండో ఇన్నింగ్స్‌లో 164 పరుగులు చేయగా.. కివీస్ తొలి ఇన్నింగ్స్‌లో 179 పరుగులు చేసింది. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా గ్రీన్ నిలిచాడు.

'డబ్ల్యూటీసీ'లో భారత్ టాప్

దుబాయ్: ఆస్ట్రేలియా చేతిలో న్యూజిలాండ్ పరాజయం భారత క్రికెట్ జట్టుకు కలిసివచ్చింది. ఆ ఓటమితో కివీస్ అగ్రస్థానం నుంచి రెండో స్థానానికి పడిపోగా.. టీమిండియా టాప్‌నకు చేరింది. భారత్ 64.58 విజయాల శాతంతో అందరికంటే ముందంజలో ఉండగా, కివీస్ (60 శాతం), ఆసీస్ (59.09) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. అయితే, ఈనెల 7 నుంచి ఇంగ్లండ్‌తో జరిగే ఆఖరి టెస్టులో గెలిస్తేనే భారత్ అగ్రస్థానం పదిలంగా ఉంటుంది. ఆ టెస్టులో భారత్ ఓడి.. 8 నుంచి ఆసీస్‌తో జరిగే రెండో టెస్టులో కివీస్ నెగ్గితే మళ్లీ జట్ల స్థానాలు మారతాయి.

కోల్‌కతాపై ఢిల్లీ గెలుపు

చెన్నై: ప్రైమ్ వాలీబాల్ లీగ్ సీజన్-3లో కోల్‌కతా థండర్‌బోల్ట్స్‌పై ఢిల్లీ తుఫాన్స్ జట్టు 3-0తో విజయం సాధించింది. ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో ఢిల్లీ 15-9, 16-14, 17-15తో నెగ్గింది. ఢిల్లీ ఆటగాడు సంతోష్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. మరో మ్యాచ్‌లో అహ్మదాబాద్ డిఫెండర్స్ 3-1తో కొచ్చి బ్లూ స్పైకర్స్‌పై గెలిచింది.



చాహల్‌ను తిప్పేసిన సంగీత

న్యూఢిల్లీ: ఓ చానెల్‌లో ప్రసారమవుతున్న డ్యాన్స్ రియాలిటీ షోకు సంబంధించిన పార్టీలో టీమిండియా స్పిన్నర్ యజ్వేంద్ర చాహల్, రెజ్లర్ సంగీతా ఫొగాట్ అందరి దృష్టినీ ఆకర్షించారు. చాహల్‌ను తన భుజాలపైకెత్తుకొని సంగీత సరదాగా గింగరాలు తిప్పుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. చాహల్ కిందకు దించమని విజ్ఞప్తి చేయడంతో.. సంగీత వదిలిపెట్టింది. కాగా, ఆ షోలో సంగీత ఎలిమినేట్ కాగా.. చాహల్ భార్య ధనశ్రీ ఫైనల్ చేరింది.

బిజినెస్

గరిష్ఠ స్థాయిల్లో పటిష్ఠం


వి. సుందర్ రాజా

టెక్ వ్యూ

నిఫ్టీ గత వారం బలమైన రియాక్షన్‌లో ప్రారంభమై మానసిక అవధి 22,000 కన్నా తగ్గినా శుక్రవారం వచ్చిన బలమైన జీడీపీ గణాంకాల మద్దతుతో శక్తివంతమైన రికవరీ సాధించి వారం గరిష్ఠ స్థాయి 22,380 వద్ద క్లోజయింది. వారం మొత్తం మీద 165 పాయింట్లు లాభపడింది. దిగువకు పుల్‌బ్యాక్ రియాక్షన్‌లో కూడా 22,000 వద్ద నిలదొక్కుకోవడం పాజిటివ్ సంకేతం. అలాగే గత రెండు వారాల్లోనూ 22,000 వద్ద కన్సాలిడేట్ అవుతూ గత వారంలో రెండోసారి ఆ స్థాయి కన్నా పైన నిలకడగా ముగియడం గత వారం బ్రేకౌట్ సరైనదేనన్న సంకేతంగా భావించవచ్చు. అయితే మిడ్‌క్యాప్ 100 ఇండెక్స్ 125 పాయింట్ల నష్టంతో ముగియగా స్మాల్‌క్యాప్ 100 ఇండెక్స్ ఫ్లాట్‌గా ముగిసింది. టెక్నికల్‌గా మార్కెట్ జీవితకాల గరిష్ఠ స్థాయిల్లో ఉంది. కొత్త శిఖరాలపై మరో పరీక్షకు సిద్ధం అవుతోంది.

బుల్లిష్ స్థాయిలు: పాజిటివ్ ధోరణిలో ట్రేడయితే 22,550 వద్ద కీలక నిరోధం ఉంది. ఇది మానసిక అవధి కావడం వల్ల తదుపరి స్వల్పకాలిక కన్సాలిడేషన్ ఉండవచ్చు. మరింత అప్‌ట్రెండ్ కోసం ఆ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి.

బేరిష్ స్థాయిలు: ప్రధాన మద్దతు స్థాయి 22,250 వద్ద బలహీనత ప్రదర్శించి అంతకన్నా దిగజారితే బలహీనతను సూచిస్తుంది. ప్రధాన స్వల్పకాలిక మద్దతు స్థాయి 22,000.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ కూడా గత వారం రియాక్షన్ అనంతరం 47,280 కన్నా పైన బలంగా కోలుకుని వారంలో 475 పాయింట్ల లాభంతో ముగిసింది. ఇప్పటికీ జనవరిలో ఏర్పడిన జీవితకాల గరిష్ఠ స్థాయికి దిగువనే ఉంది. పాజిటివ్ ధోరణిలో ట్రేడయినట్టయితే మరింత అప్‌ట్రెండ్ కోసం నిరోధ స్థాయిలు 47,800, 48,300 కన్నా పైన నిలదొక్కుకోవాలి. మద్దతు స్థాయి 47,000 కన్నా దిగజారితే అప్రమత్తతను సూచిస్తుంది.

పాటర్న్: నిఫ్టీ మరింత అప్‌ట్రెండ్ కోసం 22,550 వద్ద "ఏటవాలుగా ఎగువకు ఏర్పడిన రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" కన్నా పైన నిలదొక్కుకోవాలి. 22,250 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" వద్ద మద్దతు ఉంది. కరెక్షన్‌లో ప్రవేశించినా ఇక్కడ నిలదొక్కుకోవడం తప్పనిసరి.

టైమ్: ఈ సూచీ ప్రకారం బుధవారం తదుపరి రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	22,460, 22,510
మద్దతు	22,340, 22,250

www.sundartrends.in

చిన్న పట్టణాలకు గోద్రెజ్ విస్తరణ

న్యూఢిల్లీ: వచ్చే మూడేళ్ల కాలంలో పంపిణీ వ్యవస్థను ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలకు విస్తరించడానికి గోద్రెజ్ అండ్ బాయిస్ కంపెనీ రూ.40 కోట్లు ఇన్వెస్ట్ చేయనుంది. దీంతో 2027 నాటికి గోద్రెజ్ స్టోర్ల సంఖ్య వ్యవస్థ రెట్టింపై 400 నగరాలకు విస్తరిస్తుంది. స్టోర్ల విస్తరణపై తాము ప్రతి ఏటా రూ.10-15 కోట్లు వ్యయం చేస్తామని కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ అనిల్ వర్మ అన్నారు.

ఐపీఓ మార్కెట్ బిజీ బిజీ

8 ఐపీఓలు, ఏడు లిస్టింగ్‌లు



న్యూఢిల్లీ: ఈ వారం ప్రైమరీ మార్కెట్ మరింత బిజీగా మారనుంది. రూ.1,483.2 కోట్లు సమీకరించేందుకు ఎనిమిది కంపెనీలు పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)కు వస్తున్నాయి. ఇప్పటికే ఐపీఓలు జారీ చేసిన ఏడు కంపెనీల షేర్లు ఈ వారం బీఎస్ఈ, ఎన్ఎస్ఈల్లో లిస్ట్ కాబోతున్నాయి.

ఈ వారం వస్తున్న ఐపీఓలు ఇవే..

డేటా ఆధారిత సమగ్ర మార్కెటింగ్ సేవలు అందించే ఆర్‌కే స్వామి కంపెనీ ఐపీఓ సోమవారం నుంచి ప్రారంభమవుతోంది. ఈ నెల 6న ముగిసే ఈ ఐపీఓ ఇష్యూ ధరను రూ.270-288గా ఖరారు చేశారు. ఈ ఇష్యూ ద్వారా కంపెనీ రూ.423.56 కోట్లు సమీకరించనుంది. జింక్ ఆక్సైడ్ తయారు చేసే జేజీ కెమికల్స్ ఐపీఓ మంగళవారం ప్రారంభమవుతోంది. రూ.250.2 కోట్ల సమీకరణ కోసం ఈ కంపెనీ రూ.210-221 ప్రైస్ బ్యాండ్‌లో షేర్లు జారీ చేస్తోంది. ఈ ఐపీఓ మార్చి 7న ముగుస్తుంది. రాజ్‌కోట్ కేంద్రంగా గోపాల్ స్నాక్స్ కూడా రూ.650 కోట్ల సమీకరణ కోసం ఈ నెల 6న ఐపీఓ జారీ చేస్తోంది. మార్చి 11న ముగిసే ఈ ఐపీఓ ఇష్యూ ధరను రూ.381-401గా నిర్ణయించారు.ఈ మూడు కంపెనీలు కాకుండా వీఆర్ ఇన్‌ఫ్రాస్పేస్, సోనా మెషినరీ, శ్రీ కర్ణి ఫ్యాబ్‌కామ్, కౌరాషైన్ డైమండ్ జువెలరీ, పుణె ఈ-స్టాక్ బ్రోకింగ్ కంపెనీలూ ఈ వారం ఐపీఓ మార్కెట్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నాయి. గత వారం ప్రారంభమైన ముక్కా ప్రొటీన్స్ ఐపీఓ సోమవారం ముగుస్తుంది. ఎంవీకే ఆగ్రో ఫుడ్ ప్రొడక్ట్ కంపెనీ ఐపీఓ కూడా సోమవారం ముగియనుంది.

లిస్టింగ్ కంపెనీలు ఇవే..

ప్లాటినం ఇండస్ట్రీస్, ఎగ్జికామ్ టెలిసిస్టమ్స్ కంపెనీల షేర్లు మంగళవారం లిస్టవుతున్నాయి. ఈ రెండు కంపెనీల షేర్లు గ్రే మార్కెట్లో ఇష్యూ ధర కంటే 54 నుంచి 100 శాతానికిపైగా ప్రీమియంతో ట్రేడవుతున్నాయి. భారత్ హైవేస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ షేర్లు బుధవారం, ముక్కా ప్రొటీన్స్ షేర్లు గురువారం లిస్టవుతాయి.ఇక ఎస్ఎంఈ సెగ్మెంట్‌లో ఒయాసిస్ మెటల్ అండ్ మినరల్ ప్రాసెసింగ్ కంపెనీ షేర్లు సోమవారం, పూర్వ్ ఫ్లెక్సీప్యాక్ కంపెనీ షేర్లు మంగళవారం, ఎంవీకే ఆగ్రో ఫుడ్ ప్రొడక్ట్స్ కంపెనీ షేర్లు గురువారం లిస్టవుతున్నాయి.

ఏఐతో బీపీఓ ఉద్యోగాలకు ముప్పే

ఐటీ ఉద్యోగులపై ప్రభావం అంతంతే


నాస్కామ్ చైర్మన్ రాజేశ్ నంబియార్

ముంబై: బిజినెస్ ప్రాసెస్ ఔట్‌సోర్సింగ్ (బీపీఓ) ఉద్యోగాలకు పెద్ద ముప్పు పొంచి ఉంది. ఉత్పాదక కృత్రిమ మేధ (ఏఐ)తో వీరి ఉద్యోగాలు ఎక్కువగా గల్లంతయ్యే ప్రమాదం ఉందని నాస్కామ్ ఛైర్మన్ రాజేశ్ నంబియార్ హెచ్చరించారు. ఐటీ సేవల ఉద్యోగులకు మాత్రం ఏఐ ముప్పు పెద్దగా ఉండకపోవచ్చన్నారు. అయితే ఐటీ సేవల ఉద్యోగులు కూడా తమ పనుల్లో ఏఐని భాగం చేసుకోవాల్సి ఉంటుందన్నారు. లేకపోతే ఏఐపై పట్టు ఉన్న ఉద్యోగులు వారి స్థానాలను భర్తీ చేసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. పుణెలో జరిగిన ఒక సదస్సులో ఆయన ఈ హెచ్చరిక చేశారు. క్లయింట్ల డిమాండ్లకు అనుగుణంగా భారత ఐటీ కంపెనీలు ఉద్యోగులకు పెద్దఎత్తున ఏఐ నైపుణ్యాల్లో శిక్షణ ఇస్తున్న నేపథ్యంలో నంబియార్ ఈ హెచ్చరిక చేయడం విశేషం. ఒక సమస్య పరిష్కారానికి లేదా ఇప్పటికే ఉన్న వ్యవస్థలతో ఏఐని అనుసంధానం చేయగలిగినప్పుడే అసలు ప్రభావం కనిపిస్తుందన్నారు. ఏఐ.. టెక్నాలజీ ఆఫీసుల్లో పని చేసే ఈక్విటీ అనలిస్టులు, గణాంక నిపుణుల వంటి వైట్ కాలర్ ఉద్యోగుల కొలువులనే ఎక్కువగా ప్రభావితం చేస్తుందన్నారు. ఏసీలు, లైట్లను బాగు చేసే టెక్నీషియన్ కొలువులకు మాత్రం ఏఐతో పెద్దగా ఇబ్బంది ఉండదని నంబియార్ స్పష్టం చేశారు.

ఇక ఫ్లిప్‌కార్ట్ ద్వారా నగదు బదిలీ

న్యూఢిల్లీ: ఈ కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ నుంచి ఇక అందరూ యూపీఐ చెల్లింపులు కూడా చేయవచ్చు. ఫ్లిప్‌కార్ట్ యూపీఐ హ్యాండిల్ @fkaxisద్వారా ఫ్లిప్‌కార్ట్ కస్టమర్లతో పాటు ఎవరైనా రిజిస్టర్ అయి తేలిగ్గా యూపీఐ లావాదేవీలు నిర్వహించుకోవచ్చు. ఇది దేశంలో డిజిటల్ చెల్లింపుల విధానం మరింత విస్తరించేందుకు దోహదపడుతుందని ఫ్లిప్‌కార్ట్ ఒక ప్రకటనలో తెలిపింది. ఫ్లిప్‌కార్ట్ కస్టమర్లు 50 కోట్ల మందితో పాటు సాధారణ పౌరులు కూడా దీనిలో రిజిస్టర్ కావచ్చు. ఇది ఉపయోగించే వారికి లాయల్టీలు అందించడం కోసం సూపర్ కాయిన్లు, క్యాష్‌బాక్‌లు, మైల్‌స్టోన్ ప్రయోజనాలు, బ్రాండ్ ఓచర్లు ఫ్లిప్‌కార్ట్ ప్రవేశపెడుతోంది. 2023లో 11,700 కోట్ల లావాదేవీల ద్వారా రూ.182.84 లక్షల కోట్ల చెల్లింపులు చేయడానికి యూపీఐ ఉపయోగపడింది. ఈ నేపథ్యంలో యూపీఐ మరింతగా విస్తరించేందుకు ఫ్లిప్‌కార్ట్ హ్యాండిల్ ఉపయోగపడుతుందంటున్నారు.

22,650 పైన బుల్లిష్

(మార్చి 4-7 తేదీల మధ్య వారానికి)


డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

ఆస్ట్రో గైడ్

నిఫ్టీ గత వారం 22,420-22,020 పాయింట్ల మధ్యన కదలాడి 165 పాయింట్ల లాభంతో 22,378 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 22,650 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 21,849, 21,767, 20,441, 20,068 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డీఎంఏ 200 డీఎంఏ కన్నా పైన ఉండడం దీర్ఘకాలిక బుల్లిష్ ట్రెండ్ సంకేతం.

బ్రేకౌట్ స్థాయి: 22,780 బ్రేక్‌డౌన్ స్థాయి: 21,980
నిరోధ స్థాయిలు: 22,580, 22,680, 22,780 (22,480 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 22,180, 22,080, 21,980 (22,280 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



3వ తేదీ		విజయవాడ	463
హైదరాబాద్	466	విశాఖపట్నం	500
4వ తేదీ		వరంగల్	468
చిత్తూరు	523		
గోదావరి	463	డజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	126	గోదావరి	134
వరంగల్	126	విజయవాడ	134
కరీంనగర్	126	గుంటూరు	134
మహబూబ్‌నగర్	126	ఒంగోలు	134
కర్నూలు	126	చిత్తూరు	120
విశాఖపట్నం	127		

బ్యాంకింగ్, ఫైనాన్స్ షేర్లపై లుక్కేయండి..!

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈ వారం మెరుగ్గా కదలాడే అవకాశాలు కనిపిస్తున్నాయి. స్థానిక, అంతర్జాతీయ పరిణామాలు ఇన్వెస్టర్లలో పాజిటివ్ సెంటిమెంట్‌ను నింపాయి. ఈ వారం కొనుగోళ్ల జోరు కొనసాగే అవకాశం ఉంది. అయితే ఫియర్ ఇండెక్స్ ఇండియా విక్స్ ఇంకా 15 స్థాయిలోనే ఉండటం అప్రమత్తతను సూచిస్తోంది. నిఫ్టీ మార్చి నెల మద్దతు స్థాయి 22,300, నిరోధ స్థాయిలు 22,500 వద్ద ఉన్నాయి. గత వారం మెటల్స్, ఆటో సూచీలు రాణించాయి. అయితే శుక్రవారం నాటి ఎఫ్ఐఐ గణాంకాలను చూస్తే ఈ వారం బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగాల్లో బుల్లిష్‌నెస్ ఉండొచ్చు.

స్టాక్ రికమండేషన్స్

డేటా ప్యాటర్న్స్: కేంద్ర ప్రభుత్వం రక్షణ రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల నిబంధనలను సరళీకరించటం ఈ కౌంటర్‌కు కలిసి వచ్చింది. కొన్నాళ్లుగా ట్రేడింగ్, డెలివరీ వాల్యూమ్ విపరీతంగా పెరుగుతోంది. చివరి మూడు రోజుల్లోనే ఈ షేరు 24 శాతం మేర పెరిగింది. సుదీర్ఘ కాలం కన్సాలిడేషన్ కావటం మరో పాజిటివ్ అంశం. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.2,650 స్థాయిలో ప్రవేశించి రూ.2,710/2,850 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.2,610 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

జిందాల్ స్టీల్: ఈ షేరు సరికొత్త జీవిత కాల గరిష్ఠాన్ని తాకటంతో ఇన్వెస్టర్ల చూపు ఈ కౌంటర్‌పై పడింది. నిఫ్టీతో పోల్చితే మెరుగైన ప్రదర్శన, నిరోధ స్థాయిలో సుదీర్ఘకాలం అక్యుములేషన్ జరగటం సానుకూల అంశాలు. పైగా షేరు విలువ అప్పర్ బొలింజర్ బ్యాండ్‌ను అధిగమించటం బుల్లిష్‌నెస్‌ను సూచిస్తోంది. మూమెంటమ్ ట్రేడర్లు ఈ కౌంటర్‌లోకి రూ.810 స్థాయిలో ఎంటర్ అయి రూ.880/940 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.790 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

డిక్సన్ టెక్నాలజీస్: కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ తయారీలో ఉన్న ఈ సంస్థకు భారీగా కొత్త ఆర్డర్లు వస్తున్నాయి. డెహ్రాడూన్‌లోనూ కొత్త ప్లాంట్‌ను ఆరంభించే యోచనలో ఉంది. గత ఏడాది ఆరంభం నుంచి ఈ కౌంటర్ అప్‌ట్రెండ్‌లో కొనసాగుతోంది. వాల్యూమ్‌ను బట్టి స్టాక్ డిమాండ్‌ను అర్థం చేసుకోవచ్చు. ట్రేడర్లు ఈ కౌంటర్‌లోకి రూ.6,950/6,980 శ్రేణిలో ప్రవేశించి రూ.7,120/7,355 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.6,900 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

టైటాన్: ఈ కౌంటర్‌కు చాలా సానుకూలతలు కనిపిస్తున్నాయి. నిఫ్టీతో పోల్చితే మెరుగ్గా ట్రేడవుతోంది. అప్పర్ బొలింజర్ బ్యాండ్‌ను క్రాస్ చేసింది. చివరి ఐదు సెషన్లలో ట్రేడింగ్, డెలివరీ వాల్యూమ్ ఒకటిన్నర రెట్లు పెరిగింది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లోకి రూ.3,700 స్థాయిల్లో ప్రవేశించి రూ.3,830/3,950 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.3,675 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

గ్రాసిమ్: గత వారం ఈ కౌంటర్ సరికొత్త జీవిత కాల గరిష్ఠాన్ని అందుకుంది. పైగా రూ.2,000 స్థాయిలో మంచి అక్యుములేషన్ జరుగుతోంది. వాల్యూమ్స్ కూడా పెరుగుతున్నాయి. జెఫ్రీస్ సహా అనేక రేటింగ్ సంస్థలు.. కంపెనీ షేరు టార్గెట్ ధరను పెంచి 'బై' కాల్ ఇచ్చాయి. మదుపరులు ఈ కౌంటర్‌లోకి రూ.2,240 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.2,380/2,500 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.2,222 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం, మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

దిక్సూచి
హైదరాబాద్ ● సోమవారం 4 మార్చి 2024
diksuchi@andhrajyothy.com

డీఎస్సీ 2024

సరైన ప్లానింగ్‌తోనే సక్సెస్



తెలంగాణ రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ- పాత డీఎస్సీ నోటిఫికేషన్‌ను రద్దు చేసింది. అదనంగా పోస్టులను మంజూరు చేసి నూతన నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. పదేళ్ల తరవాత డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలయింది. సుదీర్ఘకాలంగా ప్రిపేర్ అవుతూ ఉపాధ్యాయ వృత్తి కోసం నిబద్ధతతో కృషి చేస్తున్న అభ్యర్థులకు ఇది సువర్ణావకాశం.

నాగరికత గమనంలో జ్ఞానాన్ని ఒక తరం నుంచి మరో తరానికి పరిచయం చేయడంలో ఉపాధ్యాయుని పాత్ర అద్వితీయం. కొఠారి కమిషన్ చెప్పినట్లుగా 'ఒక దేశ భవిష్యత్, తరగతి గదిలోనే నిర్ణయించబడుతుంది'. పవిత్రమైన ఈ వృత్తిలోకి చేరాలనుకునేవారు, ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ అవకాశం కోసం సంసిద్ధమౌతున్న అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

నోటిఫికేషన్

మొత్తం 11,062 పోస్టులు ప్రకటించారు. వీటిలో 6,508 ఎస్‌జీటీ, 2,629 స్కూల్ అసిస్టెంట్, 727 లాంగ్వేజ్ పండిట్, 182 పీఈటీ, 220 స్పెషల్ కేటగిరీ స్కూల్ అసిస్టెంట్స్, 796 స్పెషల్ కేటగిరీ ఎస్‌జీటీ పోస్టులు ఉన్నాయి. అభ్యర్థులు ఏప్రిల్ 2లోపు దరఖాస్తు చేసుకోవాలి. పరీక్ష తేదీని ఇంకా ప్రకటించలేదు.

2024 డీఎస్సీ ప్రత్యేకతలు

- డీఎస్సీ 2023 నోటిఫికేషన్‌ను రద్దు చేసినట్లు ప్రకటించారు. గతంలో దరఖాస్తు చేసుకున్నవారు తిరిగి దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదు.
- ఈ నోటిఫికేషన్‌లో ప్రాథమిక తరగతులకు, సెకండరీ స్థాయి తరగతులకు ప్రత్యేక టీచర్ల నియామకానికి అనుమతినిచ్చారు.
- పాఠశాల విద్యాశాఖ ప్రకటించిన ఈ పోస్టులన్నీ డీఎస్సీ లేదా జిల్లా ఎంపిక కమిటీ ద్వారా మాత్రమే భర్తీ చేస్తారు.
- ప్రతి పోస్టుకూ దరఖాస్తు ఫీజును రూ.1,000గా నిర్ణయించారు. ఫీజు చెల్లించడం కోసం ఆన్‌లైన్ విధానాన్ని అనుమతించారు. వివరాలకు సంబంధించి వివిధ వెబ్‌సైట్లను నోటిఫికేషన్‌లో పొందుపరిచారు.
- ఈ నోటిఫికేషన్‌లో వయోపరిమితిని పెంచడం అభ్యర్థులకు ప్రధాన ఊరటగా చెప్పవచ్చు. 18 నుంచి 46 ఏళ్ల మధ్య ఉన్న అభ్యర్థులను దరఖాస్తుకు అనుమతించారు. ప్రభుత్వ ఉద్యోగంలో ఉన్న వారికి అయిదేళ్లు, ఎక్స్ సర్వీస్‌మెన్‌కు మూడేళ్లు, ఎస్సీ/ఎస్టీ/బీసీ/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు మరో అయిదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల మినహాయింపునిచ్చారు.
- ఈసారి పరీక్షను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నారు. మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నల్లగొండ, సంగారెడ్డి కేంద్రాల్లో సీబీఆర్‌టీ మోడ్‌లో పరీక్ష ఉంటుంది. అభ్యర్థులు సెంటర్ల ఎంపికకు క్రమానుగత శ్రేణిలో ప్రాముఖ్యమిచ్చే వీలుంది. అయినప్పటికీ నిర్వహణ బోర్డ్ తమ సౌలభ్యాన్ని అనుసరించి కేంద్రాలను కేటాయిస్తుంది.
- పరీక్ష సిలబస్, అర్హత, రిజర్వేషన్ వివరాలను వెబ్‌సైట్‌లోని ఇన్ఫర్మేషన్ బులిటన్‌లో చూడవచ్చు. ఇది మార్చి 4నుంచి అందుబాటులోకి వస్తుంది. పరీక్ష తేదీలను త్వరలో ప్రకటిస్తారు.

ప్రిపరేషన్

- ఏ పోటీ పరీక్షలోనైనా విజయం పొందాలంటే ప్రిపరేషన్ అత్యవసరం. పరీక్షకు నిర్దేశించిన సిలబస్‌ను అర్థం చేసుకోవడంలోనే సగానికిపైగా విజయం సాధించినట్లు భావించాలి. దీనికోసం అభ్యర్థులు విశ్లేషణ సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలి.

డీఎస్సీ సిలబస్‌ను నాలుగు భాగాలుగా వర్గీకరించుకోవాలి.

- మొదటి భాగం- ఉపాధ్యాయ వృత్తికి సంబంధించిన అంశాలు
- రెండో భాగం- సమకాలీన ప్రపంచ అంశాలు
- మూడో భాగం- బోధన వృత్తికి సంబంధించిన అంశాలు
- నాలుగో భాగం- పాఠ్య పుస్తక జ్ఞానం

ఉపాధ్యాయ వృత్తికి సంబంధించిన అంశాలు

- విద్య దృక్పథాలుగా పిలిచే ఈ అంశంలో విద్య తాత్విక, సామాజిక, వైజ్ఞానిక అంశాలు అంతర్భాగాలు. విద్యావ్యవస్థపై ఒక ప్రాపంచిక అవగాహన, వృత్తి సంబంధిత ప్రాథమిక అంశాలు, తరగతి గదిలోని అభ్యాసకుల అభిరుచులు, ఆసక్తులు, అవసరాలు వంటివి ప్రధానమైనవి.
- డీఎడ్, బీఎడ్ కోర్సుల్లో చదివిన విద్యా ఆధారాలు, విద్యా మనోవైజ్ఞానిక శాస్త్ర అంశాలను తరగతి అన్వయంలో అధ్యయనం చేయాలి.

అభ్యర్థులకు ప్రత్యేక సూచనలు

- సిలబస్‌ను అర్థం చేసుకోవడానికి అధిక ప్రాధాన్యమివ్వాలి. తెలియని అంశాలకు ఎక్కువ సమయాన్ని కేటాయించాలి.
- పర్‌స్పెక్టివ్ ఇన్ ఎడ్యుకేషన్‌లో తాత్విక, మనోవైజ్ఞానిక అంశాల అవగాహనలో విశ్లేషణ సామర్థ్యాలకు అధిక ప్రాధాన్యమివ్వాలి.
- మెథడాలజీ ప్రిపరేషన్ కోసం నిష్ణాతులైన అధ్యాపకులు రాసిన పుస్తకాలను మాత్రమే చదవండి.
- ప్రభుత్వం ప్రచురించిన పాఠ్యపుస్తకాలను- సమాజం, సాహిత్యం, విజ్ఞాన రంగాల్లో వస్తున్న మార్పులకు అనుగుణంగా మార్చుకోండి
- అభ్యర్థులు తమకంటూ ఒక ప్రత్యేక ప్రిపరేషన్ క్యాలెండర్‌ను ఏర్పాటు చేసుకొని ప్రిపరేషన్ కొనసాగించడం ద్వారా విజయానికి చేరువయ్యే అవకాశాలుంటాయి.

గత ప్రశ్న పత్రాలు; టెట్, సీటెట్ ప్రశ్నపత్రాలు ప్రిపరేషన్‌కు ఉపయోగిస్తాయి.

సమకాలీన అంశాలు

- జీకే, కరెంట్ ఆఫైర్స్ అంశాలపై ప్రత్యేక శ్రద్ధ ఉంచాలి. రెగ్యులర్‌గా న్యూస్ పేపర్ చదవాలి. జీకే మ్యాగజైన్స్‌ను రెగ్యులర్‌గా పరిశీలించాలి.
- వాస్తవంగా డీఎడ్, బీఎడ్ ఈ అంశాలకు సంబంధించిన ప్రశ్నల సాధనలో వెనకబడి ఉంటారు. పాఠ్యాంశాలు, ఫిక్స్‌డ్ విజ్ఞాన అంశాలకు ఎక్కువగా ప్రాధాన్యమిస్తారు. జీకే, కరెంట్ అఫైర్స్ ప్రశ్నల సరళిలో అనేక మార్పులు వచ్చాయి. అభ్యర్థులు న్యూస్ పేపర్ పఠనాన్ని జీవన పరంపరలో ఒక భాగంగా చేసుకోగలగాలి.
- పర్‌స్పెక్టివ్ ఎడ్యుకేషన్ లేదా విద్యాదృక్పథాలు, జీకే, కరెంట్ అఫైర్స్ అంశాలు విజయాన్ని డిసైడ్ చేస్తాయి. కాబట్టి వీటిపై ప్రత్యేక దృష్టి నిలపాలి.

బోధన అంశాలు

- మెథడాలజీ/పెడగాగీ అంశాలు తరగతి అన్వయానికి సంబంధించి ఉంటాయి. పాఠ్యాంశాలను బోధించే క్రమంలో ఉపయోగించే బోధన పద్ధతులు, అభ్యసనాలు, అభ్యసన పరికరాలపై అవగాహన, శిశు కేంద్రీకృత అభ్యసన విధానాలపై అభ్యర్థులు పూర్తిగా పట్టు సాధించాలి. దీనికోసం తెలుగు అకాడమీ పుస్తకాలు లేదా సబ్జెక్ట్ నిపుణులు రాసిన పుస్తకాలు, గత ప్రశ్నపత్రాలు పరిశీలించాలి.

పాఠ్యాంశ సంబంధిత జ్ఞానం

అభ్యర్థులు ఎక్కువగా తమ సమయాన్ని ఈ అంశాలపై కేంద్రీకరిస్తారు. వాస్తవంగా మార్కుల పరంగా అత్యధిక భాగం ఈ విభాగానికి చెందినదే.

అభ్యర్థులు డీఎడ్‌కు సంబంధించి పోస్టుల కోసం ప్రాథమిక తరగతుల నుంచి హైస్కూల్ స్థాయి వరకు; బీఎడ్‌కు సంబంధించిన పోస్టులకు హైస్కూల్ స్థాయి నుంచి ఇంటర్ స్థాయి వరకు పాఠ్యపుస్తకాలు చదవాలి. ఈ పుస్తకాల పఠనంలో విశ్లేషణ సామర్థ్యం, ప్రశ్నల సరళికి అనుగుణంగా సమాధానాల గుర్తింపుపై అవగాహన అవసరం.

పాఠ్యాంశ సంబంధిత జ్ఞానం
అభ్యర్థులు ఎక్కువగా తమ సమయాన్ని ఈ అంశాలపై కేంద్రీకరిస్తారు. వాస్తవంగా మార్కుల పరంగా అత్యధిక భాగం ఈ విభాగానికి చెందినదే. అభ్యర్థులు డీఎడ్‌కు సంబంధించి పోస్టుల కోసం ప్రాథమిక తరగతుల నుంచి హైస్కూల్ స్థాయి వరకు; బీఎడ్‌కు సంబంధించిన పోస్టులకు హైస్కూల్ స్థాయి నుంచి ఇంటర్ స్థాయి వరకు పాఠ్యపుస్తకాలు చదవాలి. ఈ పుస్తకాల పఠనంలో విశ్లేషణ సామర్థ్యం, ప్రశ్నల సరళికి అనుగుణంగా సమాధానాల గుర్తింపుపై అవగాహన అవసరం.



డాక్టర్ రియాజ్
సీనియర్ ఫ్యాకల్టీ, అకడమిక్ డైరెక్టర్,
5 మంత్ర కెరీర్ పాయింట్, హైదరాబాద్

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

గగన్‌యాన్

అంతరిక్షంలోకి వ్యోమగాములను పంపి, వారిని క్షేమంగా తిరిగి భూమికి తీసుకువచ్చేందుకు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) తొలిసారి చేపట్టబోతున్న ప్రయోగమే 'గగన్‌యాన్'



భారత అంతరిక్షరంగ పరిశోధనలను మరింత ముందుకు తీసుకువెళ్లేందుకు, భవిష్యత్తులో 2035 నాటికి అంతరిక్షంలో సొంత స్పేస్ స్టేషన్‌ను ఏర్పాటు చేసుకొనేందుకు, 2040 నాటికి మానవ సహిత చంద్రమండల యాత్రకు సంసిద్ధమయ్యేందుకు గగన్‌యాన్‌ను ఒక నాంది ప్రస్థానంగా చెప్పుకోవచ్చు. 2006లో పునాది పడిన ఈ ప్రాజెక్ట్ అంచనా వ్యయం రమారమి పదివేల కోట్లు.

వివిధ దశల్లో భద్రత పరీక్షలు

2025లో చేపట్టనున్న ఈ ప్రయోగానికి ముందు భద్రతపరంగా మరో రెండు డమ్మీ ప్రయోగాలను ఇస్రో చేపట్టనుంది. 2024 జూలైలో జీ1(గగన్‌యాన్-1) ద్వారా 'వ్యోమమిత్ర' అనే రోబోను కలిగి ఉన్న తొలి గగన్‌యాన్ క్యాప్సూల్ ఆర్బిటాల్ టెస్ట్ ఫ్లయిట్‌ను, 2024 డిసెంబర్‌లో జీ2(గగన్‌యాన్-2) అనే రెండో గగన్‌యాన్ క్యాప్సూల్ ఆర్బిటాల్ టెస్ట్ ఫ్లయిట్‌ను పంపనున్నారు. 2025లో జీ3 అనే మూడో దానితో ఈ డమ్మీ ప్రయోగాలు ముగుస్తాయి. ఇవేకాక మరో 20 రకాలైన భద్రతా ప్రయోగాలూ ఇస్రో చేపట్టనుంది. చివరిగా వ్యోమగాములతో కూడిన గగన్‌యాన్ ప్రయోగాన్ని 2025 చివరినాటికి చేపట్టనున్నారు.

గత అక్టోబరులో టెస్ట్ వెహికల్ డెమాన్‌స్ట్రేషన్-1(టీవీ-డీ1) (లేదా) టెస్ట్ వెహికల్ అబార్ట్ మిషన్-1 అని పిలిచే ప్రయోగాన్ని చేపట్టి 'క్రూ ఎస్కేప్ సిస్టమ్' పనితీరును ఇస్రో విజయవంతంగా పరీక్షించింది. ఏదైనా అనుకోని ప్రమాదం సంభవిస్తే వ్యోమగాములు ఉండే క్రూ మాడ్యూల్‌ను రాకెట్ నుంచి వేరుచేసి, సురక్షితంగా భూమిపైకి తీసుకువచ్చే ప్రక్రియే 'క్రూ ఎస్కేప్ సిస్టమ్'. దీనికి అత్యంత వేగంగా ప్రతిస్పందించే 'క్విక్ రియాక్టింగ్ సాలిడ్ మోర్టార్'లను ఇస్రో అభివృద్ధి చేసింది. ఇవి చాలా వేగంగా ప్రజ్వరిల్లి అధిక థ్రస్ట్‌ను ఉత్పత్తి చేస్తాయి. తద్వారా ప్రమాద సమయాల్లో క్రూ మాడ్యూల్ తక్షణం రాకెట్ నుంచి వేగంగా విడివడి భూమి వైపు ప్రయాణించడానికి వీలవుతుంది. ఈ క్రమంలో వివిధ దశల్లో శక్తివంతమైన పారాచూట్‌లు విచ్చుకొని క్రూ మాడ్యూల్‌ను సురక్షితంగా బంగాళాఖాతంలో జారవిడుస్తాయి.

గగన్‌యాన్-ప్రయోజనాలు

- గగన్‌యాన్ విజయవంతమైతే వ్యోమగాములను అంతరిక్షంలోకి పంపే సామర్థ్యం సాధించిన అమెరికా, రష్యా చైనా సరసన భారత్ కూడా సగర్వంగా చేరుతుంది.
- గగన్‌యాన్ ప్రయోగ విజయం తదుపరి భారతదేశ మానవసహిత అంతరిక్ష ప్రయోగాలపరంగా, ఖగోళ అన్వేషణపరంగా చేపట్టబోయే అనేక ప్రాజెక్టుకు ఊతమవుతుంది.
- అంతర్జాతీయంగా భారతదేశ సాఫ్ట్‌పవర్ ఇనుమడించి, అంతర్జాతీయ దౌత్య, వ్యూహాత్మక సంబంధాలను బలపరుస్తుంది.
- శాస్త్ర, సాంకేతిక రంగాలపైకి విద్యార్థుల ఆసక్తిని మళ్లించడానికి ఉపకరిస్తుంది. తద్వారా భావితరాల వైజ్ఞానిక నైపుణ్యాలు మరింత మెరుగవుతాయి. నవకల్పనలకు దారితీస్తుంది.
- అనేక రంగాల సమన్వయంతో, సహకారంతో జరుగుతున్న ఈ ప్రయోగం వల్ల భారీస్థాయిలో ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.
- దేశీయంగా రూపొందించిన వాహకనౌక, సాంకేతికతలు గల ఈ ప్రయోగం దేశ ఆత్మనిర్భర్ భారత్, మేకిన్ ఇండియా సామర్థ్యాలను చాటిచెబుతుంది.



అనంతరం ఇండియన్ నేవి ఈ క్రూమాడ్యూల్‌ను వెలికితీస్తుంది. ఈ టీవీ-డీ1 ప్రయోగం ద్వారా వ్యోమగాములు లేని డమ్మీ క్రూ మాడ్యూల్‌ను వినియోగించి ఈ ప్రక్రియను విజయవంతంగా పరీక్షిస్తారు.

అదేవిధంగా వ్యోమగాముల భద్రతను దృష్టిలో ఉంచుకొని గగన్‌యాన్-1 డమ్మీ ప్రయోగంలో భాగంగా తొలుత వ్యోమగాముల స్థానంలో 'వ్యోమమిత్ర' అనే హ్యూమనాయిడ్ రోబోను క్రూ మాడ్యూల్‌లో ఉంచి అంతరిక్షంలోకి పంపనున్నారు. తద్వారా ఈ రోబో, మైక్రో గ్రావిటీ ఎక్స్‌పెరిమెంట్స్, మాడ్యూల్ పారామీటర్స్‌ను పరీక్షించి వ్యోమగాములు ఏదైనా అసౌకర్యానికి, ప్రమాదానికి గురయ్యే అవకాశాలు ఉంటే గుర్తిస్తుంది.

వివిధ సంస్థల సహకారం

ఈ ప్రయోగంలో భాగంగా అంతరిక్షంలోకి పంపేందుకు నలుగురు వ్యోమగాముల ను ఎంపిక చేశారు. వీరు గ్రూప్ కెప్టెన్ ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్, గ్రూప్ కెప్టెన్ అజిత్ కృష్ణన్, గ్రూప్ కెప్టెన్ అంగద్ ప్రతాప్, వింగ్ కమాండర్ శుభాన్షు శుక్లా ఉన్నారు.

భారతదేశంలో వ్యోమగాముల శిక్షణ సౌకర్యాలకు సంబంధించిన సాంకేతిక వ్యవస్థల కొరత కారణంగా ఇస్రో, రష్యా స్పేస్ ఏజెన్సీ 'రాస్ కోస్ మాస్' అనుబంధ సంస్థ 'గ్లావ్ కోస్ మాస్'తో ఒప్పందం చేసుకొని ఫిబ్రవరి 2020 - మార్చి 2021 మధ్యకాలంలో ఈ నలుగురు వ్యోమగాములకు అంతరిక్ష పరిస్థితుల్లో మనుగడ సాగించేందుకు అవసరమైన తర్ఫీదును ఇప్పించారు.

అంతేకాక ఈ గగన్‌యాన్ మిషన్‌లో అనేక భారతీయ సంస్థలు కూడా సాంకేతిక, పరిశోధన, అభివృద్ధిపరంగా విస్తృత సేవలు అందిస్తున్నాయి. అవి- ఇండియన్ ఎయిర్‌ఫోర్స్, ఇండియన్ నేవి, భారత వాతావరణ సంస్థ, ఇండియన్ కోస్ట్‌గార్డ్, షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ, డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్, సీఎస్ఐఆర్ ల్యాబ్, అనేక విద్య, పారిశ్రామిక సంస్థలు.

ప్రయోగం-దశలు

'జీఎస్ఎల్‌వీ ఎంకె-3(ఎల్‌వీఎం-3)' లాంచ్ వెహికల్ ద్వారా ఆర్బిట్ మాడ్యూల్‌ను శ్రీహరికోట అంతరిక్ష ప్రయోగకేంద్రం నుంచి ప్రయోగిస్తారు. ఇది భూమికి 400 కిలోమీటర్ల ఎత్తులో ఉన్న లోఎర్త్ ఆర్బిట్(దిగువ భూకక్ష్య)లోకి ఆర్బిట్ మాడ్యూల్‌ను 16 నిమిషాల్లో ప్రవేశపెడుతుంది. ఈ కక్ష్యలో వ్యోమగాములతో కూడిన, భూమిని పోలిన వాతావరణం ఉంటే క్రూ మాడ్యూల్, క్రూ మాడ్యూల్‌కు సాంకేతిక సహకారం అందించే సర్వీస్ మాడ్యూల్‌ల కలయిక అయిన ఆర్బిట్ మాడ్యూల్ మూడు నుంచి ఏడు రోజులపాటు(పరిస్థితులను బట్టి) ఉంటుంది. తదుపరి దిశ మార్చుకొని, భూమిపైకి తిరిగి రావడానికి సమాయత్తం అవుతుంది. భూమికి తిరిగి రావడానికి కావాల్సిన త్వరణం కోసం డీబూస్ట్ ప్రక్రియ ప్రారంభమై సర్వీస్ మాడ్యూల్ నుంచి క్రూ మాడ్యూల్ వేరు పడుతుంది. తదుపరి పారాచూట్స్ విచ్చుకొని క్రూ మాడ్యూల్‌ను భూమి వైపుగా తరలించి గుజరాత్ వద్ద అరేబియా సముద్రంలో పడుతుంది. క్రూ మాడ్యూల్ నుంచి వ్యోమగాములను రికవరీ ఆపరేషన్ ద్వారా నేవిదళం సురక్షితంగా వెలికితీయడంతో గగన్‌యాన్ ప్రయోగం సంపూర్ణమవుతుంది. డీబూస్ట్ తరవాత 36 నిమిషాల వ్యవధిలో క్రూ మాడ్యూల్ సముద్రంలో పడటం జరుగుతుంది.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్


టీఎస్‌పీఎస్సీ/ ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

మిస్సింగ్ నంబర్ టెస్ట్

రీజనింగ్

పార్ట్-3

1. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి?



ఎ) 162 బి) 136 సి) 145 డి) 174


సమాధానం: (ఎ)

వివరణ : ప్రతి డయాగ్రమ్ పై అంకెల లబ్ధం, కింది అంకెల లబ్ధాలను కూడితే వృత్తం మధ్యలోని సంఖ్య వస్తుంది.

8x4x2=64 7x1x6=42 9x4x2=72
3x6x5=90 8x2x5=80 6x5x3=90
64+90=154 42+80=122 72+90=162

కాబట్టి సమాధానం అవుతుంది.

2. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి?




ఎ) 229 బి) 349 సి) 254 డి) 529

సమాధానం: (ఎ)

వివరణ : పైన వృత్తంలో అంకెలను ఒక సమూహంగా, వృత్తానికి కింద గల అంకెను ఒక సమూహంగా రాసుకొని తీసివేసిన వృత్తంలో సంఖ్య వస్తుంది. 426-351=75, 756-543=213 కాబట్టి 574-345=229

3. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి?



ఎ) 32 బి) 48 సి) 56 డి) 71

సమాధానం: (సి)


వివరణ : చతురస్రానికి నాలుగు వైపుల గల అంకెల లబ్ధాన్ని 10తో భాగిస్తే చతురస్రంలోని సంఖ్య వస్తుంది.

$5\times4\times2\times3=\frac{120}{10}=12$

$8\times3\times5\times6=\frac{720}{10}=72$

కావున $7\times4\times10\times2=\frac{560}{10}=56$ సమాధానము అవుతుంది.

4. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి?



ఎ) 51 బి) 84 సి) 60 డి) 96

సమాధానం: (ఎ)

వివరణ : వృత్తానికి నాలుగు వైపుల గల విడివిడి అంకెల వర్గాలను కూడితే వృత్తంలోని సంఖ్య వస్తుంది.

$6^2+3^2+10^2+9^2=226$
$8^2+6^2+7^2+2^2=153$
$5^2+1^2+4^2+3^2=51$

5. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి?

L_{12}	N_{34}	M_{16}
M_{34}	L_{30}	N_{33}
N_6	M_8	?


ఎ) L_7 బి) N_6 సి) M_4 డి) L_6

సమాధానం : (ఎ)

వివరణ : ప్రతి వరుసలో నిలువుగా అడ్డంగా L, M, N ప్రతి వరుసలోను వస్తున్నాయి. కాబట్టి 3వ వరుస చివర L రావాలి. ప్రతి వరుసలో నిలువుగా గల మొదటి రెండు సంఖ్యల మొత్తం.

12+14=36 36 అనేది 6^2
34+30=64 64 అనేది 8^2
అదే విధంగా
16+33=49 49 అనేది 7^2
కావున సమాధానం L_7

6. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి?




ఎ) 55 బి) 46 సి) 62 డి) 58

సమాధానం: (ఎ)

వివరణ : మొదటి డయాగ్రామ్‌లో
$5^2+7^2=25+49=74-32=42$
రెండో డయాగ్రామ్‌లో
$6^2+4^2=36+16=52-25=27$
కాబట్టి మూడో డయాగ్రామ్‌లో
$9^2+3^2=81+9=90-35=55$ సమాధానం అవుతుంది.

7. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి?






ఎ) 25 బి) 27 సి) 34 డి) 45

సమాధానం: (బి)

వివరణ : ప్రతి డయాగ్రామ్‌లో పైన గల రెండు సంఖ్యల లబ్ధం నుంచి కింది గల రెండు సంఖ్యల మొత్తాన్ని తీసివేసిన చిన్న వృత్తంలోని సంఖ్య వస్తుంది.

7x6=42, 10+14=24 (42-24=18)
9x4=36, 8+12=20 (36-20=16)
కావున 5x13=65, 16+22=38, (65-38=27)

8. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి?




ఎ) 56 బి) 58 సి) 62 డి) 53

సమాధానం: (డి)

వివరణ : మొదటి డయాగ్రామ్‌లో
32+23=55 41+14=55
రెండో డయాగ్రామ్‌లో
36+63=99 54+45=99
కాబట్టి మూడో డయాగ్రామ్‌లో 71+17=88, 35+53=88

9. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి?




ఎ) 20 బి) 18 సి) 16 డి) 15

సమాధానం: (బి)

వివరణ : వృత్తం చుట్టూ గల సంఖ్యలు వివిధ సంఖ్యల వర్గాలు. వృత్తం లోపల గల పెద్ద సంఖ్య వృత్తం చుట్టూ వున్న సంఖ్యల వర్గ మూలాలను కూడగా వస్తుంది.

$25=5^2, 4=2^2, 36=6^2, 121=11^2$
5+2+6+11=24
$9=3^2, 81=9^2, 144=12^2, 64=8^2$
3+9+12+8=32
కావున $4=2^2, 16=4^2, 25=5^2, 49=^2$
2+4+5+7=18 సమాధానం అవుతుంది.

10. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి?



ఎ) 82 బి) 68 సి) 74 డి) 86

సమాధానం: (ఎ)

వివరణ : మొదటి డయాగ్రామ్‌లో
4x6=24 7x8=56 24+56=80
రెండో డయాగ్రామ్‌లో
3x2=6 9x5=45 6+45=51
కాబట్టి మూడో డయాగ్రామ్‌లో
6x7=42 8x5=40 42+40=82
సమాధానం అవుతుంది.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్
సీనియర్ ఫ్యాకల్టీ

सत्यमेव जयते
భారత ప్రభుత్వం

అభివృద్ధి చెందిన భారతదేశం అభివృద్ధి చెందిన తెలంగాణ దిశగా కీలక అడుగులు



రూ. 56 వేల కోట్లకు పైగా

విద్యుత్ మరియు మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల బహుమానం

గౌరవనీయ ప్రధానమంత్రి

శ్రీ నరేంద్ర మోదీ

ద్వారా

సోమవారం, 4 మార్చ్, 2024 ఉదయం 10.45 గంటలకు తెలంగాణ, ఆదిలాబాద్ లో

జాతికి అంకితం

- ఎన్‌టిపిసి తెలంగాణ STPP యొక్క యూనిట్ -02 (800 MW), దశ-1, పెద్దపల్లి, తెలంగాణ
- 660 మెగావాట్ల ఎన్‌టిపిసి నార్త్ కరణ్ పురా ఎస్‌టిపిపి చతరా, జార్ఖండ్ లోని యూనిట్ -02
- ఫ్లై యాష్ ఆధారిత లైట్ వెయిట్ అగ్రిగేట్ ప్లాంట్, ఎన్‌టిపిసి సిపట్, ఛత్తీస్ గఢ్
- సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ నీటితో గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్, ఎన్‌టిపిసి నేత్ర. ఉత్తర ప్రదేశ్
- అంబారి-ఆదిలాబాద్ మధ్య పింపల్ కుట్టి రైల్వే లైన్ విద్యుదీకరణ

శంకుస్థాపన

- ఎన్‌టిపిసి సింగ్రౌలి సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్ట్, స్టేజ్ -III, (2x800 మెగావాట్లు)
- ఫ్లూ గ్యాస్ CO_2 తో 4G ఇథనాల్ ప్లాంట్, ఎన్‌టిపిసి లారా
- ఫ్లై యాష్ ఆధారిత FALG (ఫ్లై యాష్ - లైమ్ - జిప్సం) అగ్రిగేట్ ప్లాంట్, ఎన్‌టిపిసి కోర్బా
- సముద్ర జలంతో గ్రీన్ హైడ్రోజన్ ప్లాంటుకు, ఎన్‌టిపిసి సింహాద్రి
- 600 మెగావాట్ల లలిత్ పూర్ సోలార్ పవర్ ప్రాజెక్ట్, టుస్కో
- కర్నూల్ పవన విద్యుత్ జోన్ / సోలార్ ఎనర్జీ జోన్ (ఆంధ్రప్రదేశ్) కోసం ట్రాన్స్మిషన్ సిస్టమ్-పవర్ గ్రిడ్
- 15 మెగావాట్ల సంగల్ ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్ట్
- 382 మెగావాట్ల సున్ని డ్యాం హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్ట్, ఎస్‌జేవిఎన్
- 70 మెగావాట్ల అస్సాం సోలార్ పవర్ ప్రాజెక్ట్, ఎస్‌జేవిఎన్
- NH-353బి, ఎంఓఆర్‌టిహెచ్, ఆదిలాబాద్ – బెలా సెక్షన్, కిమీ. 0/000 నుంచి కిమీ. 33/000లు 2-లేన్/4లేన్ కు విస్తరణ.
- NH-163, ములుగు ట్రైబల్ డిస్ట్రిక్ట్ లో, ఎంఓఆర్‌టిహెచ్ (జగన్నాథపురం నుంచి చెరుకూరు సెక్షన్) కిమీ 279/150 నుంచి 290/500 కు 2 లేన్ గా విస్తరణ.
- జలౌన్ అల్ట్రా మెగా రెన్యూవబుల్ ఎనర్జి పవర్ పార్క్ (1200 మెగావాట్లు), బిఎస్‌యుఎల్

ప్రారంభోత్సవం

- 765/400/220 KV GIS సబ్-స్టేషన్, రాంపూర్ మరియు 400/220/132 KV GIS, సబ్‌స్టేషన్, అసోసియేటెడ్ ట్రాన్స్‌మిషన్ లైన్‌లతో సంభాల్ నిర్మాణం కోసం ట్రాన్స్‌మిషన్ సిస్టమ్, పవర్ గ్రిడ్
- మీరట్ – సింభావలి ట్రాన్స్మిషన్ లిమిటెడ్, పవర్ గ్రిడ్
- 50 మెగావాట్ల గుజ్రాయ్ సోలార్ పవర్ స్టేషన్, ఎస్‌జేవిఎన్
- 75 మెగావాట్ల గుర్హా సోలార్ పవర్ స్టేషన్, ఎస్‌జేవిఎన్
- 75 మెగావాట్ల పరాసన్ సోలార్ పవర్ స్టేషన్, ఎస్‌జేవిఎన్
- చండీగఢ్ జిఐఎస్ నుండి 400/220 కెవి పంచకుల పవర్ గ్రిడ్ సబ్ స్టేషన్, పవర్ గ్రిడ్ వరకు 220 కెవి డి/సి లైన్‌తో పాటు కేంద్రపాలిత ప్రాంతం చండీగఢ్ వద్ద 220/22 కెవి జిఐఎస్ ఏర్పాటు.
- ఉత్తర ప్రాంతంలో వ్యవస్థను బలోపేతం చెయ్యడం (ఎన్ఆర్ఎస్ఎస్) - XXXV, పవర్ గ్రిడ్
- కోడెర్మా థర్మల్ పవర్ స్టేషన్ (2x500 మెగావాట్లు), DVC యొక్క రెట్రోఫిటింగ్ పొల్యూషన్ కంట్రోల్ సిస్టమ్-FGD యూనిట్-I (500 మెగావాట్లు)
- కొప్పల్ విండ్ ఎనర్జీ జోన్ (కర్ణాటక) (2500 మెగావాట్లు) (SPV - కొప్పల్-నరేంద్ర ట్రాన్స్‌మిషన్ లిమిటెడ్) లోని రెన్యూ నుండి విద్యుత్ తరలింపు
- కల్లాం ట్రాన్స్మిషన్ లిమిటెడ్, ఇండిగ్రిడ్
- ఉత్తర ప్రాంతంలో వ్యవస్థను బలోపేతం చెయ్యడం (ఎన్ఆర్ఎస్ఎస్) - XL, పవర్ గ్రిడ్
- 380 మెగావాట్ల సోలార్ పవర్ ప్రాజెక్ట్, జైసల్మీర్, రాజస్థాన్, ఎన్‌హెచ్‌పిసి.
- ఉత్తర ప్రాంతంలో వ్యవస్థను బలోపేతం చేసే (ఎన్ఆర్ఎస్ఎస్- XXXVII) పథకం, పవర్ గ్రిడ్
- 60 మెగావాట్ల నైత్వార్ మోరి హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్ట్, ఎస్‌జేవిఎన్
- ఈశాన్య ప్రాంతాన్ని బలోపేతం చేసే పథకం - XII (ఎన్ఈఆర్ఎస్ఎస్-XII), పవర్ గ్రిడ్

ప్రోజెక్టుల ప్రయోజనాలు

- అత్యధిక సామర్థ్యం కలిగిన ఎన్‌టిపిసి థర్మల్ ప్లాంట్ ద్వారా తెలంగాణాకు 85% విద్యుత్ అందించడం
- గ్రిడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను బలోపేతం చేయడం ద్వారా 24x7 విశ్వసనీయమైన విద్యుత్ సరఫరాను నిర్ధారించడం
- తెలంగాణా మరియు ఇతర రాష్ట్రాలలో ఉద్యోగ అవకాశాల రూపకల్పన
- దేశం యొక్క సామాజిక-ఆర్థిక అభివృద్ధి
- సుస్థిర విద్యుత్ ఉత్పాదన ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించడం
- తెలంగాణా ప్రాంతంలో రైలు, రోడ్డు అనుసంధానాన్ని మెరుగుపరచడం

గౌరవ ప్రముఖుల సమక్షంలో

డాక్టర్ తమిళిసై సౌందరరాజన్
గవర్నర్, తెలంగాణ

శ్రీ ఎ. రేవంత్ రెడ్డి
ముఖ్యమంత్రి, తెలంగాణ

శ్రీ ఆర్. కే. సింగ్
కేంద్ర మంత్రి, విద్యుత్ మంత్రిత్వ శాఖ,
నూతన మరియు పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ


శ్రీ జి. కిషన్ రెడ్డి
కేంద్ర మంత్రి, సాంస్కృతిక,
పర్యాటక మరియు ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖ

శ్రీ క్రిషన్ పాల్ గుర్జర్
కేంద్ర సహాయ మంత్రి
విద్యుత్ మరియు భారీ పరిశ్రమల శాఖ

దయచేసి కార్యక్రమం యొక్క ప్రత్యక్ష ప్రసారం వీక్షించండి DD NEWS లో



పాక్ ప్రధానిగా షహబాజ్



ఇస్లామాబాద్, మార్చి 3: పాకిస్థాన్ నూతన ప్రధానమంత్రిగా పాకిస్థాన్ ముస్లిం లీగ్-నవాజ్ (పీఎంఎల్-ఎన్) అధ్యక్షుడు షహబాజ్ షరీఫ్(72) వరుసగా రెండోసారి ఎన్నికయ్యారు. నేషనల్ అసెంబ్లీలో ఆదివారం నిర్వహించిన ఓటింగ్‌లో పీఎంఎల్-ఎన్, పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ(పీపీపీ) తరఫు అభ్యర్థి షహబాజ్‌కు 201 ఓట్లు వచ్చాయి. మొత్తం 336మంది సభ్యుల పార్లమెంట్‌లో సభా నాయకుడు కావడానికి అవసరమైన దానికంటే ఆయన 32ఓట్లు ఎక్కువ సాధించారు. షహబాజ్ ప్రత్యర్థి, పాకిస్థాన్ తెహ్రీక్-ఇ-ఇన్సాఫ్(పీటీఐ) అభ్యర్థి ఒమర్ అయూబ్ ఖాన్‌కు 92 ఓట్లు వచ్చాయి. దీంతో పాక్ 24వ ప్రధానిగా షహబాజ్‌ను నియమిస్తూ నేషనల్ అసెంబ్లీ స్పీకర్ సర్దార్ అయాజ్ సాదిక్ ప్రకటన చేశారు. ఐవాన్-ఎ-సదర్‌లోని అధ్యక్ష భవనంలో సోమవారం షహబాజ్ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఓటింగ్ నేపథ్యంలో పీటీఐ మద్దతు కలిగిన చట్ట సభ్యుల నినాదాలు, గందరగోళ పరిస్థితుల మధ్య కొత్త పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. కాగా, షహబాజ్ ఆదివారం తన ప్రసంగంలో కశ్మీర్ అంశాన్ని లేవనెత్తారు. కశ్మీర్, పాలస్తీనాలకు స్వాతంత్ర్యం ఉండాలన్నారు.

అపరిచిత మహిళను 'డార్లింగ్' అనడం తప్పే

కోల్‌కతా, మార్చి 3: పరిచయం లేని మహిళను 'డార్లింగ్' అని పిలవడం తప్పేనని కలకత్తా హైకోర్టు పోర్టుబ్లెయిర్ బెంచ్ స్పష్టం చేసింది. ఇది లైంగిక వేధింపుల కిందకి వచ్చే వ్యాఖ్యని అభిప్రాయపడింది. లైంగిక దృష్టి తో చేసిన ఇలాంటి మాటలకు ఐపీసీలోని సెక్షన్ 354ఏ ప్రకారం శిక్షలు విధించాల్సి ఉంటుందని జస్టిస్ జయ్ సేన్‌గుప్తా ఏకసభ్య ధర్మాసనం తెలిపింది. ముద్దాయికి నెల రోజుల జైలు శిక్ష విధించింది. అపరిచితుల పట్ల ఇలాంటి వ్యాఖ్యలు చేయడాన్ని భారత సమాజం అంగీకరించదని పేర్కొంది. గతేడాది అండమాన్ దీవుల్లోని మాయాబందర్‌లో దుర్గాపూజ వద్ద గొడవ జరుగుతోందంటూ సమాచారం అందడంతో ఒక మహిళా కానిస్టేబుల్ సహా పోలీసు బృందం అక్కడికి వెళ్లింది. మద్యం మత్తులో ఉన్న జనక్ రాం అనే నిందితుడు ఆ మహిళా పోలీసును ఉద్దేశించి 'క్యా డార్లింగ్ చలాన్ కర్నే ఆయా హైక్యా?' (డార్లింగ్, చలానా రాయడానికి వచ్చారా?) అన్నాడు. దీన్ని అవమానకరంగా భావించిన ఆ కానిస్టేబుల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది.

బెంగళూరు పేలుళ్ల సూత్రధారి ఆచూకీ లభ్యం

బెంగళూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు వైట్‌ఫీల్డ్ రామేశ్వరం కేఫ్‌లో బాంబు పేలుళ్ల సూత్రధారి ఆచూకీ లభించిందని, త్వరలోనే అరెస్టు చేస్తామని కర్ణాటక హోంమంత్రి పరమేశ్వర్ తెలిపారు. సదాశివనగర్‌లోని తన నివాసం వద్ద ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. నిందితుడి కోసం 8 బృందాలు గాలిస్తున్నాయని, అన్ని కోణాల్లోనూ దర్యాప్తు సాగుతోందన్నారు. అతడి వెనుక ఏవైనా సంస్థలు ఉన్నాయా.. దాడి ఉద్దేశం ఏమిటన్నది దర్యాప్తులో తేలాల్సి ఉందన్నారు. కాగా రామేశ్వరం కేఫ్‌లో బాంబు పేలుళ్లపై కర్ణాటక మత్స్యశాఖ మంత్రి మంకాళవైద్య బీజేపీపై సంచలన ఆరోపణలు చేశారు. బాంబుపేలుళ్లు ఎన్నికల వేళే చోటు చేసుకుంటాయని, ఇది బీజేపీ కుట్ర అని అన్నారు.

బుర్కినాఫాసోలో 170 మంది గ్రామస్థుల ఉరితీత

న్యూఢిల్లీ, మార్చి 3: ఆఫ్రికా ఖండంలోని బుర్కినాఫాసో దేశంలో మూడు గ్రామాలకు చెందిన సుమారు 170 మందిని కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ఉరితీసినట్టు అధికార వర్గాలు తెలిపాయి. వారం రోజుల క్రితం దేశం ఉత్తర ప్రాంతంలో ఉన్న యెటెంగ ప్రావిన్స్‌లోని కొమ్సిలిగ, నోడిన్, సొరేయ్ గ్రామాల్లో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఇందుకు పాల్పడినవారు ఎవరన్నది ఇంకా తెలియనప్పటికీ ఇది జిహాదీల పనేనని అనుమానిస్తున్నారు. బాధితుల్లో పిల్లలు, మహిళలు కూడా ఉన్నారు. గత నెల 25న ఒక మసీదు, కేథలిక్ చర్చిపై దాడులు జరగడంతో 15 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారు. ఈ దేశంలో 2015 నుంచి అల్‌ఖైదా, ఇస్లామిక్ స్టేట్ వంటి జిహాదీ ముఠాలు దాడులు చేస్తున్నాయి. ఈ దాడుల్లో ఇంతవరకు 20వేల మంది ప్రాణాలు కోల్పోగా, 20 లక్షల మంది నిరాశ్రయులయ్యారు. ఈ దాడులను ఎదుర్కోవడంలో ప్రభుత్వం విఫలం కావడంతో 2022లో రెండుసార్లు సైనిక తిరుగుబాట్లు జరిగాయి కూడా.

'ఇండియా' ఎన్నికల భేరి!

పట్నాలో భారీస్థాయిలో 'జనవిశ్వాస్ మహా ర్యాలీ'.. రాహుల్, ఖర్గే, అఖిలేశ్, లాలూ హాజరు

పట్నా, మార్చి 3: లోక్‌సభ ఎన్నికలకు విపక్ష 'ఇండియా' కూటమి ప్రచార భేరి మోగించింది. ఆదివారం బిహార్ రాజధాని పట్నాలో భారీ ర్యాలీ నిర్వహించింది. ఆ రాష్ట్రంలో 'ఇండియా' కూటమికి సారథ్యం వహిస్తున్న ఆర్‌జేడీ.. 'జనవిశ్వాస్ మహా ర్యాలీ' పేరిట పెద్దఎత్తున బహిరంగ సభ నిర్వహించింది. తేజస్వి యాదవ్ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన 'జన విశ్వాస యాత్ర' ముగింపు సందర్భంగా నిర్వహించిన ఈ ర్యాలీ సంపూర్ణంగా విజయవంతమైంది. ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, సమాజ్‌వాదీ, ఆర్‌జేడీ, వామపక్షాల అగ్ర నేతలు, అఖిలేశ్ యాదవ్, లాలూప్రసాద్ యాదవ్, తేజస్వి, సీతారాం ఏచూరి, డి.రాజా, దీపాంకర్ భట్టాచార్య తదితరులు హాజరయ్యారు. మధ్యప్రదేశ్‌లో భారత్ జోడో న్యాయ యాత్రలో ఉన్న కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ కూడా పట్నా వచ్చి ర్యాలీలో పావుగంట సేపు మాట్లాడి.. మైకు ఖర్గేకు ఇచ్చి తిరిగి వెళ్లిపోయారు. బిహార్లోని మహాకూటమితో తెగతెంపులు చేసుకుని తిరిగి ఎన్డీయా గూటికి చేరిన సీఎం నితీశ్‌కుమార్‌పై వారంతా విరుచుకుపడ్డారు. 17 నెలలపాటు ఉపముఖ్యమంత్రిగా ఉన్న తేజస్వి రాష్ట్రంలో పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించారని ఖర్గే కొనియాడారు. నితీశ్ మళ్లీ కూటమి మారే అవకాశం ఉందని.. ఇక ఆయన్ను ఆహ్వానించవద్దని సూచించారు. లాలూ యథాప్రకారం నితీశ్‌పై చెణుకులు విసిరారు. '2017లో కూడా ఇలాగే ఆయన ఫిరాయించారు. అప్పుడు ఆయన్ను నేను దూషించలేదు. పల్టూరామ్ అని మాత్రమే అన్నాను. ఆ బిరుదు ఆయన చర్యలకు అనుగుణంగానే ఉంది. సోషల్ మీడియాలో ఆయనపై వ్యంగ్య వీడియోలు వచ్చాయి. అవి చూశాకైనా ఆయన సిగ్గుపడలేదా' అని వ్యాఖ్యానించారు. ఈసారి మళ్లీ తన వద్దకు వస్తే ఆయన్ను బయటకు నెట్టేస్తానని స్పష్టం చేశారు. రాజకీయాల్లో కుటుంబ పాలనను విమర్శిస్తున్న ప్రధాని మోదీపై మండిపడ్డారు. 'మోదీకి సొంత కుటుంబం లేకపోతే నేనేం చేస్తాను? ఆయనెప్పుడూ రామాలయం గురించి మాట్లాడుతుంటారు. ఆయన అసలైన హిందువే కాదు. హిందూ సంప్రదాయంలో తల్లి చనిపోతే గుండు చేయించుకుంటారు. మోదీ చేయించుకోలేదు' అని వ్యాఖ్యానించారు. యూపీ, బిహార్లలో కలిపి మొత్తం 120 లోక్‌సభ స్థానాలు ఉన్నాయని.. ఈ రాష్ట్రాల్లో ఆ పార్టీని ఓడిస్తే కేంద్రంలో అది అధికారంలోకి రావడం అసాధ్యమని అఖిలేశ్ అన్నారు. 'కొన్ని సార్లు ఇక్కడకు వెళ్తారు.. కొన్ని సార్లు అక్కడకు వెళ్తారు.. జారిపడతారు' అని నితీశ్‌ను తేజస్వి ఎద్దేవాచేశారు. ఈ ర్యాలీకి రాష్ట్రవ్యాప్తంగా ఆర్‌జేడీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ ర్యాలీలో పాల్గొనేందుకు కేరళ ఆర్‌జేడీ అధ్యక్షుడు ఎంవీ శ్రేయమ్స్‌కుమార్ ప్రత్యేకంగా అక్కడి నుంచి వచ్చారు.



జనవిశ్వాస్ ర్యాలీలో రాహుల్, తేజస్వీ, అఖిలేశ్

అట్టడుగు వర్గాలకు మోదీ సర్కారు అన్యాయం

పట్నా/న్యూఢిల్లీ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): దేశంలో అట్టడుగు వర్గాలకు చెందిన 73% జనాభాను మోదీ సర్కారు నిర్లక్ష్యం చేస్తోందని రాహుల్‌గాంధీ మండిపడ్డారు. 'జనవిశ్వాస్ ర్యాలీ'లో పాల్గొన్న ఆయన.. బీజేపీపై పరోక్ష విమర్శలు చేశారు. 'ఒక పార్టీ' ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తోందని.. అయితే తాము విద్వేషపు మార్కెట్‌లో ప్రేమ దుకాణం తెరిచామని వ్యాఖ్యానించారు. 'అగ్నిపథ్ రిక్రూట్‌మెంట్ స్కీంకు వ్యతిరేకంగా బిహార్‌లో జరిగిన ఆందోళనలను గుర్తు చేసిన ఆయన.. యువతను ఈ మోదీ సర్కారు పట్టించుకోదంటూ విమర్శించారు. కాగా, పేద, మధ్య తరగతి ప్రజలకు రైల్వేను దూరం చేసే కుట్ర జరుగుతుందని రాహుల్ ఆరోపించారు. సంపన్నులను దృష్టిలో ఉంచుకునే రైల్వేలో కొత్త విధానాలను కేంద్రం ప్రవేశపెడుతోందన్నారు.

వచ్చే ఐదేళ్లలో ఏం చేద్దాం?

- మోదీ అధ్యక్షతన కేంద్ర మంత్రి మండలి రోజంతా మేధోమథనం
- ఎన్నికల్లో విజేతలై రావాలంటూ మంత్రులకు మోదీ వీడ్కోలు సందేశం



న్యూఢిల్లీ, మార్చి 3: వచ్చే ఎన్నికల తర్వాత మళ్లీ తమ ప్రభుత్వమే ఏర్పాటవుతుందన్న నమ్మకంతో ఉన్న ప్రధాన మోదీ.. కొత్త సర్కారు ఏర్పడిన వెంటనే చేపట్టాల్సిన కార్యాచరణపై మంత్రిమండలి సమావేశాన్ని నిర్వహించారు. మోదీ అధ్యక్షతన గురువారం సమావేశమైన కేంద్ర మంత్రి మండలి.. వచ్చే రెండు దశాబ్దాలకు సంబంధించిన వికసిత్ భారత్-2047 విజన్ డాక్యుమెంట్‌పై, వచ్చే ఐదేళ్లకు సంబంధించిన సమగ్ర కార్యాచరణ ప్రణాళికపై రోజంతా మేధోమథనం జరిపింది. ఈ మేరకు వీటి తక్షణ అమలు కోసం.. లోక్‌సభ ఎన్నికలు ముగిసిన తర్వాత మే నెలలో ప్రభుత్వం ఏర్పాటు కాగానే 100 రోజుల్లో చేపట్టాల్సిన కార్యాచరణపైనా చర్చించారు. కొత్త ప్రభుత్వం చేపట్టాల్సిన పనులపై స్పష్టమైన ప్రణాళికలతో రావాలని భేటీకి ముందు మంత్రులను ప్రధాని ఆదేశించారు. దీంతో పలువురు మంత్రులు, కార్యదర్శులు తమ ఆలోచనలను సమావేశంలో పంచుకున్నారు. వివిధ అంశాలపై ప్రజెంటేషన్లు కూడా ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ, కొత్త ప్రభుత్వం జూన్ నెలలో ప్రవేశపెట్టే పూర్తిస్థాయి బడ్జెట్ ద్వారా వికసిత్ భారత్ దిశగా అడుగులు వేయాలని, బడ్జెట్‌లో అది ప్రతిఫలించాలని పిలుపునిచ్చారు. ఆవిష్కరణల రంగంలో భారత్‌ను అగ్రగామిగా నిలిపేలా భవిష్యత్ టెక్నాలజీలను అభివృద్ధి చేయటానికి వీలుగా బడ్జెట్‌లో రూ.ఒక లక్ష కోట్ల భారీ నిధులను కేటాయించే అంశంపై మోదీ మాట్లాడారు.

ప్రజల మనసులను గెలవండి!

లోక్‌సభ ఎన్నికలకు రంగం సిద్ధమైన నేపథ్యంలో మంత్రులకు ప్రధాని మోదీ పలు సూచనలు కూడా చేసినట్లు సమాచారం. వివాదాలకు దూరంగా ఉండాలని, ముఖ్యంగా ఇటీవల తీవ్ర వివాదాస్పదమవుతున్న డీప్‌ఫేక్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాలని మంత్రులను ఆయన హెచ్చరించారు. మాట్లాడే ప్రతీ మాట పట్లా జాగ్రత్తగా ఉండాలని మోదీ చెప్పినట్లుగా సంబంధిత వర్గాలు తెలిపాయి. 'వెళ్లండి.. ఎన్నికల్లో విజేతలుగా నిలవండి.. మిమ్మల్ని నేను మళ్లీ కలుస్తా' అని మోదీ వారికి వీడ్కోలు సందేశం ఇచ్చారు. కాగా, మంత్రిమండలి మేధోమథనం నేపథ్యంలో.. వికసిత్ భారత్-2047 గురించి ప్రభుత్వ వర్గాలు వివరాలు వెల్లడించాయి. ఈ డాక్యుమెంట్ రూపకల్పన కోసం డిసెంబరు 2021 నుంచి ఈ ఏడాది జనవరి వరకూ కేంద్ర మంత్రిత్వశాఖల ఆధ్వర్యంలో 2,700కుపైగా సమావేశాలు, వర్క్‌షాపులు వివిధ స్థాయిల్లో జరిగాయని వెల్లడించాయి.

పీక మీద కత్తి పెట్టి.. ఏడుగురు రేప్ చేశారు..

ఝార్ఖండ్‌లో తనపై జరిగిన దారుణాన్ని ఇన్‌స్టాలో వెల్లడించిన స్పెయిన్ యువతి

న్యూఢిల్లీ, మార్చి 3: దక్షిణాసియా పర్యటన కోసం ఎక్కడో స్పెయిన్ నుంచి బైక్‌లపై భారత్‌కు వచ్చిన పర్యాటకులు(ట్రావెల్ వ్లోగర్స్) ఆ దంపతులు. అయితే, భారత పర్యటన వారికి పీడకల మిగిల్చింది. ఆ జంటలోని 28 ఏళ్ల మహిళపై ఏడుగురు సామూహిక అత్యాచారానికి తెగబడ్డారు. ఆ దంపతుల పీక మీద కత్తి పెట్టి, వారిని కొట్టి, హింసించి ప్రాణం తీస్తామని బెదిరించి ఆ మహిళపై అత్యాచారానికి పాల్పడ్డారా కిరాతకులు. దేశానికే కళంకం తెచ్చిన ఈ ఘటన ఝార్ఖండ్‌లోని దుమ్‌కా జిల్లాలో శుక్రవారం రాత్రి జరగ్గా... తనకు ఎదురైన చేదు అనుభవాన్ని వివరిస్తూ బాధితురాలు ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ వీడియోను పోస్ట్ చేసింది. "మేము ఆస్పత్రిలో ఉన్నాం. మాకు జరిగింది మరెవరికీ జరగకూడదు. నన్ను, నా భర్తను కొట్టారు. పీక మీద కత్తి పెట్టి చంపేస్తామని బెదిరించారు. నన్ను ఏడుగురు రేప్ చేశారు. మా వస్తువులను ఎత్తుకెళ్లారు" అని ఆమె వీడియోలో పేర్కొంది. కాగా, శుక్రవారం అర్ధరాత్రి తర్వాత అటుగా వచ్చిన పోలీసు వాహనాన్ని ఆపి తమకు జరిగిన దారుణాన్ని ఆ మహిళ వెల్లడించడంతో విషయం తమకు తెలిసిందని స్థానిక పోలీసులు వెల్లడించారు. దుమ్‌కా వద్ద ఓ నిర్మానుష్య ప్రదేశంలో తాత్కాలిక గుడారాన్ని వేసుకుని రాత్రి తాము నిద్రిస్తుండగా స్థానిక యువకులు లోపలికి ప్రవేశించి దాడి చేసి అత్యాచారానికి పాల్పడ్డారని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ కేసులో ఏడుగురు నిందితులను గుర్తించామని వారిలో నలుగురిని ఇప్పటికే అరెస్టు చేశామని పోలీసులు ప్రకటించారు.

ప్రేమ విఫలమై ఆత్మహత్య చేసుకుంటే యువతి బాధ్యత లేదు

ముంబై, మార్చి 3: ప్రేమ విఫలమై మానసిక క్షోభతో యువకుడు ఆత్మహత్య చేసుకుంటే అందుకు యువతే కారణమని చట్టప్రకారం చెప్పలేమని ముంబయి కోర్టు తెలిపింది. ఆత్మహత్యకు ప్రేరేపించినట్టుగా భావించి శిక్ష విధించలేమని పేర్కొంది. ప్రేమను తిరస్కరించడం కారణంగా మానసిక ఒత్తిడికి లోనయ్యే సంఘటనల విషయమై చట్టంలో ఎలాంటి నిబంధనలు లేవని స్పష్టం చేసింది. ఈ మేరకు ముంబైలోని అదనపు సెషన్స్ జడ్జి ఎన్.పి.మెహతా తీర్పు చెప్పారు. మనీషా చూడాసమ, నితిన్ కేనీలు తొలుత ప్రేమించుకొని విడిపోయారు. ఆ తరువాత మనీషా రాజేష్ పన్వర్ అనే యువకునితో స్నేహం చేసింది. అయినా నితిన్ ఆమె వెంటపడడం మానలేదు. చివరకు మానసిక ఒత్తిడిని తట్టుకోలేక నితిన్ 2016 జనవరి 15న ఇంట్లోనే ఆత్మహత్య చేసుకున్నాడు. అతని ఆత్మహత్యకు మనీషా, రాజేష్‌లే కారణమంటూ కేసు నమోదైంది. చట్టంలో తగిన నిబంధనలు లేనందున ఆత్మహత్యకు ప్రేరేపించారంటూ వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేమని జడ్జి పేర్కొన్నారు. "ఇష్టం వచ్చినట్టు ప్రియుడ్ని మార్చడం నైతికంగా తప్పే. కానీ, ఆత్మహత్యకు ప్రేమికురాలే కారణమని కేసు పెట్టే అవకాశం లేదు" అని జడ్జి తెలిపారు.

బీజేపీలో టికెట్ల చిచ్చు

టికెట్ ఇవ్వకపోవడంతో కేంద్ర మాజీ మంత్రి అలక

- రాజకీయాలకు హర్షవర్ధన్ గుడ్‌బై

న్యూఢిల్లీ, మార్చి 3: బీజేపీలో టికెట్ల చిచ్చు రేగింది. రానున్న లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ప్రకటించిన తొలి జాబితాలో టికెట్ దక్కని పలువురు నాయకులు అలక బూనారు. ప్రధానంగా కేంద్ర ఆరోగ్యశాఖ మాజీ మంత్రి, ఢిల్లీకి చెందిన డాక్టర్ హర్షవర్ధన్ తీవ్రంగా నొచ్చుకున్నారు. ఈ క్రమంలో ఆయన ఏకంగా రాజకీయాలనే వదిలేస్తున్నట్టు ప్రకటించారు. 69 ఏళ్ల హర్షవర్ధన్.. ఢిల్లీలోని చాందినీ చౌక్ నియోజకవర్గం నుంచి లోక్‌సభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. బీజేపీ తొలి జాబితాలో ఈ సీటును వేరే వారికి కేటాయించడంతో ఆదివారం ఆయన స్పందిస్తూ రాజకీయాల నుంచి తాను విరమించుకుంటున్నట్టు తెలిపారు. గత 30 ఏళ్లకు పైగా తాను ప్రత్యక్ష రాజకీయాల్లో ఉన్నానని, మొత్తం ఏడు ఎన్నికల్లో(5 సార్లు అసెంబ్లీ, 2 సార్లు లోక్‌సభ) పోటీ చేసి, ప్రతిసారీ భారీ మెజారిటీతో విజయం దక్కించుకున్నట్టు పేర్కొన్నారు. అంతిమంగా తన వైద్య వృత్తి వైపు అడుగులు వేయాలని నిర్ణయించుకున్నట్టు పేర్కొన్నారు. రాజకీయాల్లో తనను ప్రోత్సహించిన ప్రధాని నరేంద్ర మోదీ, సహకరించిన కార్యకర్తలకు హర్షవర్ధన్ ధన్యవాదాలు తెలిపారు. బీజేపీ తొలి జాబితాలో ఢిల్లీకి చెందిన నలుగురు సిటింగ్ ఎంపీలను పక్కన పెట్టింది. వీరిలో హర్షవర్ధన్‌తోపాటు పర్వేశ్ వర్మ, రమేశ్‌బిధురి, మీనాక్షి లేఖి ఉన్నారు.

పోటీ చేయను: పవన్ సింగ్

టికెట్ ఇచ్చినా పోటీ చేయబోనని పశ్చిమ బెంగాల్‌కు చెందిన బీజేపీ నేత, ప్రముఖ భోజ్‌పురి గాయకుడు, నటుడు పవన్‌సింగ్ వెల్లడించారు. బీజేపీ ప్రకటించిన తొలి జాబితాలో బెంగాల్‌లోని అసన్‌సోల్ నియోజకవర్గం అభ్యర్థిగా పవన్ సింగ్‌ను ప్రకటించారు. అయితే, పవన్ తాను పోటీ చేయబోనని తేల్చి చెప్పారు. కొన్ని కారణాల రీత్యా నేను పోటీ చేయదలుచుకోలేదని పవన్ సింగ్ 'ఎక్స్'లో వెల్లడించారు. కాగా, పవన్ నిర్ణయంపై అధికార పార్టీ టీఎంసీ నేతలు ఎద్దేవా చేశారు. "పోటీకి ముందే చేతులెత్తాశారు" అని వ్యాఖ్యలు చేశారు.

బీజేపీకి మోదీ రూ. 2వేల విరాళం

లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ విరాళాలకు బీజేపీ పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ బీజేపీకి 'పార్టీ ఫండ్'గా రూ.2 వేలు విరాళంగా ఇచ్చారు. ఈ విషయాన్ని ఆయన ఆదివారం 'ఎక్స్' వేదికగా ప్రకటించారు. పౌరులందరూ నమో యాప్ ద్వారా తమకు తోచినంత చందా ఇవ్వాలని, 'దేశ నిర్మాణం కోసం విరాళం' (డొనేషన్ ఫర్ నేషన్ బిల్డింగ్)లో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరారు. "వికసిత భారత్ కోసం మన ప్రయత్నాలను బలోపేతం చేయాలి. ఇందుకు ప్రతి పౌరుడు నమో యాప్ ద్వారా విరాళం ఇవ్వాలని కోరుతున్నా" అని మోదీ 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు.

బీఎస్ఎఫ్‌లో తొలి మహిళా స్నైపర్‌గా సుమన్ కుమారి



న్యూఢిల్లీ, మార్చి 3: బీఎస్ఎఫ్ దళంలో తొలి మహిళా స్నైపర్‌గా సబ్ ఇన్‌స్పెక్టర్ సుమన్ కుమారి గుర్తింపు పొందారు. ఇండోర్‌లోని సెంట్రల్ స్కూల్ ఆఫ్ వెపన్స్ అండ్ టాక్టిక్స్ (సీఎస్‌డబ్ల్యూటీ)లో ఎనిమిది వారాల పాటు శిక్షణ పొంది ఈ ఘనతను సాధించారు. బీఎస్ఎఫ్ జవాన్లకు కమాండో శిక్షణ తరువాత అత్యంత కఠినమైన స్నైపర్ శిక్షణ ఇస్తారు. మొత్తం 56 మంది ఈ శిక్షణ పొందగా అందులో ఏకైక మహిళ సుమన్ కుమారే కావడం విశేషం. ఈ శిక్షణలో ప్రతిభ చూపించిన వారికి ఆల్ఫా, బ్రేవో గ్రేడ్లు ఇస్తారు. అయితే ఆమెకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించిన ఇన్‌స్ట్రక్టర్ గ్రేడ్ ఇచ్చినట్టు ఆ శిక్షణ కేంద్రం ఇన్‌స్పెక్టర్ జనరల్ భాస్కర్ సింగ్ రావత్ చెప్పారు. దీంతో ఆమె స్నైపర్లకు శిక్షణ ఇచ్చే స్థాయిని పొందారని వివరించారు. హిమాచల్ ప్రదేశ్‌లోని మండీ జిల్లా సుమన్ కుమారి స్వస్థలం.

మత విద్వేష ప్రచారకులకు బ్రిటన్‌లో ప్రవేశంపై నిషేధం!

లండన్, మార్చి 3: తీవ్రవాద ఇస్లామిక్ భావజాలంతో విద్వేషపూరిత ప్రసంగాలు చేసే ముస్లిం ప్రచారకులను దేశంలోకి రానీయకూడదని బ్రిటన్ నిర్ణయించింది. ముఖ్యంగా పాకిస్థాన్, అఫ్ఘానిస్థాన్, ఇండోనేషియా వంటి దేశాల వారికి ఇది వర్తించనుంది. ఈ మేరకు ప్రభుత్వం నిబంధనలు రూపొందించనుందని ఆదివారం మీడియా వర్గాలు వెల్లడించాయి. శుక్రవారం ప్రధాని రిషి సునాక్ తన అధికారిక నివాసంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ తీవ్రవాదుల కారణంగా దేశ ప్రజాస్వామ్యానికి, బహుళ మత విశ్వాసాలకు నష్టం కలుగుతోందని చెప్పారు. అలాంటి వారిని దేశంలోకి రానీయబోమని తెలిపారు.

హైతీలో జైలుపై సాయుధ ముఠాల దాడి

వందలాది మంది కరడుగట్టిన ఖైదీల పరార్.. రణరంగంగా దేశ రాజధాని

పోర్ట్ ఔ ప్రిన్స్, మార్చి 3: హైతీ రాజధాని పోర్ట్ ఔ ప్రిన్స్‌లో సాయుధ ముఠాలు రెచ్చిపోయాయి. నగరం రణరంగాన్ని తలపిస్తోంది. కరడుగట్టిన నేరగాళ్లను బంధించే నేషనల్ పెనిటెన్షియరీ జైలుపై సాయుధ ముఠాలు దాడి చేశాయి. ఈ ఘటనలో వందలాది మంది ఖైదీలు తప్పించుకొన్నారు. హైతీ అధ్యక్షుడి హత్య కేసు నిందితులను కూడా ఈ జైలులోనే ఉంచారు. 'సాయుధులైన దుండగులు పూర్తిగా పైచేయి సాధిస్తే.. దాదాపు 3,000 మంది నేరస్థులు నగరంలోకి వస్తారు. ఎవరినీ వదలరు' అని హైతీ పోలీసు యూనియన్లు ఎక్స్‌లో పెట్టిన పోస్ట్‌లో పేర్కొన్నాయి. హైతీ ప్రధాని ఏరియల్ హెన్రీ ఓ రక్షణ ఒప్పందం చేసుకోవడానికి కెన్యా పర్యటనకు వెళ్లారు. ఇదే అదనుగా దేశ రాజధానిలో నేరగాళ్ల ముఠాలు ఒక్కసారిగా రెచ్చిపోయాయి. పోలీస్ స్టేషన్లు, విమానాశ్రయాలు, జైళ్లను లక్ష్యంగా చేసుకొని దాడులు ప్రారంభించాయి. ముఠాల దాడుల నేపథ్యంలో అమెరికా, హైతీ విమానయాన సంస్థలు పలు విమాన సర్వీసులను రద్దు చేశాయి.

అండర్‌వాటర్ తనిఖీలకు మెరైన్ రోబో!

న్యూఢిల్లీ, మార్చి 3: నీటి అడుగున తనిఖీలు, పర్యవేక్షణ కోసం ఐఐటీ-మండి, పాలక్కాడ్ పరిశోధకులు మెరైన్ రోబోను అభివృద్ధి చేశారు. రియల్ టైమ్ సమస్యలను పరిష్కరించేలా దీనిని రూపొందించారు. దాంతో అండర్‌వాటర్ ఆపరేషన్లకు సంబంధించి నిర్వహణ ఖర్చు తగ్గడంతో మనుషుల ప్రాణాలకు ముప్పు తప్పుతుంది. ఈ పరిశోధనకు డీఆర్‌డీవోలోని నావల్ రిసెర్చ్ బోర్డు(ఎన్ఆర్‌డీ) కొంతమేర నిధులు సమకూర్చింది. మెరైన్ రోబోను అండర్‌వాటర్ పర్యవేక్షణ, తనిఖీల కోసం అభివృద్ధి చేశామని పరిశోధకులు తెలిపారు. "పాత డ్యామ్‌ల తనిఖీలను ఎంతో కాలంగా మనషులే చేస్తున్నారు. ఇది చాలా ఖర్చు, రిస్క్‌తో కూడుకున్నది. మెరైన్ రోబోలను డ్యామ్ తనిఖీల్లో భాగం చేస్తే సమయం వ్యయం ఆదా అవుతుంది. అలాగే సురక్షితం కూడా" అని పరిశోధకులు పేర్కొన్నారు.

ఢిల్లీలో రూ.400 కోట్ల ఫామ్‌హౌస్ కూల్చివేత!

న్యూఢిల్లీ, మార్చి 3 : దేశ రాజధాని ఢిల్లీలో ప్రభుత్వ భూముల్లో ఆక్రమణల తొలగింపు కార్యక్రమం కొనసాగుతోంది. అందులో భాగంగా ఢిల్లీలోని ఛత్రపూర్‌లో ప్రముఖ మద్యం వ్యాపారి పాంటీ చద్దాకు చెందిన రూ.400 కోట్ల విలువైన ఫామ్ హౌస్‌ను ఢిల్లీ డెవలప్‌మెంట్ అథారిటీ(డీడీఏ) అధికారులు శుక్ర, శనివారాల్లో కూల్చివేశారు. "ప్రభుత్వ భూములను ఆక్రమించి అక్రమంగా నిర్మించిన కట్టడాలను తొలగించి... ఆ భూములను స్వాధీనం చేసుకొనే ప్రక్రియ కొనసాగిస్తున్నాం... అందులో భాగంగానే పాంటీ చద్దా అలియాస్ గుర్దీప్ సింగ్ 10 ఎకరాల ప్రభుత్వ భూమిలో కట్టిన ఫామ్ హౌస్‌ను కూల్చివేశాం" అని డీడీఏ అధికారులు శనివారం వెల్లడించారు.

*Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: **K. Srinivas**. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. **Managing Director: Vemuri Radha Krishna,** Founder: K.L.N.Prasad.*